


అది కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్. ఆ రోజు శని వారం, రాత్రి పదకొండు కావస్తోంది. మర్నాడు సెలవు రోజు కావడంతో హాస్టల్ లోని గదులన్నీ సందడిగా ఉన్నాయి విద్యార్థుల ఆటపాటలతో. ఎక్కడ చూసినా నవ్వులు, అరుపులే. ఆ హాస్టల్ నాలుగో అంతస్తులో చివరి సంవత్సరం విద్యార్థులు ఉంటారు. వాళ్ళు కాలేజీ వదిలి వెళ్ళగానే, మూడవ సంవత్సర విద్యార్థులు ఆ అంతస్తులోకి మారుతారు. ఇది ఆ కాలేజీ ఆనవాయితీ. అంతేకాక, నాలుగో అంతస్థు అన్నిటికన్నా పైనది కావడంతో మంచి గాలి, వెలుతురూ ఉంటాయి. ఆ అంతస్థులో చివరి రూమ్ అంటే అందరికీ పిచ్చి. అందులో ఉండటమనేది గొప్పగా భావిస్తారు విద్యార్థులంతా. ఈ సంవత్సరం అందులో ఉన్న ఇద్దరు అదృష్టవంతులలో మన కథ లోని ముఖ్య పాత్రధారి గౌతమ్ ఒకడు.

ఆ గది మహిమో, గౌతమ్ తెలివితేటలో కానీ గౌతమ్ ఇప్పటిదాకా కాలేజీ టాపర్ గా ఉన్నాడు. ఇవాళ ఆ అదృష్టం రెట్టింపు అయ్యింది. ఎందుకంటే, ఈ సంవత్సరపు ప్రాంగణపు నియామకాల్లో తొలి ఉద్యోగం సంపాదించాడు. ఢిల్లీలో ఒక మంచి కంపెనీ లో వచ్చింది నెలకి ఏభయి వేల జీతంతో. ఇప్పుడే ఈ-మెయిల్ ద్వారా ఈ వార్త తెలిసిన గౌతమ్ ఆనందానికి హద్దులు లేవు. ఈ వార్త అతని రూమ్ మేట్ గిరీష్ ద్వారా మిగతా రూమ్ లన్నింటికీ పాకి పోయింది. ఇంకేం, అందరూ రావడం అతన్ని అభినందించడం మొదలయింది. ఈ హడావుడిలో గిరీష్ బయటకు వెళ్లి ఒక కేక్ తేవడం కూడా జరిగిపోయింది. అందరూ కలిసి గౌతమ్ చేత ఆ కేక్ కట్ చేయించారు. అలా ఒక గంట హడావుడిగా గడిపి, అందరూ వారి వారి రూంలోకి వెళ్లిపోయారు. రూమ్ అంతా శుభ్రం చేస్తూ గిరీష్ "ఏరా అమ్మకి ఈ శుభవార్త చెప్పావా" అన్నాడు. గౌతమ్ దానికి "లేదురా , చూస్తున్నావుగా గంట నుంచి ఈ హడావుడి. ఈ అర్ధరాత్రి వేళ అమ్మ నిద్ర చెడగొట్టడం ఇష్టం లేదు. పొద్దున్న లేవగానే చెప్తాను." అన్నాడు. కాసేపటికి ఇద్దరు లైట్ ఆపేసి నిద్రకి ఉపక్రమించారు.

గౌతమ్ పడుకున్నాడే కానీ నిద్ర రావడం లేదు . ఉద్వేగంగా ఉన్న అతని మనసులో గత జ్ఞాపకాలు గిర్రున తిరుగుతున్నాయి. గౌతమ్ పుట్టింది విశాఖపట్నంలో. అతని తల్లి పార్వతి, తండ్రి నారాయణ ఒకే పాఠశాల లో టీచర్లుగా పని చేసేవాళ్ళు. వారిది ప్రేమ వివాహం. వారు చదువుకునే రోజుల్లో పక్క పక్క ఇళ్లలో ఉండేవారు. కాలేజీకి కలిసి వెళ్లి రావడం, కలసి చదువుకోవడం ద్వారా వారిద్దరి మధ్య అనుబంధం ఏర్పడి అది ప్రేమ దాకా దారి తీసింది. అయితే, వారిద్దరివీ వేర్వేరు కులాలు కావడంతో వారి పెద్దలు వివాహానికి ఆమోదించలేదు. కొన్నాళ్లు పెద్దలకి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు కానీ ఫలించలేదు. చివరకు, ఇంట్లో చెప్పకుండా రిజిస్టర్ ఆఫీసులో పెళ్లి చేసుకున్నారు. ఇది నచ్చని వాళ్ళ పెద్దలు ఇంట్లోంచి పంపించేశారు. అలా కట్టుబట్టలతో ఇల్లు విడిచి విశాఖపట్నం చేరారు. మొదట్లో కాస్త కష్టపడ్డా మెల్లగా ఉద్యోగాలు సంపాందించారు. స్కూల్ దగ్గరే ఇల్లు అద్దెకి తీసుకుని కాపురం పెట్టారు. ఆ తరువాత రెండేళ్ళకి గౌతమ్ పుట్టాడు.

అప్పటినుండి వారి ప్రపంచం అంతా గౌతమ్ చుట్టూ తిరిగేది. ఎంతో అపురూపం గా చూసుకొనేవారు. రకరకాలుగా ఆడిస్తూ , కథల ద్వారా మంచి చెడ్డలు వివరిస్తూ చాల బాగా పెంచారు. మనవడు పుట్టాడనే వార్త విని కూడా వారి తల్లి తండ్రులు రాలేదు. దాంతో, ఆ చిన్న ప్రపంచంలో ముగ్గురే మిగిలారు. ఇలా పదిహేనేళ్ళు గడిచి పోయాయి. గౌతమ్ పదో తరగతి కి వచ్చాడు. ఆ రోజు చివరి పరీక్ష రాసి ఇంటికి ఆనందంగా వచ్చిన గౌతమ్ ఇంటిముందున్న జనాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఇంట్లో కెళ్తే తెలిసింది గంట క్రితం తండ్రి హఠాత్తుగా వచ్చిన గుండె నెప్పితో చనిపోయాడని. ఒక్క సారిగా కాళ్ళ క్రింద నుంచి భూమి కదిలిపోయినట్టయింది. చలనం లేని తండ్రిని అలా చూస్తుంటే గుండెల్లోంచి దుఃఖం తన్నుకొస్తోంది. పూర్తి దుఃఖంలో మునిగిపోయిన తల్లిని ఎలా ఓదార్చాలో కూడా తెలియలేదు. విచిత్రమేమిటంటే, ఇంత బాధాకరమైన వార్త తెలిసికూడా తండ్రి తరపు వాళ్ళు కానీ, తల్లి తరపు వాళ్లు కానీ రాలేదు.

స్కూల్ లో మిగతా టీచర్లు, చుట్టు పక్కల వారు వీరిని ఓదార్చి అంత్యక్రియల కార్యక్రమం పూర్తి చేశారు. మెల్ల మెల్లగా చుట్టు పక్కల వారు రావడం తగ్గించేశారు. గౌతమ్ తల్లి పార్వతి జీవితం మీద ఆశ కోల్పోయినా గౌతమ్ కోసం మనసులో ధైర్యము తెచ్చుకుని మళ్ళీ దైనందిన జీవితంలో పడింది దాదాపు నెల రోజుల తరువాత. తామిద్దరూ గౌతమ్ కోసం కన్న కలలు నిజమవ్వాలంటే, తాను ముందుకు సాగడమే కాక గౌతమ్ కి తండ్రి లేని లోటు లేకుండా పెంచాలని దృఢంగా నిశ్చయించుకుంది.

ఆ రోజు నుంచి గౌతమ్ ని మరింత ప్రేమగా , జాగ్రత్తగా చూసుకునేది. ఇప్పుడు ఆమె ప్రపంచమంతా గౌతమే. తన భర్త లేక పోవడం వలన తగ్గిన ఆదాయం పూడ్చడానికి ట్యూషన్లు చెప్పడం, చుట్టు పక్కల ఇళ్లలో వంట చేయడం లాంటివి చేసేది. అలా పార్వతి కాస్తా పార్వతమ్మ గా మారింది. ఈ కష్టాలు గౌతమ్ చూడకూడదని

ఇంటర్మీడియట్ కి పెద్ద కాలేజీలో చేర్పించి హాస్టల్లో ఉంచింది. తల్లిని వదలి వెళ్లనన్న గౌతమ్ తో "హాస్టల్లో ఉంటే నీకు చాల టైం ఉంటుంది చదువుకోవడానికి. అంతే కాక కాలేజీ వాళ్లు హాస్టల్ విద్యార్థులను దగ్గర ఉండి చదివిస్తారు, కాలేజీ అయ్యాక. మా కలలని నిజం చెయ్యడానికి నువ్వు కష్టపడాలి" అని నచ్చ చెప్పింది.

ఆ రోజు నుంచి గౌతమ్ హాస్టల్ లోనే ఉంటున్నాడు గత ఎనిమిది సంవత్సరాల నుంచి, కేవలం సెలవలుకు మాత్రం ఇంటి కి వెళ్ళేవాడు. అలాగే, అతని తల్లి చెప్పిన మాటలు, ఆవిడ తన బాగు కోసం పడుతున్న కష్టాలు చూసి, ఎంతో పట్టుదలతో బాగా చదువుకున్నాడు. గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజీ లో సీట్ తెచ్చుకున్నాడు. అలాగే స్కాలర్ షిప్ తెచ్చుకుని తల్లికి కొంత ఆర్థిక భారం తగ్గించాడు. ఇంజనీరింగ్ అయ్యాక ఎం.టెక్ కూడా కాకినాడలో అదే కాలేజీలో చేసాడు. చివరికి ఈ రోజు మంచి ఉద్యోగం తెచ్చుకున్నాడు. ఇలా గతం గురించి ఆలోచనలతో గడుపుతున్న గౌతమ్ కి నిద్ర పూర్తిగా దూరమైంది. ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా , అమ్మకి ఈ వార్త ఎప్పుడు చెప్తామా అనే ఆత్రత తో ఉన్నాడు.

ఇంత కాలం కష్టపడిన తల్లిని వెంటనే ఉద్యోగం మాన్పించి తనతో ఢిల్లీ తీసుకువెళ్ళాలి అని నిశ్చయించుకున్నాడు. అక్కడ ఏ పనీ చేయకుండా అమ్మ సుఖం గా బ్రతకాలి అనుకున్నాడు. ఇంతలో గౌతమ్ కి అమ్మకి ఇంత సంతోషకరమైన వార్త ఫోన్లో కాకుండా ఇంటికి వెళ్లి నేరుగా చెప్తే చాలా బాగుంటుంది కదా అనిపించింది. ఆలోచన రావడమే తరువాయి వెంటనే తయారయి గిరీష్ ని నిద్ర లేపి తాను ఊరు వెళ్తున్న విషయం చెప్పి ఫస్ట్ బస్సు కి ఇంటికి బయలుదేరాడు.

బస్సు కదలగానే మళ్లీ గతంలోకి వెళ్ళిపోయాడు. ఎనిమిదేళ్ల క్రితం ఇల్లు విడిచి ఇంటర్మీడియట్ లో చేర్పించడానికి అమ్మ కూడా ఈ ఊరు వచ్చింది. ఫీజులన్నీ కట్టి, పుస్తకాలు కొని , హాస్టల్ రూంలోకి వచ్చారు. నేను ఇంటి మీద, అమ్మ మీద బెంగతో దిగులుగా కూర్చున్నాను. అమ్మ మాత్రం చక చకా సామాను రూంలో సర్దుతూ కబుర్లు చెప్తోంది తన బాధని దాచుకుంటూ నన్ను ఉత్సాహపరచడానికి ప్రయత్నిస్తోంది. ఇంతలో వచ్చాడు ఆ గది లోకి ఒక అబ్బాయి , నా వయసు వాడే . "నా పేరు గిరీష్. నేనూ ఇవాళే కాలేజీలో చేరాను. నాకూ ఈ రూమే ఇచ్చారు. ఇవాల్టి నుంచి నీకు రూమ్ మేట్ ని. " అని పరిచయం చేసుకున్నాడు. నేను కూడా నా పేరు చెప్పి పరిచయం చేసుకున్నాను. ఇంతలో అమ్మ తనను పరిచయం చేసుకుంటూ ఇద్దరూ కలసి మెలిసి ఉండమని, సమయానికి తిని, పడుకోమని, బాగా చదువుకోమని చెప్పింది. అతను చిరునవ్వుతో "అవన్నీ నాకు వదిలేయండి ఆంటీ. మీరు నిశ్చింతగా ఇంటికి వెళ్ళండి" అని ఒక పెద్ద వాడిలాగా ధైర్యం చెప్పాడు. అతని చురుకుతనం నచ్చిందో, అతని మాటలు నచ్చాయో కానీ అమ్మ తృప్తిగా ఇంటికి వెళ్ళిపోయింది. వెంటనే గిరీష్ "పద, అలా బయటికి వెళ్దాం అన్నాడు". ఒక రకమైన బెంగతో ఉన్న నేను అతని

వెంట బయటకు వెళ్ళాను. ఇద్దరం కలిసి కాలేజీ అంతా చుట్టొచ్చాం ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ. విచిత్రం ఏమిటంటే గిరీష్ కి నా లాగ ఇంటి మీద బెంగ లేదు. ఇంట్లో వారు పెట్టే నిబంధనలు , నియమాలు తట్టుకోలేక బయటకు వచ్చేసాడు. తనకు నచ్చినట్టుగా బ్రతకాలనే కోరిక బలంగా ఉంది. అలాని, అతను చదువును నిర్లక్ష్యం చేయలేదు. మంచి మార్కులతో పాస్ అయ్యాడు.

తొందర్లోనే ఇద్దరం మంచి స్నేహితులమయిపోయాం . గిరీష్ కలుపుగోలుతనం వలన ఎంతో మంది మంచి స్నేహితులు దొరికారు నాకు. అందరూ ఎంతో సరదాగా ఉండేవారు. మా క్లాస్ లో హోమ్ వర్క్ చేసిన పుస్తకాలు సార్ వచ్చే సరికి ఆయన టేబుల్ పై సిద్ధంగా ఉంచాలి. అయినా పైనున్న రెండు, మూడు పుస్తకాలు మాత్రమే చూసేవారు సమయం సరిపోక. ఇది గమనించిన హోమ్ వర్క్ సరిగ్గా చెయ్యని మా క్లాస్ వాళ్లు, వాళ్ళ పుస్తకాలు అన్నిటికంటే క్రింద పెట్టేవాళ్ళు. ఇలా చాల రోజులు సాగింది. ఒకరోజు ఆయన ఎందుకో పుస్తకాలన్నీ తీసి తలక్రిందులుగా పెట్టి పైన రెండిటిని తీశారు. ఇంకేం , మా వాళ్ళ నాటకం తెలిసి పోయింది. అందరూ పగలబడి నవ్వుకున్నాము. ఇంకోసారి మా క్లాస్ వాళ్ళని సైన్సు ఎగ్జిబిషన్ కి తీసుకెళ్లారు. మాలో ఇద్దరు కొంటె విద్యార్థులు అక్కడి వరకూ వచ్చి లోపలికి రాకుండా ఎదురుగుండా ఉన్న సినిమా హాల్లో సినిమాకి వెళ్లి చివర్లో వచ్చి కలిశారు. విచిత్రం ఏమిటంటే, మాతో వచ్చిన ఇంచార్జి సార్ మాత్రం వాళ్ళని ఏమీ అనలేదు. మరునాడు, కాలేజిలో ఆ ఇద్దరు కొంటె విద్యార్థులని అడిగితే "ఆయన ఏమీ అనలేరు , ఎందుకంటే ఆయన కూడా అదే సినిమాకి వచ్చి మాకు దొరికిపోయారు". అంతే, అందరూ పగలబడి నవ్వాము . ఇలా రెండు సంవత్సరాలు ఎలా గడిచిపోయాయో కూడా తెలియలేదు. ఇంత బాగుంటుందా బయట ప్రపంచం అని నాకు అనిపించేది. ఇంటికి వెళ్ళినప్పుడు కూడా కాలేజీ సంగతులు చెప్పి అమ్మని నవ్విస్తూ ఉండేవాన్ని అమ్మకి కూడా తృప్తిగా ఉండేది, నేను బెంగ పెట్టుకోకుండా వారందరితో కలిసిపోవడం చూసి.

అలా ఇంటర్మీడియేట్ అవ్వడం, మాలో చాలా మంది ఇంజనీరింగ్ సీట్ తెచ్చుకొని చేరడం జరిగింది. నాకు, గిరీష్ కి మా అదృష్టం కొద్దీ ఒకే కాలేజీలో, ఒకే బ్రాంచిలో సీట్ వచ్చింది. కాకపోతే, నాకు ఫ్రీ సీట్ వచ్చింది, గిరీష్ డొనేషన్ కట్టాడు. ఇద్దరం గట్టి ప్రయత్నం చేసి ఒకే రూమ్ కూడా సంపాదించాం. ఇంజనీరింగ్ చదువు చాలా సరదాగా గడిచింది. విద్యార్థుల అల్లరి పనులు, ప్రేమ వ్యవహారాలు, లెక్చరర్లకి పేర్లు పెట్టడం, వాళ్ళని అనుకరించడం, ఆటలు, పాటలు, గొడవలు, ర్యాగింగ్ , ఎలక్షన్స్ ఇలా రాస్తూ పోతే ఎన్నో తీపి జ్ఞాపకాలు. అయితే, సాధారణంగా ఇవ్వన్నీ ఏ కాలేజీలో అయినా జరిగేవే , చాలా మంది విద్యార్థులు అనుభవించేవే. ఇవి కాకుండా ఇంజనీరింగ్ కాలేజీలో గడిపిన నాలుగేళ్ళ జీవితం నన్ను ఎంతో మార్చింది. జీవితం పట్ల ఒక అవగాహన ఒక ధ్యేయం ఏర్పరిచాయి. దానికి ముఖ్య కారణం గిరీష్ తో పాటు కొత్తగా దొరికిన స్నేహితులు శ్రీరామ్, సూర్య, మా సత్యమూర్తి సార్.

శ్రీరామ్ కి ప్రపంచ జ్ఞానం చాలా ఎక్కువ. ఎప్పుడూ ప్రపంచ చరిత్ర గురించి కానీ, భౌగోళిక స్వరూపం గురించి కానీ, ఆర్థిక వ్యవస్థ గురించి కానీ మాట్లాడుతుంటాడు. వాటిని ఎంతో ఆసక్తికరంగా చెప్తుంటాడు. అతని మాటలు వింటుంటే ఎన్నో సంగతులు తెలుస్తాయి. వీటిలో నేను ఎంతో వెనుకపడ్డాను కదా అనిపించేది . ఒక సారి ఇన్ని తెలిసిన నీవు ఇంజనీరింగ్ లో ఎందుకు చేరావు అన్నాను. దానికి వాడు "తల్లి తండ్రుల కోరిక, వీటికున్న ఉద్యోగావకాశాలు వలన చేరాను. కానీ, నాకు ఆసక్తి ఉన్న విషయాలపైన కూడా మంచి అవగాహన పెంచుకొని ప్రగతి సాధిస్తాను" అన్నాడు. అది విన్న నేను మొదటసారిగా "నా ఆశయం ఏమిటి? " అని ప్రశ్నించుకున్నాను.

ఇంక సూర్య విషయానికి వస్తే అతను ఒక అభ్యుదయవాది. అతని ఆలోచనలు, అభిప్రాయాలు, అతడు చేసే పనులు మా అందరి కంటే చాలా విభిన్నంగా ఉండేవి. సమాజంలో ఉన్న కుల, మత , ఆర్థిక అసమానతల పైనా, మూఢ నమ్మకాల పైనా, చాదస్తాల పైనా తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పేవాడు. అవసరమైతే వాటిని సాధించే వరకు పోరాడేవాడు కూడా. అతని తండ్రి ఒక గొప్ప అభ్యుదయ రచయిత. అందుకే ఆయన ప్రభావం సూర్యా పైన చాలా ఉండేది. అతని మనస్తత్వం ఇలా ఉన్నప్పటికీ, చదువును మాత్రం నిర్లక్ష్యం చేసేవాడు కాదు. ఈ కారణాల వలనే అతను నాకు మంచి స్నేహితుడు అయ్యాడు కొద్ది కాలం లోనే. అతని అభిప్రాయాలను మాతో పంచుకొనేవాడే కానీ మా మీద వాటిని రుద్దే వాడు కాదు. అంతేకాదు, ఎంతో సరదాగా ఉండేవాడు, స్నేహానికి ప్రాణమిచ్చే రకం.

రెండవ సంవత్సరం చదువుతుండగా జరిగిన ఒక సంఘటనతో కాలేజీ మొత్తం అతని పేరు మారుమ్రోగి పోయింది. రెండో సంవత్సరం మొదట్లో బాగా చదివేవారినంతా ఒక సెక్షన్, మిగతావారిని మరొక సెక్షన్ లో వేశారు. దానికి తగ్గట్టుగా బాగా చెప్పే లెక్చరర్లను ఒక సెక్షన్ కి మిగతా వారిని ఇంకో సెక్షన్ కి వేశారు. ఈ అసమానతను సూర్యా ఎదుర్కొన్నాడు. ముందుగా విద్యార్థులతో మాట్లాడి, వారి అభిప్రాయం తీసుకుని మేనేజిమెంట్ కి ఒక వినతి పత్రం సమర్పించాడు అందరి సంతకాలతో. దానిలో ఇలా విద్యార్థులని విడదీయడం ద్వారా వచ్చే నష్టాన్ని, కాలేజీ కి వచ్చే చెడ్డ పేరుని వివరించాడు. మొదట్లో మేనేజిమెంట్ దీనికి ఒప్పుకోలేదు. కానీ, మెల్లగా సూర్య ప్రతిఘటనకి అన్ని సంవత్సరాల విద్యార్థుల నుంచి మద్దతు లభించింది. చివరకు మేనేజిమెంట్ దిగి వచ్చి వెనక్కి తగ్గారు.

ఇంక చివరగా చెప్పుకోవలిసిన ముఖ్య వ్యక్తి సత్యమూర్తి మాస్టర్. నిజానికి, మూడవ సంవత్సరం వరకు ఆయన మాకు తెలియదు . ఎందుకంటే, ఆయన బోధించే సబ్జెక్టు మూడవ సంవత్సరమే మొదలవుతుంది. ఆయన వ్యక్తిత్వ వికాసము అనే సబ్జెక్టు చెప్పేవారు. మిగతా లెక్చరర్లు ఇంజనీరింగ్ సబ్జెక్ట్ చెప్పేవారు. కానీ, ఈయన మాత్రం బయట ప్రపంచం లో మంచి మనిషిగా బతకాలంటే మన వ్యక్తిత్వం ఎలా పెంపొందించుకోవాలి , ఎలా

మాట్లాడాలి, ఎలా ప్రవర్తించాలి లాంటివి చెప్పేవారు. ఆయన చెప్పే పద్ధతి కుడా చాలా బాగుంటుంది. కథల రూపంలో కొన్ని సార్లు, ఆటల రూపంలో కొన్ని సార్లు, నవ్వుతూ, నవ్విస్తూ చెప్పేవారు. అందుకే ఆయనంటే అందరికీ ఇష్టం, గౌరవం కూడా. బయట ఉద్యోగ ప్రపంచం ఎలా ఉంటుంది, చదివే చదువుని చేసే ఉద్యోగానికి ఎలా అన్వయించుకోవాలి, అసలు ఉద్యోగం తెచ్చుకోవడానికి ఎలా తయారవ్వాలి లాంటివి చాలా బాగా చెప్పేవారు.

సూర్యా చేసిన పోరాటం వల్ల , మేము నలుగురం ఆయన కళ్ళలో పడ్డాం. మూడవ సంవత్సరం రాగానే ఆయన మమ్మల్ని పిలిచి విడిగా మాట్లాడారు. ఈ కాలేజీలో కొన్ని సంవత్సరాల క్రితం విద్యార్థుల సాంస్కృతిక వేదిక ఉండేదట. దానిని పునరుద్దించమని చెప్పారు.

అందుకోసం, తాను వెనకుండి సహాయ పడతానన్నారు. మేము దానికి ఒప్పుకొని ఆ వేదికని మొదలు పెట్టాం. దాంతో మాకు ఆయనతో పరిచయం ఇంకా పెరిగింది. ఆ వేదిక తరఫునుండి మేము క్విజ్, మాస పత్రిక, సాంస్కృతిక పోటీలు లాంటివి చాల చేసాము. అందులో అందరూ మెచ్చుకున్న కార్యక్రమం "సమాజ సేవ". మూడవ సంవత్సరం చివరిలో ఊర్లో వరదలు వచ్చి ఎంతో నష్టం కలిగింది. మా సత్యమూర్తి సార్ సలహా మేరకు, మా వేదిక తరపు నుంచి దాదాపు ఏభయి మంది ఊర్లోకి రోజు వెళ్లి సహాయ కార్యక్రమాలు చేసాం. ఇల్లు కూలిపోయిన వారికి ఇల్లు కట్టడంలో సహాయపడటం, వారి ఆరోగ్య అవసరాలు తెలుసుకొని వారికి వైద్య సదుపాయాలు కలుగచేయడం లాంటివి. దీనివలన మేము ప్రపంచాన్ని చాల దగ్గరగా చూడగలిగాము. ఈ పని మాకు చాలా తృప్తినిచ్చింది. అలా సత్యమూర్తి మాష్టారు మా జీవితాలకి ఒక దారి చూపటమే కాక మా వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహద పడ్డారు. ఇంజినీరింగ్ అయిపోగానే మంచి ఉద్యోగాలు రావడానికి ఆయనే ముఖ్య కారణం.

ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో ఒక్కొక్క సెలవులకి మొదటి నాలుగు రోజులు ఒక స్నేహితుడి ఊరికి వెళ్లి అక్కడనుండి ఎవరి ఇంటికి వాళ్ళు వెళ్లిపోయేవాళ్ళం. నాకు గిరీష్ వాళ్ళ ఊరు చాల నచ్చింది. చక్కటి పల్లెటూరి వాతావరణం, ఎంతో ప్రశాంతంగా ఉండేది. నేను పుట్టాక పల్లెటూరికి వెళ్లడం అదే మొదటిసారి. అలాగే, శ్రీరామ్, సూర్య వాళ్ల ఇంట్లోకూడా అందరూ చాలా బాగా చూసుకునేవారు. అన్నదమ్ములు, అక్క చెల్లెలు, మామయ్యలు, బాబాయిలు, మరదళ్ళు ఇలా ఎన్నో వరసలు , సరదాలు నాకు ఎంతగానో నచ్చింది. కొంతవరకు నాకు ఎవ్వరూ లేరనే లోటు తీరినట్టనిపించేది. అలాగే మా ఊరికి వచ్చినప్పుడు, గిరీష్, సూర్య, శ్రీరామ్ లు చాలా హడావుడి చేసే వారు. అది చూసి మా అమ్మ చాల ఆనందపడడమే కాక , నాకు మంచి తోడు

దొరికినందుకు నిశ్చింతగా ఉండేది. ఇంక మా నలుగురి విషయంకి వస్తే మమ్మల్ని పై చదువులకి వెళ్ళమని సత్యమూర్తి మాష్టారు చాలా ప్రోత్సహించారు.

అయితే, ముందునుంచి ఐఏఎస్ పదవిని సాధించే ధ్యేయంగా ఉన్న శ్రీరామ్ ఇంజినీరింగ్ తరువాత దానికి కావలసిన ట్రైనింగులో చేరాడు. కాలేజీ దగ్గర్లోనే రూమ్ తీసుకుని మమ్మల్ని దాదాపు రోజు కలిసేవాడు. సత్యమూర్తి మాష్టారు, శ్రీరామ్ నిర్ణయాన్ని హర్షించటమే కాకుండా మంచి సలహాలు ఇచ్చేవారు. ఇంక సూర్య విషయానికి వస్తే అతనికున్న బాధ్యతలు రీత్యా ఉద్యోగంలో చేరి బెంగళూరు వెళ్ళిపోయాడు. దానికి సత్యమూర్తి మాస్టర్ అడ్డు చెప్పలేదు కానీ, ఉద్యోగం చేస్తూనే పార్టుటైమ్ లో ఉద్యోగంలో ఉన్నతికి కావలిసిన కోర్సులు చేయమన్నారు. బెంగళూరు వెళ్లినా కానీ సూర్య ప్రతి నెలా కాకినాడకు వచ్చేవాడు మమ్మల్ని కలవడానికి. అంతేకాక అతని ఊరు కాకినాడకి చాల దగ్గర. జీవితాన్ని ఒక పండగలా గడిపే గిరీష్, మాస్టారి మాటల ప్రభావం వల్ల, పై చదువులు చదవాలని ఇక్కడే ఎం.టెక్ లో సీట్ తెచ్చుకొని చేరాడు.

ఆఖరిగా, నా సంగతి. నాకు, సూర్య లాగ పై చదువులు చదవాలని ఉన్నా, ఇంటి పరిస్థితుల రీత్యా ఉద్యోగం చేద్దామనుకొనేవాడిని. మాస్టారి మాటలు, ఇంటి పరిస్థితి మధ్య ఎటువంటి నిర్ణయం తీసుకోలేక నలిగి పోయేవాడిని. ఇంతలో మా అమ్మ వచ్చింది మా కాలేజీకి దాదాపు మూడు సంవత్సరాల తరువాత. అమ్మ హృదయం కదా, నా మానసిక సంఘర్షణని వెంటనే అర్థం చేసుకుంది. నాతొ "నేను , మీ నాన్నగారు కన్న ఏకైక కల నిన్ను బాగా చదివించాలని, ప్రయోజకుడిగా చూడాలని. ఇప్పుడు, నీవు ఉద్యోగం పేరిట ఆ కలను చెరిపేస్తే, నేను మీ నాన్నగారు చని పోయిన తరువాత జీవించాడనికి అర్థం, పడ్డ కష్టానికి ఫలితం లేకుండా అవుతాయి. నీవు తప్పక పై చదువులు చదవాల్సిందే అంది. దాంతో, నేను సంతోషంగా ఎం.టెక్ లో చేరాను. అయితే, కష్టపడి చదవడం ద్వారా వచ్చిన స్కాలర్షిప్ డబ్బులతో నా ఫీజులు, ఇతర ఖర్చులు కూడా వెళ్లిపోయేవి. ఆ రకంగా అమ్మ డబ్బు ఇబ్బంది నుంచి కొంత బయట పడింది. అంతే కాక ఒక సారి ఊరెళ్ళినప్పుడు, అమ్మకి మంచి చీర కొని తీసుకెళ్ళాను. అప్పుడు, అమ్మ కళ్ళలో చూసిన ఆనందం జీవితంలో మర్చిపోలేను.

అలా నేను, గిరీష్ ఎం.టెక్ లో మళ్ళీ రూమ్మేట్లు గా ఇంకో రెండు సంవత్సరాలు గడిపాము. ఇక్కడ కూడా కాలేజీ జీవితం బాగుండేది. ఇంజనీరింగ్ లో లాగా ర్యాగింగ్ , ఎలెక్షన్లు, ఆటలు, అల్లర్లు లేవు. కానీ, చదువులో ఇంకాస్త లోతుగా వెళ్లి కొత్త విషయాలని తెలుసుకున్నాము. అలాగే, బయట జరిగే సదస్సులకు వెళ్లడం, అందులో కాలేజీ తరపు నుంచి మాట్లాడి కాలేజీకి మంచి పేరు తీసుకొచ్చేవాళ్ళము. సత్యమూర్తి మాస్టారు మా చేత కాలేజీలో ఇంజనీరింగ్ విద్యార్థులకి లెక్చర్లు ఇప్పించేవారు. ఒక మూడు నెలల పాటు బెంగళూరులో నేను, గిరీష్ ప్రాజెక్ట్ వర్క్ చేసాము. అప్పుడు సూర్యా రూంలోనే ఉండి చాల జాలీ గా గడిపాము, ఎందుకంటే ముగ్గురం డబ్బు

సంపాదిస్తున్నాం కాబట్టి. కొన్ని రోజులు శ్రీరామ్ కూడా బెంగళూరు వచ్చి మాతో ఉన్నాడు. ఇలా , చూస్తుండగా రెండు సంవత్సరాలు గడచిపోవడం , ఎం.టెక్ అయిపోవడం కూడా జరిగి పోయింది. ఎం.టెక్ కూడా బాగా చదువుకుని మంచి ఉద్యోగం తెచ్చుకొని ,సత్యమూర్తి మాస్టారి, అమ్మ కలలు నిజం చేసాం. అందుకే ఇంత సంతోషంగా ఈ రోజు ఇంటికి వెళ్తున్నాను.

అలా గతం ఆలోచన లోంచి వర్తమానంలోకి వచ్చేప్పటికి బస్సు ఊరు చేరడం జరిగింది. బస్సు దిగి ఆటోలో ఇల్లు చేరాడు గౌతమ్. ఇంటి బయట జనాన్ని చూడగానే భయపడ్డాడు. కంగారుగా ఇంట్లోకి పరిగెత్తి అక్కడి పరిస్థితి చూసి బావురుమన్నాడు. అతని తల్లి పార్వతమ్మ ఈ లోకాన్ని వదిలి రాత్రి నిద్రలోనే వెళ్లిపోయింది. పొద్దున్న ఎదో అవసరం మీద పక్క ఇంటి వాళ్ళు తలుపు కొట్టగా తీయకపోయే సరికి అనుమానము వచ్చి తలుపులు పగలకొట్టి చూస్తే మంచం మీదే విగతజీవురాలై ఉందట.

సరిగ్గా ఎనిమిది సంవత్సరాల క్రితం తండ్రిని పోగొట్టుకున్న గౌతమ్ ఈ రోజు తల్లినీ పోగోట్టుకొని అనాధగా మిగిలాడు. ఏమి చెయ్యాలో తోచక దుఃఖంలో మునిగి పోయాడు. అతని స్నేహితులు, చుట్టు పక్కల వారు, తల్లి స్కూల్ టీచర్లు వచ్చి అతని చేత అంత్యక్రియలు జరిపించారు. ఈ సారి అమ్మ వైపు వాళ్ళకి కానీ, నాన్న వైపు వాళ్ళకి కానీ ఈ వార్త తెలియచేయలేదు. ఎందుకంటే, తాను పుట్టాక వారెవ్వరిని చూడలేదు. అలాగే, వారెవ్వరూ తమని కలిసే ప్రయత్నం కూడా చేయలేదు గత ఇరవై ఐదేళ్లుగా. సాయంత్రానికల్లా గిరీష్, శ్రీరామ్, సూర్యా వచ్చారు వార్త తెలిసి. గౌతమ్ తో గిరీష్ " ఎంత పని జరిగింది గౌతమ్. ఈ ఉద్యోగం వార్త అమ్మ తో చెప్దామని ఎంతో ఉత్సాహంగా వచ్చిన నువ్వు అమ్మని ఇలా చూడాల్సివస్తుందని కలలో కూడా అనుకోలేదు. దేవుడు నీకు చాలా అన్యాయం చేసాడు. నీ ప్రగతి కోసం జీవితం మొత్తం కలలు కని , ఎన్నో త్యాగాలు చేసిన వారు ఆ ఫలితాలను చూడడానికి ఈ రోజు లేరు. " అన్నాడు.

దానికి గౌతమ్ "సరిగ్గా చెప్పావు గిరీష్. ఒక్క రోజు క్రితం నాకీ ఉద్యోగం వచ్చినా ఎంత బాగుండేది. ఈ వార్త తెలీకుండానే అమ్మ వెళ్లి పోయింది. ఇప్పుడు నా విజయానికి అర్థం లేదు. ఒక్క సారిగా నా జీవితమే అర్ధరహితం అయిపోయింది. అనాధగా మిగిలి పోయిన నేను మిగతా జీవితం అంతా ఎలా గడపాలి ? దిక్కు తోచని స్థితి లో ఉన్నాను" అన్నాడు. దానికి వాళ్ళు "అలా మాట్లాడకు గౌతమ్, మేముండగా నీవు ఎప్పుడూ అనాధవి కావు" అన్నారు. అతని తోనే అక్కడ పది రోజులు ఉండి, అన్నీ చక్కదిద్ది, ఇల్లు ఖాళీ చేయించి గౌతమ్ ని కాకినాడకి తీసుకెళ్లారు వాళ్లతో. ఆ రకంగా గౌతంకి తల్లితో, ఆఊరి తో ఋణం తీరిపోయింది. కాకినాడ వెళ్ళాక కూడా దాదాపు నెలరోజుల వరకూ మాములు మనిషి కాలేదు. ఆ సమయంలో గిరీష్, శ్రీరామ్ ఎప్పుడూ గౌతంతోనే ఉండేవారు ధైర్యం చెబుతూ. సత్యమూర్తి మాస్టర్ కూడా ధైర్యం చెప్పడమే కాకుండా తిరిగి దైనందిన

జీవితంలోకి రావడానికి ఎంతో సాయపడ్డారు. గౌతమ్ ఢిల్లీలో వచ్చిన కొత్త ఉద్యోగం లో చేరను అన్నప్పుడు "ఒక్క సారి మీ అమ్మగారు నిన్ను చదివించడానికి ఎంత కష్టపడ్డారో తలుచుకో. నీ తల్లితండ్రులు నీ గురించి కన్న కలలు , ఆశయాలని మరచిపోతావా?. ఈ రోజు నీతో వాళ్ళు లేకపోవచ్చు కానీ వాళ్ళు కన్న కలలు నీవు నిజం చేస్తుంటే, పైనుండి వాళ్ళు తప్పక ఆనందిస్తారు." అని చెప్పేవారు.

ఇలా వీళ్లందరి మాటలు విన్నాక గౌతంకి కూడా తల్లి తండ్రుల ఆత్మలు సంతోషించాలంటే తాను వారి ఆశయాలను నెరవేరుస్తూ బ్రతకాలి అని నిర్ణయించుకున్నాడు. నెల రోజుల తరువాత ఢిల్లీకి పయనమయ్యాడు. ఇక్కడితో అతని విద్యార్థి జీవితం ముగిసింది.

ఆదివారం పొద్దున్నే రైలు దిగి, ఎన్నో ఆలోచనలతో, ఊహలతో ఢిల్లీలో అడుగుపెట్టాడు గౌతమ్ ఉద్యోగపర్వానికి తెర తీస్తూ. ముందుగా ఆఫీస్ వారిచ్చిన గెస్ట్ హౌస్ కి వెళ్ళాడు. ఆ రోజు అక్కడే విశ్రాంతి తీసుకుని మరునాడు పొద్దున్నే ఆఫీస్ కి వెళ్ళాడు. అతనికి ఢిల్లీ వాతావరణం, మనుషులు, భాషా విచిత్రంగా అనిపించింది. అంతకు మునుపెప్పుడు పెద్ద నగరాల లో లేక పోవడం వలన, పెద్ద భవంతులు, ట్రాఫిక్ చాల గజిబిజిగా అనిపించింది. దానికి తోడు హిందీ భాష రాకపోవడం మరింత ఆందోళనకు గురిచేసింది. అలానే అవస్థలుపడుతూ ఆఫీసుకి చేరాడు. ఆఫీసులో కూడా అదే పరిస్థితి. ఎక్కువ మంది హిందీలో, చాలా కొద్ది మంది ఇంగ్లీషులో, మరి కొందరు రెండు భాషలు కలగలిపి హింగ్లీష్ లో మాట్లాడారు. దాంతో, హిందీ రాకుండా ఇక్కడ బ్రతకడం చాలా కష్టమనే విషయం అతనికి అర్థమయింది. మొదట రోజంతా పరిచయాలు, ఫారం లు నింపడంతో గడిచిపోయింది. గెస్ట్ హౌస్ చాల దూరమవడంతో దాదాపు గంటన్నర సేపు ప్రయాణం పట్టేది. ఆఫీసుకి దగ్గరలో ఇల్లు తొందరగా వెతుక్కోవాలి. ఎందుకంటే, గెస్ట్ హౌసులో రెండు వారాలు దాటి ఉండ నివ్వరు. కానీ ఆఫీస్ దగ్గర ఉన్న కాలనీలో ఇల్లు అంత తేలికగా దొరకదని, అద్దె కూడా చాలా ఎక్కువగా ఉంటుందని ఆఫీసులో చెప్పారు. ఈ శని, ఆది వారాలలో ఇళ్ల వేట తప్పదు. అలానే, ఆఫీస్ దగ్గరలో హోటల్ లేకపోడవం తో లంచ్ కి పది నిముషాలు పైనే నడవాల్సి వచ్చేది. ఇలా మూడు రోజులు గడిచిపోయాయి.

ఈ మూడు రోజుల్లో ఇంకో విషయం కూడా అర్థమయ్యింది. అది ఆహారం గురించి. తాను ఇన్నాళ్లూ తిన్న ఆహారం వేరు, ఇక్కడ హోటల్ లో దొరికే ఆహారం వేరు. ఎక్కువ కాలం ఈ హోటల్ భోజనం చేయలేనని తెల్సింది.

అసలు, ఇన్ని అవస్థలు పడుతూ ఈ ఉద్యోగం చేయడం అవసరమా అని కూడా అనిపించింది. హాయిగా ఉన్న ఊర్లో చిన్న ఉద్యోగమైనా చేసుకుంటే ఈ తిప్పలు ఉండవు కదా అని ఒక వైపు, మరొకవైపు తల్లితండ్రుల

ఆశయం కష్టపడైనా తీర్చాలనే ఆలోచన గౌతమ్ ని మానసిక సంఘర్షణ కి గురిచేశాయి. ఇంకో రెండు, మూడు రోజులు చూసి, స్నేహితులతో కూడా మాట్లాడి ఒక నిర్ణయం తీసుకుందామనుకున్నాడు.

ఇలాంటి ఆలోచనలతో , అయిష్టంగానే నాలుగోరోజు గురువారం నాడు ఆఫీస్ లో అడుగు పెట్టాడు . వెళ్లిన గంట సేపటి తరువాత అతని టేబుల్ దగ్గరికి ఒక అమ్మాయి వచ్చింది. గౌతంతో ఆ అమ్మాయి తెలుగులో "నా పేరు స్వాతి. గత మూడు రోజులుగా నేను సెలవులో ఉన్నాను. ఇవాళ ఆఫీస్ కి రాగానే మీరు చేరిన సంగతి తెలిసింది. నేను ఇక్కడ అకౌంటెంట్ గా పని చేస్తున్నాను" అంది. దాంతో ప్రాణం లేచొచ్చిన గౌతమ్ చక చకా తనను పరిచయం చేసుకున్నాడు.

రండి, కాఫీ తాగుతూ మాట్లాడదామని అతన్ని ఆఫీస్ కింద ఉన్న కాఫీ షాప్ కి తీసుకువెళ్ళింది. ఆమె అడక్కుండానే గత నాలుగురోజులనుండీ పడుతున్న అవస్థలను చెప్పేసాడు. దానికి ఆమె "మొదట్లో అలానే ఉంటుంది. క్రమక్రమంగా అన్నీ సర్దుకుంటాయి. అప్పటిదాకా మీకు నేను సహాయం చేస్తాను " అంది. అలా అనడమే కాకుండా సాయంత్రం ఆఫీస్ అవగానే టేబుల్ దగ్గరకు వచ్చి పదండి అంది, ఎక్కడికో చెప్పకుండానే. గౌతమ్ కూడా మాట్లాడకుండా ఆమెను అనుసరించాడు. స్వాతి తన స్కూటీపైన అతన్ని అయిదు నిముషాలు పాటు సందులు తిప్పి ఒక ఇంటి ముందు ఆపింది. రండి లోపలికి ఈ ఇల్లు మా ఇల్లే, ఆఫీసుకి నడిచి వెళ్తే పదిహేను నిమి షాలు కూడా పట్టదు అంది. అది ఒక చిన్న ఇల్లు. ఇంటి చుట్టూ మొక్కలు, చాలా అందంగా ఉంది. ఇంట్లోనుంచి ఒక జంట, బహుశా స్వాతి తల్లి తండ్రులనుకుంటా బయటకు వచ్చి లోపలకు సాదరంగా ఆహ్వానించారు. వారిని పరిచయం చేసి మాట్లాడుతూ ఉండమని, లోపలికి వెళ్లి కాఫీ కలుపుకొచ్చింది.

స్వాతి తల్లి తండ్రులు కూడా చాల బాగా మాట్లాడుతున్నారు. ఇంతలో స్వాతి "మీ ముందున్న సమస్యలలో మొదటిది, తొందరగా తేల్చుకోవాల్సింది ఇల్లు మారడం. మా ఇంటి మేడ మీద ఒక గది , బాత్రూం ఉన్నాయి. అందులో ఒక మూల స్టవ్ పెట్టుకుని వంట కూడా చేసుకోవచ్చు. నేను చదువుకొనే రోజుల్లో ఆ గది బాగా వాడేదాన్ని. ఇప్పుడు దాని వాడకం పూర్తిగా తగ్గి పోయింది. మీకు అభ్యంతరం లేకపోతే ఆ గది లో ఎన్నాళ్లయినా ఉండవచ్చు.

మీకు ఆ గది సౌకర్యంగా లేదనుకుంటే ఇంకొక ఇల్లు దొరికేంత వరకు ఉండండి" అంది. వాళ్ళ నాన్నగారు కూడా "నాకు స్వాతి మధ్యాన్నమే ఫోన్ చేసి ఈ సంగతి చెప్పింది. మా కెటువంటి అభ్యంతరం లేదు నువ్వు అక్కడ ఉండడానికి" అని స్వాతిని ఆ గది చూపించ మన్నారు. నిజానికి, ఆ గది చాలా బాగుంది. ఆ గదిలో చిన్న మంచం, రెండు కుర్చీలు , టేబుల్ అందంగా అమర్చి ఉన్నాయి. నాకు ఒక పెద్ద సమస్య తీరినట్టనిపించింది.

అలా చూస్తున్న నాతో " ఏమిటి ఆలోచిస్తున్నారు. ఇక్కడున్న సామాను సంగతేమిటనా, ఇవి మీరు నిరభ్యంతరంగా వాడుకోవచ్చు" అంది. ఎలా చెప్పాలో తెలీక "గది చాలా బాగుంది కానీ మీరు అద్దె తీసుకుంటారంటేనే నేను ఇక్కడికి మారతాను" అన్నాను. దానికి స్వాతి నవ్వుతూ "భయపడకండి. మేమేమి ఈ గదిని మీకు ఉచితంగా ఇవ్వట్లేదు. నాన్నగారు అద్దె ఆరు వేలని చెప్పమన్నారు" అంది. నేను వెంటనే ఆనందంగా ఒప్పుకున్నాను. క్రిందికి వెళ్ళగానే వాళ్ళ నాన్నగారికి రెండు నెలల అద్దె అడ్వాన్సుగా ఇచ్చేశాను. ఆయన రేపు మంచి రోజు, పొద్దున్నే గెస్ట్ హౌస్ ఖాళీ చేసి పైన గది లోకి మారిపొమ్మన్నారు. వారందరికీ థాంక్స్ చెప్పి అక్కడి నుండి కదిలాను.

ఆ మర్నాడు పొద్దున్నే వాళ్ళ ఇంటికి మారిపోయాను. స్వాతీ వాళ్ళ అమ్మగారు "నువ్వు వంట మొదలుపెట్టే వరకూ మా ఇంట్లో తిందువుగాని" అన్నారు. నేను "వద్దులెండి , మీకెందుకా శ్రమ" అన్నాను. దానికి స్వాతి, వాళ్ళ నాన్నగారు 'అదేమీ కుదరదు,. ఇక్కడ తినాల్సిందే" అని బలవంతం చేశారు. ఆ రోజు స్వాతి తోనే ఆఫీస్ కి వెళ్లి వచ్చాను.

రాత్రి భోజనానికి వెళ్లిన నేను చాల సేపు గడిపాను. నా వివరాలు అడిగినప్పుడు చిన్నప్పటి నుండి జరిగిన ప్రధాన సంగతులని వారితో పంచుకున్నాను. అంతా విన్నాక వారు "నీవు ఎప్పుడూ ఒంటరి వాడినని అనుకోవద్దు. మమ్మల్ని నీ సన్నిహితులుగా భావించు. " అని అన్నారు. నాకు కూడా చాల బాగా అనిపించింది వారి ఆప్యాయత, మంచితనం చూసి. ఆ తరువాత రోజు నుంచి స్వాతి ఇంకాస్త చనువుగా మాట్లాడేది. దానికి నిదర్శనం, శనివారం ఉదయం పది గంటలకు నా రూమ్ కి వచ్చిన స్వాతి "సాయంత్రం మనం బజారుకి వెళదాము. మీరు వంట సామాను కొనుక్కుందురుగాని" అంది. అప్పుడు మెల్లగా నేను "మీతో ఒక విషయం చెప్పాలి. నాకు వంట చేయడం రాదు. ఇంట్లో కానీ, హాస్టల్ లో కానీ ఈ నాటి వరకూ ఆ అవసరం రాలేదు" అని అన్నాను. దానికి స్వాతి నవ్వుతూ "బాగుంది. ఇప్పటి వరకూ రాకపోతేనేమి. ఇప్పుడు నేర్చుకుందురు గాని. అవసరం అన్నీ నేర్పిస్తుంది మనిషికి. నేను మీకు వంట నేర్పుతాను" అంది. దాంతో నాకు ఇంకో పెద్ద సమస్య తీరినట్టయ్యింది. స్వాతితో మీకెలా థాంక్స్ చెప్పుకోవాలో తెలీట్లేదు. మీ వలన నాకు ఇల్లు, భోజనం సమస్య తీరాయి. నిజానికి, ఇలాంటి ఇబ్బందుల వలన ఉద్యోగం వదిలేసి ఇంటికి వెళ్లపోదామనుకున్నాను. రేపటినించే వంట నేర్చుకోవడం మొదలు పెడతాను గురువు గారి దగ్గర అన్నాను.

స్వాతి కూడా నవ్వుతూ 'అయితే మొదటి షరతు. మనమిద్దరం అనే పిలుపు మానేసి నువ్వు అని పిలుచుకొందాం. స్నేహానికి అది మొదటి మెట్టు" అంది. ఆ తరువాత తన గురించి చెప్పడం మొదలు పెట్టింది. స్వాతీ వాళ్ళ నాన్నగారు పెళ్లి అవ్వగానే ఉద్యోగరీత్యా ఢిల్లీకి వచ్చేశారు దాదాపు నలభై ఏళ్ళ క్రితం. స్వాతి

వాళ్ళకి ఏకైక సంతానం. చాలాకాలం వారికి పిల్లలు లేరు. పెళ్లయిన తొమ్మిదేళ్ళ కి స్వాతి పుట్టింది. అందుకే స్వాతిని చాలా అపురూపంగా పెంచారు. స్వాతి చదువు అంతా ఢిల్లీలోనే జరిగింది. అందుకే, హిందీ చాల బాగా మాట్లాడుతుంది. అలాగని, తెలుగు మాట్లాడడం రాకుండా చేయలేదు. ఇంట్లో ఇప్పటికీ తెలుగే మాట్లాడతారు.

దూరాభారం వలన, ఆర్థిక పరిస్థితుల వలన కాల క్రమేణా వాళ్ళ బంధువులతో రాక పోకలు తగ్గి పోయాయి. కొందరు బంధువులనయితే స్వాతి అసలు చూడలేదట ఇప్పటిదాకా. ఆ రకంగా ఎవ్వరు లేక నేను ఒంటరి వాడినైతే, స్వాతి అందరూ ఉండి కూడా ఒంటరితనం అనుభవిస్తోంది. ప్రస్తుతం తాను, స్వాతి పనిచేస్తున్న కంపెనీలోనే ఆయన చేసేవారట. ఆయనా ఈమధ్యనే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు, అనారోగ్య కారణంగా. ఆయనకి కీళ్ల నొప్పుల వ్యాధి వలన ఆఫీసుకి వెళ్లడం ఇబ్బందిగా ఉండేదట. అయితే, ఆయన ఈ ఆఫీస్ కి ఇన్నాళ్లుగా చేసిన సేవను దృష్టిలో పెట్టుకుని ఆఫీస్ వాళ్ళు స్వాతికి ఈ ఉద్యోగం ఇచ్చారట. అలా దాదాపు సంవత్సరం క్రితం, స్వాతి ఈ ఆఫీస్ లో చేరింది. ఆమె చలాకీతనం, మృదుభాషణ వలన అందరితో తొందరగా కలిసిపోయింది.

ఆ సాయంత్రం బయటకు వెళ్లి వంట పాత్రలు, కొన్ని నిత్యావసర సరుకులు తెచ్చుకున్నాను స్వాతి సాయంతో. ఆ సోమవారం నుంచి ఇద్దరం ఆఫీస్ కి రోజు కలిసి వెళ్లి వచ్చేవాళ్ళం. ఆఫీస్ అయ్యాక బజారుకి వెళ్లి కావాల్సిన కూరలు, సరుకులు తెచ్చుకొచ్చేవాళ్ళం. నా కున్న అవసరం వలనో , స్వాతి చురుకుదనం వలనో కాని ఒక నెల రోజుల్లో వంట నేర్చేసుకున్నాను. ఇప్పుడు సొంతంగా వండుకోవడమే కాక స్వాతి వాళ్లకు కూడా చేసి ఇస్తున్నాను అప్పుడప్పుడు సరదాగా. అలానే, స్వాతి వలన హిందీ భాష కూడా నేర్చుకున్నాను. కానీ, ఇది దాదాపు మూడు నెలలు పట్టింది. మొదట్లో హిందీ లో మాట్లాడడానికి కొద్దిగా జంకే వాడిని. కానీ, స్వాతి రోజు సాయంత్రం హిందీలోనే మాట్లాడాలని షరతు పెట్టింది. నా వచ్చీ రాని భాషను భరిస్తూ, ఓర్పుగా సరి దిద్దుతుండేది. మిగతా సమయంలో నేను కూడా హిందీ భాష నేర్పే పుస్తకం చదవడం, నాలో నేనే హిందిలోమాట్లాడుకోవడం లాంటివి చేసే వాడిని. ఒక నెల తరువాత బజారులో కూడా నన్నే మాట్లాడమని స్వాతి బలవంతం చేసేది. ఈ క్రమంలో అప్పుడప్పుడు నా భాష అవతలి వారికి అర్థం కాక నవ్వొచ్చే సంఘటనలు జరిగేవి. ఒకసారి అర కిలో ఉప్పు కోసం అరపై కిలోల ఉప్పు అడిగాను .

షాప్ అతను నా వైపు వింతగా చూశాడు, వీడు అరపై కిలోల ఉప్పు ఏమి చేసుకుంటాడన్నట్టుగా. స్వాతి దాన్ని సరి చెయ్యగా అతను పగలబడి నవ్వాడు. అలా ఎన్నో తమాషాలు జరిగాయి. స్వాతి మాత్రం నవ్వు బలవంతంగా ఆపుకొని నాకు సరిఅయిన పదం చెప్పేది. అలా, మొదట్లో చిరాకుగా ఉన్నా స్వాతి వలన ఈ

మూడు నెలల తరువాత తప్పో, ఒప్పో తడుముకోకుండా మాట్లాడే స్థాయికి వచ్చాను. ఒక్కో సారి తలుచుకుంటే నాకే ఆశ్చర్యమేసేది. నేనేంటి వంట చేయడమేంటి, హిందీ మాట్లాడటమేమిటని. అంతా స్వాతి మహత్యం.

అలాగే, నాకు చిన్నప్పటి నుంచి ఉన్న కోరిక మోటార్ సైకిల్ కొనుక్కుని డ్రైవ్ చేయాలని. ఆ కోరిక కూడా తీర్చేసుకొన్నాను. అప్పటి నుండి నేను స్వాతి ని ఆఫీస్ కి, బయట షాపులకి నా బైక్ మీదే తీసుకెళ్ళేవాడిని. ఇలా నా కనీస అవసరాలు తీరడంతో మెల్లగా ఆఫీస్ పనిపై ఎక్కువ శ్రద్ధ పెట్టాను. ఈ ఆఫీస్ నిర్మాణ రంగానికి సంబంధించింది. పెద్ద భవంతులు, ప్రాజెక్టులు కట్టే వారికి సాంకేతిక సలహాలు ఇవ్వడం, కావలసిన సామాగ్రి సరఫరా చేయడం లాంటివి చేస్తారు. నేను ఎం.టెక్ లో చదివిన భూగర్భ శాస్త్రం, నీటి వనరుల పరిశోధనలు ఈ ఉద్యోగంలో చాలా ఉపయోగపడుతోంది.

కట్టబోయే నిర్మాణానికి అక్కడి భూమి సానుకూలమా , సానుకూలం అయితే ఎంత లోతు తవ్వాలి పునాదికి, ఆ స్థలంలో నీటి సాంద్రత ఎలా ఉంటుంది లాంటివి నేను పరిశోధించే వాడిని, మిగతా ఇంజినీర్లతో కలిసి. నాకు ఇది చాల ఇష్టమైన పని కూడా. అయితే, ఇది నాకు ఇచ్చిన పని మాత్రమే. కానీ, మా మేనేజర్ చెప్పకపోయినా, నేను కొంత ముందుకు వెళ్లి ఈ పని చేయడానికి ఆధునిక పరికరాలని పరిశీలించేవాడిని. వాటి వాడకం ద్వారా ఏ రకంగా పనిని ఇంకా తొందరగా, బాగా చెయ్యచ్చు అని ఆలోచించేవాడిని. ఇది ఒక కొలిక్కి రావడానికి సంవత్సరం పైనే పట్టింది. కానీ, అది పూర్తయి దాని ఫలితాన్ని చూపించినప్పుడు కంపెనీ యాజమాన్యం చాల సంతోషించారు.

ఎందుకంటే అది వారికీ భారీగా ఖర్చు తగ్గించడమే కాకుండా, పని పూర్తి చేయడనికి పట్టే సమయాన్ని కూడా బాగా తగ్గించింది. దాని ఫలితంగా కంపెనీ యాజమాన్యం నాకు ప్రమోషన్ ఇచ్చారు. ఆ రోజు నా సంతోషానికి అవధులు లేవు. స్వాతిని, వాళ్ళ తల్లితండ్రులని మంచి హోటల్ కి తీసుకెళ్ళి పార్టీ ఇచ్చాను.

ఇలా ఆఫీసులో చేరి రెండు సంవత్సరాలు చూస్తుండగా గడచి పోయాయి. ఈ రెండు సంవత్సరాలలో స్వాతి తో, ఆమె కుటుంబంతో నా అనుబంధం చాలా పెరిగింది. ఒక సారి మాటల సందర్భంలో స్వాతికి చిన్నప్పుడు చిత్ర లేఖనం చాల ఇష్టమనీ , కానీ ఇంటి పరిస్థితుల వలన ముందుకు వెళ్లలేకపోయానని చెప్పింది. అది గుర్తుంచుకొని నేను తన పుట్టినరోజు నాడు బహుమతిగా మా ఆఫీసుకి దగ్గరలో ఉన్న కళా కేంద్రంలో పెయింటింగ్ కోర్సు కి ఫీజు కట్టి చేర్పించాను. తన బలవంతం మీద నేను కూడా అందులో ఫోటోగ్రఫీ కోర్సులో చేరాను. అలా ఇద్దరమూ సాయంత్రం ఆఫీస్ అయ్యాక అక్కడకు వెళ్లి, క్లాస్ అయ్యాక ఇంటికి వెళ్ళేవాళ్ళము.

శని, ఆదివారాల్లో ఊరి చివరలో ఉన్న సౌందర్యమైన ప్రదేశాలకి వెళ్లి స్వాతి అక్కడ చక్కటి బొమ్మలు గీస్తుండేది. తనకు తోడుగా వెళ్లిన నేను ఫోటోలు తీస్తుండేవాణ్ణి. ఆ ప్రదేశం చూస్తూ, మాట్లాడుకుంటూ , బొమ్మలు గీస్తూ రోజు మొత్తం గడిచిపోయేది. ఇలా కొన్ని వారాలు , నెలలు గడిచి పోయాయి. స్వాతి పుణ్యమా అని ఈ విధంగా ఢిల్లీ చుట్టూ పక్కల ప్రాంతాలు కూడా చూసేసాను. తాను వేసిన బొమ్మలకు వ్యాఖ్య రాసి తనకి తెలీకుండా పత్రికలకు పంపేవాడిని. అందులో కొన్ని ప్రచురితమయ్యాయి కూడా. తాను గీసిన బొమ్మలు పత్రికల్లో చూసినప్పుడు స్వాతి కళ్ళలో ఎంతో ఆనందం కనిపించేది. తన కలలను అర్థం చేసుకుని , ప్రోత్సహించి , నిజం చేసినందుకు నాకు కృతజ్ఞతలు చెప్పేది. అంతేకాక ఆ కృతజ్ఞతలని ఒక మంచి బహుమతి రూపంలో నాకు ఇచ్చింది. ఆఫీస్ రికార్డు లలో నా పుట్టినరోజు తేదీ తెలిసికుని ఆ రోజు వారింటికి పిలిచి ఎంతో ఘనంగా జరిపారు. ఆ రోజే మంచి కెమెరాను నాకు బహుమతిగా ఇచ్చింది.

నాకు ఆ రోజు చాల సంతోషంగా అనిపించింది. నేను అనాథని కాను, నా కంటూ ఈ కుటుంబం ఉంది అనిపించింది. వీళ్ళ ఆప్యాయతల వలన ఈ ఐదు సంవత్సరాలు ఎంతో తొందరగా, సంతోషము గా గడిచి పోయాయి.

ఈ ఐదేళ్లలో ఆఫీసులో కూడా అందరితో అనుబంధం పెరిగింది. భాష ఇబ్బంది తొలిగిపోవడంతో వాళ్లందరితో హిందీలోనే మాట్లాడేవాడిని. అంతే కాక , ఆఫీస్ పిక్నిక్ లు నన్ను వాళ్ళకి బాగా దగ్గర చేసాయి. వాళ్లతో కలిసి ఆడడం, పాడడం వలన మంచి చనువు వచ్చింది. అప్పుడప్పుడు, అందరం కలసి క్రికెట్ ఆడేవాళ్ళం, సినిమా చూసేవాళ్ళం. నాకు మళ్ళీ కాలేజీ రోజులు గుర్తుకుతెచ్చేవి. ఆఫీసులో రక రకాల వ్యక్తులు, వారి మాట, అలవాట్లు ఎంతో నవ్వు తెప్పించేవి. పంకజ్ అనే అతను అందరి గొంతుని అనుకరిస్తూ సరదాగా ఉండేవాడు. ఎక్కడో దాక్కుని, మా మేనేజర్ గొంతుని ఆయన లేని సమయం చూసి అనుకరించి అందరినీ భయ పెట్టేవాడు. ఒక రోజు అలా అనుకరిస్తుండగా మా మేనేజర్ ఆఫీసులోకి అడుగు పెట్టాడు. అప్పుడు అతని మొహం చూసి అందరూ నవ్వు ఆపుకోలేకపోయారు, మేనేజర్ తో సహా. ఇలా చెప్తూపోతే, ఎన్నో మరచిపోలేని సంఘటనలు ఉంటాయి.

ఇంతలో ఆఫీస్ లో మా మేనేజర్ ఉద్యోగానికి రాజీనామా చేయడంతో ఆయన వెళ్లాల్సిన జపాన్ ట్రిప్ కి ఆఖరి నిముషంలో నన్ను పంపించారు. పదిహేను రోజులకని వెళ్లిన నేను నెల రోజుల పైనే ఉన్నాను. అక్కడ పడ్డ కష్టం ఫలించి జపాన్ కంపెనీ వారి ఆర్డర్ మా కంపెనీకి వచ్చింది. ఆ నెల రోజులు స్వాతినీ, వారి కుటుంబాన్ని ఎంతగానో మిస్సవుతున్నానని చాలా అనిపించింది. వారందరూ ఆనందించే వస్తువు, డీవీడీ ని జపానులో వారికి బహుమతి గా కొన్నాను.

జపాను ట్రిప్ నుంచి వెనక్కు వచ్చాక మా ఆఫీస్ వారు నేను తీసుకొచ్చిన ఆర్డర్ వలన చాలా సంతోషపడి నాకు అసిస్టెంట్ మేనేజరుగా ప్రమోషన్ ఇచ్చారు. ఈ ఐదేళ్లలో ఇది రెండో ప్రమోషన్. ఇదే కాకుండా నేను ఆనంద పడే విషయం ఇంకోటి జరిగింది.

రాజీనామా చేసి వెళ్లిన మా మేనేజర్ పోస్టులో కొత్తగా రాజారావు గారని ఒక తెలుగాయన వచ్చారు. స్వాతి నాకు చేసిన సాయంలా ఆయనకు ఇక్కడ ఇల్లు వెతుక్కోవడంలో, స్థిర పడడంలో సహాయం చేశాను. ఆ రకంగా ఆయనతో తొందరగా ఒక మంచి అనుబంధం ఏర్పడింది. ఆయన చాల మంచి మనిషి. ఆయన భార్య, పిల్లలు తో స్వాతీ వాళ్ళింటికి రావడం, మేమంతా వారింటికి వెళ్లడం జరిగేది. అందరం సరదాగా ఏదయినా ఆడడం కానీ, బయటకు వెళ్లడం కానీ చేస్తూండేవాళ్ళము.

అలాగే, నా ప్రాణ స్నేహితులు కూడా ఢిల్లీకి రెండు, మూడు సార్లు వచ్చారు. మొదటి సారి శ్రీరామ్ ఐఏఎస్ ఇంటర్వ్యూకి వచ్చి వారం రోజులు ఉన్నాడు. అప్పుడు ఐ.ఏ.ఎస్ కి సెలెక్ట్ అవలేదు కానీ, ఆ తరువాత సంవత్సరం సెలెక్ట్ అయ్యాడు. ఆ రోజు మా అందరి ఆనందానికి హద్దులు లేవు. మన దగ్గరి వారి జీవితాశయం నెరవేరినప్పుడు మనకు చాల సంతోషంగా ఉంటుంది. అతనికి ఖమ్మం జిల్లా కలెక్టర్ గా పోస్టింగ్ ఇచ్చారు. అలా వారు ఎప్పుడు ఢిల్లీ వచ్చినా మేము, స్వాతి కలిసి తిరుగుతుండేవాళ్ళం. వారం క్రితం వ చ్చి వెళ్లే రోజు వారిని దింపడానికి రైల్వే స్టేషన్ కి వెళ్ళాను. స్వాతి ఏదో పని పైన ఇంట్లో ఉండిపోయింది. ఆ రోజు చాల విచిత్రమైన సంభాషణ జరిగింది మా మధ్యలో. ముందుగా సూర్యా తనదయిన ధోరణిలో "గౌతమ్, చాల సంవత్సరాల నుంచి చూస్తున్నాను. నువ్వు, స్వాతి చాల విషయాలలో ఒకటే అభిప్రాయంపైన ఉంటారు. ఒకరంటే ఒకరు అభిమానంగా ఉంటారు. మీ స్నేహం ప్రేమగా, పెళ్లిగా ఎందుకు మారకూడదు" అని సూటి ప్రశ్న వేశాడు. ఈ ప్రశ్నకి ఒక్కసారిగా ఉలిక్కి పడిన నేను "సూర్యా , మా సంబంధాన్ని ఎంత తప్పుగా అర్థం చేసుకున్నావు. మనమంతా ఎలా స్నేహంగా ఉంటామో, స్వాతి తో కూడా అలాగే ఉంటాను. తనని ఈ దృష్టితో ఎప్పుడూ చూడలేదు. తాను కూడా నన్ను ఎప్పుడూ ఆ దృష్టితో చూడలేదు. " అన్నాను. దానికి శ్రీరామ్ " నీవు చెప్పింది నిజమవచ్చు కానీ, సూర్యా అన్నదానిలో తప్పు లేదు. ఇకనుండి ఆ దృష్టితో ఒకరినొకరు చూసి ఇష్టపడి పెళ్లి చేసుకుంటే తప్పేముంది.

ఇలా ఒకరినొకరు ఇన్ని సంవత్సరాలుగా దగ్గరగా గమనిస్తూ పెళ్లి చేసుకునే అవకాశం ఎంత మందికి వస్తుంది. పెద్దలు కుదిర్చిన సంబంధాల్లో ఇది కుదరకపోవడం వలన పెళ్లి అయిన తరువాత చాల మంది ఇబ్బంది పడడమో, సర్దుకుపోవాల్సి రావడమో జరుగుతోంది. అందుకని, మేము చెప్పేది ఒక్కసారి నిదానంగా ఆలోచించి నిర్ణయం తీసుకో. " అన్నాడు. అక్కడితో ఆ చర్చ ముగిసింది. కానీ, ఇంటి కొచ్చాక రెండు, మూడు

రోజుల వరకూ ఆ ఆలోచన నన్ను నిద్రపోనివ్వలేదు. మెల్లగా, సూర్యా మాటలో నిజమున్నట్టు అనిపించింది. ఎప్పుడైతే, నా ఆలోచన మారిందో మనసులో ఒక అలజడి, తెలియని ఆనందం మొదలయ్యాయి. స్వాతి తో మామూలుగా ఉండ లేక పోతున్నాను. అలాగని స్వాతి తో ఈ విషయం ఎలా చెప్పాలో కూడా తెలీట్లేదు.

ఇది ఇలా ఉండగా, ఒక వారం రోజుల తరువాత మా మేనేజర్ రాజారావు గారు నన్ను, స్వాతి ని సాయంత్రం ఆఫీస్ అయ్యాక ఒక హోటల్ కి తీసుకెళ్లి మాటల్లో ఇలా అన్నారు "మీ ఇద్దరి తో ఒక విషయం చెప్పాలని దాదాపు నెలరోజులుగా అనుకుంటున్నాను. మీ ఇద్దరు ఎంతో స్నేహంగా ఉన్నా మన ఆఫీసులో మీ సాన్నిహిత్యం గురించి రక రకాలుగా అనుకుంటున్నారు. కొందరు నా దగ్గర పరోక్షంగా, కొందరు నేరుగా కూడా మాట్లాడుతున్నారు. అది నాకు నచ్చలేదు. ఎందుకంటే, మీ ఇద్దరి మధ్య ఉన్నది కేవలం స్నేహ బంధం మాత్రమే అని తెలుసు. కానీ, ఆలోచించగా వారి పుకార్లని మీరెందుకు నిజం చేయకూడదు అన్పించింది. ఎందుకంటే, మీ ఇద్దరి మధ్యలో మంచి అనుబంధం ఉంది. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నారు. ఇలాంటి వాళ్ళు, పెళ్లి చేసుకుంటే జీవితమంతా సంతోషంగా ఉంటారు" అన్నారు.

అది వినగానే, నేను మా స్నేహితులకి చెప్పిన సమాధానమే చెప్పి స్వాతి ఏం చెప్తుందో అని ఆత్రంగా చూసాను. స్వాతి మాత్రం ఇంట్లో వారితో మాట్లాడి ఏ సంగతి చెప్తాను అంది. దాంతో నాలో కొంత సంతోషం, స్వాతి ఇంట్లో ఏమంటారో అనే ఆదుర్దా మొదలయ్యింది. ఆ మర్నాడు, ఆఫీస్ పని మీద కలకత్తా వెళ్లి మూడు రోజుల తరువాత వచ్చాను.

రాగానే సామాను రూంలో పెట్టి స్వాతీ వాళ్ళింటికి కలకత్తా నుండి తెచ్చిన బెంగాలీ స్వీట్లు ఇద్దామని వెళ్ళాను. కాలింగ్ బెల్ కొట్టబోయి వాళ్ళు నా గురించే మాట్లాడుతున్నారని తెలిసి అక్కడే ఆగిపోయాను.

అప్పటికే స్వాతి రాజారావు గారు మా పెళ్లి విషయం పై ఇచ్చిన సలహా ఇంట్లో చెప్పినట్టు అర్థం అయ్యింది. స్వాతి తల్లి తండ్రులు అందుకు సుముఖంగా లేరనే విషయం కూడా అర్థమవుతోంది. అలా తలుపు చాటుగా వినడం తప్పని తెలిసినా నా లోని ఆదుర్దా అక్కడి నుండి వెళ్లనివ్వకుండా చేసింది. స్వాతీ వాళ్ళ నాన్నగారు "అతనికి ఎవ్వరూ లేరు. రేపు మా తదనంతరం మీరిద్దరు మిగులుతారు. మళ్ళీ అతని చిన్నప్పటి జీవితంలాగా అవుతుంది, మీ జీవితం కూడా. మాకు నువ్వు ఒక పెద్ద కుటుంబం లోకి వెళ్ళాలి, చిన్నప్పటి నుండి అందరికి దూరంగా ఉన్న నీకు ఆ సమస్య పెళ్లితో తీరాలని మా కోరిక" అన్నారు. ఆయనకు తగ్గట్టు గానే స్వాతి తల్లి "గౌతమ్ ది మన కులం కాదు. ఒక స్నేహితుడిగా ఉండడానికి నాకు కులం పట్టింపు లేదు కానీ, అతన్ని అల్లుడి లాగా ఆమోదించలేను" అన్నారు. స్వాతి వాళ్లకు కాసేపు నచ్చ చెప్పడానికి ప్రయత్నం చేసింది కానీ చివరకు

వాళ్లతో "నేను మొదటి నుంచి చెప్పినట్టు అతన్ని మంచి స్నేహితుడుగానే భావించాను. ఏ రోజూ ఒక ప్రేమికుడిగా చూడ లేదు. కానీ, రాజారావు గారు చెప్పాక పెళ్లి చేసుకుంటే ఆ బంధం ఇంకా బాగుంటుందనిపించింది . అయితే, మిమ్మల్ని బాధ పెట్టి మాత్రం ఆ పని చేయలేను. నాకు మీ తరువాతే ఎవరైనా. ఈ విషయం ఇక్కడితో వదిలేద్దాము. నాన్నా,రాజారావు గారితో మన నిర్ణయం చెప్పి అతను బాధ పడకుండా జాగ్రత్తగా అతనికి చెప్ప మనండి " అంది.

ఇంక అక్కడ ఉండలేక , రూమ్ లోకి వచ్చిపడ్డాను. ఎందుకో నేను మళ్ళీ అనాథ ని అయిపోయాననిపించింది. ఎవ్వరూ లేకపోవడమనే, నేను చేయని తప్పుకు నాకు ఇంత పెద్ద శిక్షా అనిపించింది. ఆ రాత్రంతా ఆలోచనల తోనే గడిపాను. స్వాతి తో ఇంక మాట్లాడద్దనుకొన్నాను.

కానీ, చేయని తప్పుకి స్వాతి ని శిక్షిస్తే, నాకు, స్వాతి తల్లి తండ్రులకి ఇంక తేడా ఏమిటి అనిపించింది. అందుకే, ఏమీ తెలియనట్టుగా మాములుగా ఉందామని నిశ్చయించుకున్నాను. ఆ మర్నాడు రాజారావు గారింటికి వెళ్లి జరిగినదంతా చెప్పి ఆయనను ఈ విషయంపై స్వాతి ని అడగ వద్దని చెప్పాను . అయన ఆశ్చర్యపోయి స్వాతి కూడా ఫోన్ చేసి ఇలాగే మాట్లాడిందని అన్నారు. అలా, ఇద్దరం ఈ విషయం పైన నిర్ణయం ఏమీ తెలీనివాళ్లుగా ఉండేవాళ్ళము.

కానీ, ఇది జరిగిన తరువాత స్వాతి వాళ్ళ తల్లితండ్రుల వైఖరిలో మార్పు కనిపించింది. ఒక సారి స్వాతి లేనప్పుడు, నన్ను పిలిచి స్వాతి కి పెళ్లి చేద్దామనుకుంటున్నామని, చుట్టాలలోనే ఒక మంచి సంబంధం ఉందని చెప్పారు. నా కెందుకో నేను వారింట్లో అద్దెకి ఇంక ఉండడం ఇష్టం లేదోమోననిపించింది. నా అనుమానము కొద్ది రోజులలోనే నిజం అయ్యింది. ఒక రోజు స్వాతి లేకుండా చూసి నన్ను పిలిచి స్వాతీ వాళ్ళ నాన్నగారు స్వాతికి ఇంతకుమునుపు చెప్పిన సంబంధం ఖాయం అవుతోందని, పెళ్ళికి ఇల్లు సరిపోకపోవచ్చని, నేను ఖాళీ చేస్తే వాళ్లకి సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. నేను కూడా వెంటనే ఖాళీ చేస్తానని చెప్పాను.

నాకు ఎందుకో ఇంక ఢిల్లీలో ఉండాలనిపించలేదు. ఎక్కడికైనా దూరంగా వెళ్లి పోదామనిపించింది. బాగా ఆలోచించి రాజారావు గారిని కలిసి ఉద్యోగంకి రాజీనామా చేద్దామనుకుంటున్నాని చెప్పాను. ఆయన కి మొత్తం విషయం అర్థమైనా నాకు నచ్చ చెప్పాలని చాలా ప్రయత్నించారు. కానీ, అప్పటికే నేను గట్టి నిర్ణయానికి రావడంతో ఏదో కుంటి సాకులు చెప్పేశాను. కానీ, ఆయన అడిగిన ప్రశ్న "ఢిల్లీ వదిలి ఎక్కడికి వెళ్తావు" అన్నదానికి సమాధానం చెప్పలేకపోయాను.. చివరికి ఒక రెండు రోజుల తరువాత రాజీనామాను అంగీకరించారు. అయితే, ఒక్క పదిహేను రోజులు ఉండి చేస్తున్న పనిని ఇతరులకి అప్పచెప్పి వెళ్ళమన్నారు.

అందుకు, నేను కాదనలేకపోయాయను ఆయన పైన ఉన్న అభిమానంతోనూ , ఈ ఆఫీస్ పట్ల నాకున్న కృతజ్ఞతా భావము వలన. కానీ, ఈ వార్త మెల్లగా ఆఫీస్ అంతా పాకి, స్వాతికి ఆమె తల్లితండ్రులకీ తెల్సింది. ఆ రోజు సాయంత్రం స్వాతి నా రూంకి వచ్చింది.

కాసేపు, ఏదో మాములు కబుర్లు చెప్పి ఇలా అంది "నా వలన మీ ఉద్యోగ జీవితం దెబ్బ తింది. మీ వంటి ఉత్తమమైన స్నేహితుడికి నేను చేసిన మేలు ఇదా? చాలా బాధగా ఉంది. మీరు నాకు ఆనందంగా జీవించడం నేర్పిస్తే, నేను మీకు మంచి జీవితాన్ని దూరం చేశాను. నన్ను క్షమించండి. తల్లి తండ్రులకి ఎదురు చెప్పలేక, మిమ్మల్ని వదులుకోలేక చాల నలిగి పోయాను" అని బాధ పడింది. అందుకు నేను "ఊరుకో స్వాతి, భగవంతుడు అందరికీ అన్నీ ఇవ్వడు. ఎవరికి ఏది మంచో, ఎప్పుడు ఏమివ్వాలో ఆయనకు బాగా తెలుసు. నువ్వున్న పరిస్థితిలో నేనుంటే ఇలానే ప్రవర్తించేవాడిని. మనం ఇవన్నీ మర్చిపోయి మన స్నేహాన్ని కొనసాగిద్దాం" అన్నాను . అక్కడితో మా ఇద్దరి మనసులు తేలికపడ్డాయి.

ఆ మర్నాడు, వాళ్ళింటికి వెళ్లి ఏమీ జరగనట్టుగా మాములుగా ప్రవర్తించాను. వాళ్ళూ అలానే ఉన్నారు. కానీ, నా మనసులో మాత్రం ఎంత తొందరగా ఢిల్లీ నుంచి వెళిపోతే అంత బాగుంటుందనిపించింది. ముందుగా, కాకినాడకి వెళ్లి కొన్ని రోజులు గిరీష్, శ్రీరామ్, సూర్యలతో గడిపి తరువాత మజిలీ గురించి ఆలోచిద్దామనుకొన్నాను .

ఆ ఆదివారం నాడు రాజారావు గారు భోజనానికి వాళ్ళింటికి పిలిచారు. భోజనము తరువాత ఆయన మాట్లాడుతూ " నీతో ఒక విషయం మాట్లాడాలని గత రెండు, మూడు రోజులనుంచి ప్రయిత్నిస్తున్నాను కానీ సాధ్య పడలేదు. నీకు ఇంతకు మునుపు చెప్పానో, లేదో తెలీదు కానీ, నాకు దాదాపు అరవై ఏళ్ల అక్క, ఆవిడకంటే ఆరేళ్ళు పెద్ద బావగారు ఉన్నారు. వారు తెనాలి దగ్గర ఒక పల్లెటూరులో ఉంటారు. ఆయన ఆ ఊర్లో పేరున్న రైతు. వాళ్లకి ఒక అబ్బాయి . నీ లాగానే బాగా చదువుకుని అమెరికాలో ఉద్యోగం తెచ్చుకుని అక్కడే స్థిర పడ్డాడు. అతనికి పెళ్లి అయ్యింది. ఇద్దరు పిల్లలు కూడా. నీ కంటే పదేళ్లు ఎక్కువ ఉంటాయేమో వాడికి . మొదట్లో రెండు, మూడు సార్లు వీళ్ళు వాడి దగ్గరికి అమెరికా వెళ్లారు కానీ, గత మూడు ఏళ్లుగా వారి ఆరోగ్య రీత్యా ప్రయాణం చెయ్యడం లేదు. వాడు మొదట్లో ప్రతి సంవత్సరం వచ్చేవాడు, కానీ ఇప్పుడు రెండు, మూడేళ్ళకి కానీ ఇక్కడకి రావట్లేదు, వాడి ఉద్యోగ, సంసార బాధ్యతల వలన.

ఈ మధ్య మా అక్క, బావగారు అక్కడికి వెళ్ళ లేక, ఇక్కడ ఉండలేక ఒక రకమైన ఒంటరి తనం అనుభవిస్తున్నారు, ఈ వయసులో వారికి తోడుగా ఉండి, వారి మంచి చెడ్డలు చూస్తుండే మంచి మనిషి కావాలి.

మేమంతా సంసార, ఉద్యోగ బాధ్యతల వలన ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాము. నా కెందుకో నీ లాంటి మంచి మనిషి వారికి తోడుగా కొంత కాలమైనా ఉంటే చాల బాగుంటుందనిపిస్తోంది. నువ్వు మళ్ళీ ఇంకో ఉద్యోగంలో చేరే వరకూ , అక్కడకు వెళ్లి ఉంటావా? ఇది నా అభ్యర్థన మాత్రమే. ఇది నిన్ను ఇబ్బంది పెట్టినా , నచ్చక పోయినా ఇది ఇక్కడ తో వదిలేద్దాము" అన్నారు.

నాకు వినగానే వింతగా అనిపించినా, కాస్త ఆలోచిస్తే ఆయన అడిగిన దానిలో తప్పు లేదు అనిపించింది. నేను కొంత కాలం అక్కడ ఉండడం వలన వారికీ మేలు జరుగుతుందంటే ఎందుకు కాదనాలనిపించింది. అంతేకాక ప్రస్తుతం నేనున్న పరిస్థితికి పల్లెటూరు వాతావరణం మార్పుగా ఉంటుందనిపించింది. అందుకే ఆయన చెప్పిన దానికి ఒప్పుకున్నాను ఎటువంటి షరతులు లేకుండా. ఆయన చాల ఆనందపడి వెంటనే వాళ్ళ అక్క, బావలకి ఫోన్ చేసి ఈ వార్త చెప్పి, నన్ను ఫోన్లోనే పరిచయం చేశారు. ఆ తరువాత వారమంతా చాల హడావుడిగా గడచిపోయి నేను వెళ్లే రోజు వచ్చింది. మధ్యలో ఒక రోజు సాయంత్రం నాకు ఆఫీసులో వీడ్కోలు ఫంక్షన్ కూడా చేశారు. అందరూ నా గురించి చాల బాగా మాట్లాడారు. నేను ఈ ఆఫీసు ఇచ్చిన ఉద్యోగ అనుభవం గురించి ,వాళ్ళందరి తో ఏర్పడిన అనుబంధం గురించి మాట్లాడాను. నేను వెళ్లే రోజు రైల్వే స్టేషన్ కి రాజారావు గారు, స్వాతి, ఆమె తల్లి తండ్రులునాకు వీడ్కోలు పలకడానికి వచ్చారు . ఆ రోజు ఎందుకో దిగులుగా, చాల దగ్గరి వారిని వదిలి వెడుతున్నట్టుగా బాధగా అనిపించింది. అలా అక్కడితో నా ఢిల్లీ జీవితం, కొంత వరకు ఉద్యోగ పర్వం కూడా ముగిసిపోయి పల్లెబాట పట్టాను. రైలు ప్రయాణం అంతా నా ఢిల్లీ జీవితపు ఆలోచనలతో గడిచిపోయింది. తెనాలి కి రైలు మర్నాడు పొద్దున్న ఐదు గంటలకి చేరింది. రైలు దిగి దిక్కులు చూస్తున్న నాకు రాజారావు గారి బావగారు ఆనందరావు గారు కనిపించారు.

ఆయన ఫోటో అప్పటికే రాజారావు గారు చూపించటం వలన ఆయనను గుర్తుపట్టి పలకరించాను. ఆయన కూడా ఆప్యాయం గా పలకరించారు. ఇద్దరం కలసి ఆయన తీసుకు వచ్చిన కారులో వారి ఊరికి ప్రయాణం అయ్యాము. దారి పొడుగునా పల్లెటూర్లు , పొద్దునే లేచి పనులకు సిద్ధమవుతున్న ప్రజలు, పల్లె అందాలు నన్ను బాగా ఆకర్షించాయి. దానికి తోడు ఆనందరావు గారు చెబుతున్న చక్కటి కబుర్లతో వారి ఊరు రామాపురం ఎప్పుడు వచ్చిందో కూడా తెలీలేదు.

కారు దిగి ఇంట్లోకి రాగానే ఆనందరావు గారు ఆయన భార్య సుగుణ గారిని పరిచయం చేసారు. ఆవిడా ఆప్యాయంగా పలకరించారు. వాళ్ళ ఇల్లు చాలా పెద్దది. ఇంటి చుట్టూ కుడా చాల స్థలం ఉంది. అందులో చక్కటి మొక్కలు పెంచారు. ఇంటి ముందు అరుగు, వెనక వైపు నుయ్యి , పశువుల కొట్టం, ధాన్యం కొట్టు ఇలా ఎటు చూసిన ఆకట్టు కొనే వాతావరణం నన్ను మంత్ర ముగ్దుడ్ని చేశాయి. ఇంతలో సుగుణగారు ఘుమఘుమ లాడే

కాఫీ అందించారు. వారిని ఎలా పిలవాలని ఆలోచిస్తున్న నన్ను "నీవు మా అబ్బాయి మురళి వయసు వాడివి. నిన్ను చూస్తే వాడే గుర్తొస్తున్నాడు. మమ్మల్ని మీరు , గారు అనో పిలవకుండా పిన్ని, బాబాయ్ అని పిలువు బాబు" అని అనగానే, నాకు చాల సంతోషం అనిపించింది. ఎందుకంటే, చిన్నప్పుడే దగ్గర బంధువులకి దూరమైన నాకు పిన్ని, బాబాయ్ అనే పిలుపుతో ఇన్నాళ్ళూ కోల్పోయిన ఆప్యాయత కనిపించింది.

ఆ తరువాత నాకు గది చూపించి "ఇది నీ గది. లోపల కెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకో. ప్రయాణం చేసి అలసి పోయి వచ్చావు కదా" అన్నారు. ఆ గది విశాలంగా, చక్కగా సర్ది అందంగా ఉంది. ఒక మంచం, రాసుకునే టేబుల్ , కుర్చీ, అల్మారాలు ఇలా అన్ని వసతులూ ఉన్నాయి ఆ గదిలో. నా సామాను అంతా అల్మారాలో సర్దేసి, స్నానం చేసి కాసేపు ప్రశాంతంగా కూర్చునే విశ్రాంతి తీసుకొన్నాను. బయట ఎవరిదో గొంతు వినిపించి హాల్లోకి వచ్చాను.

దాదాపు పది మంది, బహుశా ఊర్లో వాళ్ళనుకుంట నా కోసమే ఎదురు చూస్తూ కూర్చున్నారు. వాళ్లందరికీ నేను చిరునవ్వుతో నమస్కారం చేశాను. వాళ్లు కూడా నా వంక ఆప్యాయంగా చూసారు.

ఆనందరావు గారు వాళ్ళని నాకు పరిచయం చేసి వారితో "నిన్న నేను చెప్పిన మా తమ్ముడి కొడుకు గౌతమ్ ఇతనే. బాగా చదువుకొని, ఢిల్లీలో మంచి ఉద్యోగం చేసాడు. కొన్నాళ్లు మాతో గడుపుదామని ఇక్కడకు వచ్చాడు" అన్నారు. అలా పరిచయం చేయడం నాకు ఎంతో సంతోషంగా అనిపించింది. వాళ్ళు కాసేపు మాట్లాడి వెళ్ళాక, ఆనందరావు గారు నాతో "నీకు ఏమి ఇబ్బంది కలగలేదు కదా వీళ్ళ రాక వలన. పల్లెటూర్లలో ఎవరింటికి చుట్టాలు వచ్చినా అందరికి తెలుస్తుంది. ఇలా వచ్చి పరిచయం చేసుకోవడం సహజం." అన్నారు. నేను "అదేమీ లేదు బాబాయ్, వీళ్ళందరూ మీ ఆప్తులే కాదు, నాకు కూడా దగ్గర వాళ్ళే ఇప్పటినుండి" అన్నాను. ఆయన వెంటనే "నువ్వు అలా అనుకోవడం నీ సంస్కారం. సాయంత్రం ఊర్లోకి వెళదాము. నీకు ఊరు చూపిస్తూ ఇంకొందరు ముఖ్య మైన వారిని పరిచయం చేస్తాను." అన్నారు. తరువాత చక్కటి భోజనం చేసి, కాసేపు పడుకుని, సాయంత్రం ఆయన వెంట ఊర్లోకి వెళ్ళాను.

మెల్లగా నడుస్తూ, పల్లెటూరి అందాలు చూస్తూ, ఆయన చెప్పిన వివరాలు వింటూ ఉంటే చాల హాయిగా ఉంది. ఊరి మధ్యలో గుడి, దాని పక్కనే చిన్న బస్సు స్టాండ్, ఇంకొంత దూరం వెళ్తే ప్రాధమికి పాఠశాల, గ్రంధాలయం, ఊరి మొదట్లో పంచాయతీ కార్యాలయం, పాల సేకరణ కేంద్రం, షావుకారు కొట్టు ఇలా చూడ ముచ్చటగా ఉన్నాయి. చిన్న ఊరవడంతో ఎక్కడి నుంచి ఎక్కడికైనా పదిహేను నిమిషాల్లో వెళ్లపోవచ్చు నడుస్తూ. దారి పొడుగునా కనిపించిన వారందరికీ నన్ను ఆయన తమ్ముడి కొడుకుగా పరిచయం చేస్తుంటే గొప్ప హోదా

పొందినట్టనిపించింది. ఎప్పటికీ ఇక్కడే ఉండిపోతే ఎంత బాగుంటుంది కదా అనిపించింది. ఊరంతా చూసి ఇంటికి వచ్చాక భోజనం చేసి హాల్లో కూర్చుని కాసేపు కబుర్లు చెప్పుకున్నాము.

ఇంతలో వాళ్ళబ్బాయి, మురళి ఫోన్ చేసి ముందు వాళ్లతో తరువాత నాతో పరిచయం చేసుకుంటూ మాట్లాడాడు. నేను ఇక్కడికి రావడం వలన అతని తల్లి తండ్రుల గురించి తాను చాలా ధైర్యంగా ఉన్నానని, సొంత తమ్ముడిని చూసినట్టుగా ఉందన్నాడు. నేను కూడా అతన్ని అన్నయ్య అని సంబోధిస్తూ మాట్లాడాను, నాకిక్కడ ఎంతో బావుందని చెప్పాను.

అలా ఒక వారం రోజులపాటు గడిచిపోయింది. ఈ వారం రోజుల్లో వారిని నా సొంత వారి లాగా భావించి, నా గతం గురించి వారికి, వారి అబ్బాయి మురళి కి చెప్పుకున్నాను. దాని వలన నా మనసు తేలికపడింది, వారికి నేను మరింత దగ్గర అయ్యాను. అలాగే, సుగుణ పిన్ని, ఆనందరావు బాబాయ్ కూడా వారి చిన్నప్పటి విశేషాలు, గడిచిన గతం గురించి ఎటువంటి అరమరికలు లేకుండా నాతో చెప్పారు. నిజానికి, వారిది నిరుపేద రైతు కుటుంబం. ఆనందరావు బాబాయ్ చాల కష్టపడి పైకి వచ్చారు. పగలు పొలం పనులు చేసుకుంటూ సాయంత్రం ఎదురింటి మాస్టర్ దగ్గర చదువు నేర్చుకున్నారు. ఆయనకు ఎటువంటి డిగ్రీ లేక పోయినా బ్రతకడానికి కావలిసిన విద్యని అభ్యసించారు. తెలుగు, ఇంగ్లీష్ రాయడం, మాట్లాడడం, లెక్కలు చేయడం లాంటివి బాగా నేర్చుకొన్నారు. వలచి స్వయానా మేనత్త కూతురు సుగుణను పెళ్లి చేసుకొన్నారు. ఆవిడ ఇంటి బాధ్యత అంతా చక్కగా చూసుకునేవారు. తమ లాగా ఒక్కగానొక్క కొడుకు మురళి చదువు లేకుండా అవకూడదని పట్నం పంపించి పెద్ద చదువులు చదివించారు. అతను వారి ఆశలను వమ్ము చేయకుండా కష్టపడి చదువుకొని పైకొచ్చాడు. ఆరు సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడ్డాడు. అతనికి ఒక కూతురు, కొడుకు. వారి కోడలు రాధ కూడా చాల మంచి మనిషి. వారి గురించి విన్నకొద్దీ ఇంకా వారిపై గౌరవం, ఆప్యాయత పెరిగాయి.

ఈ వారం రోజుల్లో ఢిల్లీ నుండి రాజారావు గారు, స్వాతి, నా స్నేహితులు కూడా ఫోన్ చేసారు. నేను ఇక్కడ సంతోషంగా ఉన్నానని విని వాళ్ళు ఆనందపడ్డారు. ఇంతలో తాను ఢిల్లీ నుంచి రవాణా చేసిన తన బైక్ కూడా వచ్చింది.

అది వచ్చినప్పటి నుండి బాబాయిని బైక్ మీదే పొలానికి, ఊర్లోకి తీసుకెళ్ళేవాడిని. మొదట్లో మొహమాటపడ్డా నా బలవంతం మీద మెల్లగా అలవాటు పడ్డారు. మెల్లగా కొన్ని పనులకి, నేను ఒక్కడినే బయటికి వెళ్లి ఇంటి

పనులు చేసుకొచ్చేవాడిని. ఇలా దాదాపు మూడు నెలలు గడిచి పోయాయి. ఈ మూడు నెలల్లో పూర్తిగా వాళ్ళింట్లో మనిషిని అయిపోయాను. అలాగే, ఊర్లో వాళ్ళందరూ కూడా బాగా పరిచయమయ్యారు.

మురళి అమెరికా నుండి మొదటి సారి వచ్చినప్పుడు మంచి టీవీ, పెద్ద ఫ్రిజ్ , కంప్యూటర్ తో పాటు ఒక చిన్న కారు కూడా కొనిచ్చాడు. బాబాయికి డ్రైవింగ్ రాకపోవడంతో కారు వాడాలంటే తెనాలి నుంచి డ్రైవర్ని పిలిపించాలి. అతను వచ్చే వరకూ నమ్మకం ఉండదు, వచ్చినా సమయానికి రాడు. ఈ బాధలు పడలేక కారు వాడడమే తగ్గించేశారు. ఒక సారి మాటల సందర్భంలో నాకు డ్రైవింగ్ వచ్చునని, ఇంక ఆ డ్రైవర్ ని పిలవక్కరలేదని చెప్పాను. నేను, మురళి మాట్లాడుకుని ఆ పై ఆదివారం పిన్ని, బాబాయ్ పెళ్లి రోజు నాడు వాళ్ళకి ఎక్కడికి అని చెప్పకుండా తెనాలి వైకుంఠపురం గుడికి తీసుకెళ్లి, అక్కడి నుంచి సినిమాకి, ఆ పైన మంచి హోటల్లో భోజనం కి తీసుకువెళ్లాను. ఆ రోజు ఇంటికి వచ్చాక మురళితో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల తరువాత పెళ్లి రోజు చాలా బాగా గడిపామన్నారు. మురళి కూడా, నీ వల్లనే ఇది సాధ్యపడింది. నేను అక్కడున్నా ఇంత బాగా వాళ్ళని తిప్పేవాణ్ణి కాదేమో అన్నాడు. నాకు ఏమి మాట్లాడాలో తోచలేదు. కానీ, అప్పటి నుండి వారిని కనీసం నెల రోజుల కొకసారైనా ఇలా బయటకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాను. మధ్య మధ్యలో ఇంకేదన్నా అవసరముంటే కూడా కారులో తీసుకెళ్ళేవాడిని.

అలా కొన్ని నెలలు కాలం తెలీకుండా గడిచిపోయాయి. ఒక రోజు రాజారావు గారి నుండి ఫోన్ వచ్చింది. స్వాతి పెళ్లయి హైదరాబాద్ కి తల్లి తండ్రులతో సహా వెళ్లి పోయిందని చెప్పారు. నాకెందుకో ఈ వార్త విని ఎటువంటి భావన కలగలేదు. ఇప్పుడు నేను అనుభవిస్తున్న ప్రశాంత జీవితం దానికి కారణం కావచ్చు.

రాజారావు గారు ఇప్పుడు వాళ్ళ ఇంట్లోనే అద్దెకు ఉంటున్నారట. అలాగే, నా పోస్ట్ ఇంకా ఖాళీగా ఉందని కావాలంటే నేను మళ్ళీ అదే ఉద్యోగంలో చేరవచ్చు అని చెప్పారు. స్వాతి ఢిల్లీనుంచి వెళ్ళిపోయింది కాబట్టి నాకెటువంటి ఇబ్బందికర పరిస్థితి ఉండదని ఆయన అభిప్రాయము. నేను ఆయనతో "ఇక్కడ చాల బాగున్నాను. చక్కటి కుటుంబం పిన్ని, బాబాయ్ రూపంలో దొరికారు. ఈ ఊరు, ఊర్లో మనుషులు చాల నచ్చారు . ఇక్కడి నుంచి కదలాలని లేదు." అన్నాను. ఆయన "నాకు కూడా నిన్ను వాళ్ళ దగ్గర నుంచి వేరు చేయాలని లేదు. నీవు అక్కడకు వెళ్ళాక, వాళ్ళలో మంచి మార్పు కనిపిస్తోంది. నీ ఉద్యోగ భవిష్యత్ పాడవకూడదని ఇలా చెప్పాను. అంతే కానీ, నిన్ను ఇబ్బంది పెట్టాలని కాదు. నీకు ఇష్టమైనంత కాలం అక్కడ ఉండు. " అన్నారు. అక్కడితో ఆ విషయం ముగిసింది.

నేను బాబాయ్ తో పొలం దగ్గరికి వారానికి మూడు, నాలుగు రోజులు వెళ్తూవుండేవాన్ని. వయసైపోయి, ఆరోగ్యరీత్యా పొలాన్ని కౌలుకి ఇచ్చినా బాబాయ్ పొలంకి తరచుగా వెళ్ళి అన్ని పనులు చూసుకునేవాడు. ముఖ్యంగా విత్తనాలు నాటేటప్పుడు, నారు తీసేటప్పుడు, పంట ఇంటికొచ్చేప్పుడు వెళ్ళి సలహాలు ఇవ్వడమేకాక దగ్గరుండి చూసుకొనేవాడు. ఆయన వెంట వెళ్ళి అక్కడ గడపటం వలన నాకు వ్యవసాయం పట్ల అవగాహన, ఆసక్తి కలిగింది. నేను కూడా ఆయనకు సహాయంగా పంట పనులలో పాల్గునేవాడిని. నిజంగా మన కళ్ల ముందర నాటిన విత్తనాలు పెరిగి చక్కటి పంటగా పెరుగుతుంటే ఎంతో సంతోషంగా ఉంటుంది.

ఊరు చివర ఒక కాలువ ఉంది. ఆ కాలువ నుంచే పొలాలకు నీళ్లు వదులుతుండేవారు. ఆ కాలువలో నీళ్లు పుష్కలంగా ఉండేవి. ఆ కాలువ నుంచే ఊర్లోకి కూడా నీళ్లు మోసి తెచ్చుకొనే వారు. ఓపిక ఉన్నవాళ్లు సొంతంగా, లేని వారు మనిషిని పెట్టుకుని తెప్పించుకొనేవారు. వానాకాలం ఇది ఒక సమస్యగా ఉండేది. విచిత్రమేంటంటే ఊర్లో ఎన్ని బావులు తవ్వినా నీళ్లు వచ్చేవి కావు. ఊర్లో వారు దీనికి కారణం ఊరు ఎత్తులో ఉండడం , ఒకప్పుడు ఈ స్థలమంతా రాళ్ళ గుట్టని చెప్పేవాళ్ళు. నా ఇంజనీర్ బుర్ర మాత్రం దీనిని ఒప్పుకోలేదు.

కొన్ని రోజులు ఊరంతా దగ్గరగా నాకు తెలిసిన పద్దతులతో పరిశీలించిన తరువాత గుడి వెనకున్న ఖాళీ జాగాలో భూమిలోపల మంచి నీటి వనరులు ఉన్నట్లనిపించింది. ముందుగా బాబాయితో, ఆ తరువాత ఊరి పెద్దలతో ఈ విషయం చెప్పాను. ఈ విషయాన్ని వెంటనే నమ్మలేదు. అప్పుడు గుడి పూజారి గారు "మా తాత ఒకప్పుడు ఇక్కడ గుడి కోనేరు ఉండేదని చెప్పేవాడు. ఇతను చెప్పిన దానిలో నిజం ఉండి ఉండవచ్చు" అన్నారు. అలాగే, ఊరి మునసబు గారు కూడా " ఎవరో బయట ఊరతను మన ఊరి బాగు కోసం ఇంతగా కృషి చేస్తుంటే మనం అడ్డుకోవడం సబబా" అన్నారు. దానితో అందరూ నా ఆలోచన తో ఏకీభవించారు.

కానీ, ఆందరి మదిలో ఒకటే ప్రశ్న "ఈ పనికి చాల డబ్బు ఖర్చు, ఎన్నో అనుమతులు కావాలి. అవి ఎలా సాధిస్తాం" అని. దానికి నేను "అవ్వన్నీ నేను చూసుకుంటాను. మీ సహకారం ఉంటే చాలు" అన్నాను. వెంటనే, శ్రీరామ్ తో మాట్లాడి దీనికి వాడి ఐఏఎస్ ఆఫీసర్ పలుకుబడి కావాలన్నాను. దానికి వాడు వెంటనే ఒప్పుకుని ఇక్కడ జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఒప్పించాడు. ఆయన మంచి మనసుతో నేను అన్ని వివరాలతో వస్తే, ప్రభుత్వం నుంచి కావాల్సిన అనుమతులు, నిధులు ఇప్పిస్తానన్నారు.

అప్పటినుండి అదే పని పైన నా సమయం అంతా గడిపేవాణ్ణి. నేను ముందుగా నీటి వనరుల కోసం భూమి పరీక్ష చేశాను. ఫలితం ఆశాజనకంగా కనిపించడంతో బోర్ వేయడం మొదలు పెట్టాం. ఆ రోజు ఊరంతా అక్కడకు కదలి వచ్చింది. గుడి పూజారి గారు ప్రత్యేక పూజలు చేసారు. మొదట్లో రాళ్లు అడ్డుకున్నా పట్టుదలతో

ముందుకు వెళ్లి చివరికి నీటి జాడ కనిపెట్టాం సుమారు ఆరు వందల అడుగుల క్రింద. అయితే, రాళ్ల క్రింద లభించిన నీరు ఎప్పటికీ లభ్యమవుతుంది. ఆ నీళ్లు చూసిన ఊరి ప్రజల ఆనందానికి అవధులు లేవు. నన్ను అభినందనల్తో ముంచెత్తారు. అదే ఉత్సాహంలో అక్కడక్కడే మరో రెండు బోర్లు కూడా వేసాము. అన్నిటా అదే ఫలితం. ఆ తరువాత నేను తలపెట్టిన పని అక్కడ ఒక పెద్ద ట్యాంక్ కట్టడం.

మూడు బోర్ల నుండి వచ్చే నీటిని ఆ ట్యాంక్ లోకి మోటార్ల ద్వారా నింపి, అక్కడినుండి పైపుల ద్వారా ప్రతి ఇంటికి పంపించడం నా ధ్యేయం. దీనికి ప్రభుత్వం ఇచ్చిన డబ్బులకి అదనంగా ఊర్లో వాళ్ళందరూ కూడా విరాళాల రూపంలో ధన సహాయం చేసారు. అనుకున్నట్టుగా, తొమ్మిది నెలల్లో ట్యాంక్ కట్టడం, ఊరంతా పైపులు వేయడం జరిగింది. ఆ ట్యాంక్ ప్రారంభోత్సవం ఆ జిల్లా ఎంపీ గారి చేతుల మీదుగా జరిగింది. ఆ కార్యక్రమంలో ఎంపీ గారు నన్ను మెచ్చుకుంటూ చుట్టుపక్కల గ్రామాలకి ఇలాంటి సేవ చేయమన్నారు. ఆ రోజు అన్ని పేపర్లలో ఈ వార్త , ఎంపీ గారితో నా ఫోటో వచ్చింది. ఆ మర్నాడు పేపర్లో ఈ వార్త చూసి నా ఆప్త మిత్రులు గిరీష్, శ్రీరామ్, సూర్య, సత్యమూర్తి మాస్టారు, రాజారావు గారు, స్వాతి ఫోన్ చేసి అభినందించారు .

సత్యమూర్తి గారు నీవు చదివిన చదువుకు ఇవాళ సార్థకత లభించింది. ఎందుకంటే, సమాజానికి ఉపయోగపడే విద్య ఎంతో ఉత్తమమైనది అన్నారు. ఆయన నుంచి అలాంటి మాటలు వింటే నాకు చాల సంతోషం కలిగింది. రాజారావు గారు కూడా నీ చదువు, తెలివితేటలతో ఊరికి ఎంతో మేలు చేసావు. నిజానికి ఉద్యోగంలో కూడా ఇంత తృప్తి దొరకదు అన్నారు. నాకూ అది నిజమనిపించింది. ఆ తరువాత స్వాతి కూడా చాల సేపు మాట్లాడింది. నా విజయాన్ని మనసారా అభినందించింది. పెళ్ళయాక తాను, తన తల్లి తండ్రులు హైదరాబాద్ వచ్చేశామని, ఈ సారి హైదరాబాద్ వచ్చినప్పుడు వాళ్ళ ఇంటికి రమ్మని ఆహ్వానించింది.

ఆ తరువాత ఆలోచిస్తే నాతో పెళ్ళికి వాళ్ళ తల్లితండ్రులు ఒప్పుకోకపోవడం నా మంచికే అనిపించింది. అలా జరగకపోతే, నేను ఈ ఊరికి వచ్చేవాడిని కాదు, ఈ ఊరుకి సేవ చేసి ఇంతటి తృప్తిని పొందే అవకాశం వచ్చేది కాదు. అందుకే, అనిపిస్తుంది ప్రతి మాటకి, చర్యకి ఒక అర్థం ఉంటుంది. అది వెంటనే తెలియకపోవచ్చు, కానీ తరువాత ఎప్పుడో ఒకప్పుడు తప్పకుండా తెలుస్తుంది. ఇంక , నా స్నేహితుల హడావుడికి అంతమే లేదు. తొందర్లో ఈ వూరు వస్తామన్నారు. ఇంక ఇంటి దగ్గర పిన్ని , బాబాయ్, మురళి చాలా ఆనందపడ్డారు.

బాబాయ్ "ఈ ఊరికి మేము ఇన్ని సంవత్సరాలుగా చేయలేని మేలు నీవు కేవలం సంవత్సరంలో చేసావు. మాకు ఈ ఊర్లో ఎంతో మంచి పేరు తెచ్చి పెట్టావు. నువ్వు నిజంగా మా రెండో కొడుకువే " అన్నారు. ఆ రాత్రి నాకు ఆలోచనలతో, ఆనందంతో నిద్ర పట్టలేదు. ఆ పై వారం ఊర్లో వారందరు కలసి నాకు సన్మానం చేసారు.

వాళ్లకి ఇంట్లోకే నేరుగా నీళ్లు రావడం, బయటకు వెళ్లి తెచ్చుకొనే అవస్థ తప్పడంతో చాల సౌకర్యంగా ఉంది. ఇన్నాళ్లుగా అసాధ్యం అనుకున్న పని సాధ్యం అవ్వడంతో చాల సంతోషంగా ఉన్నారు. వీరందరి మాటలు, ప్రోత్సాహం నన్ను ఊరికి మరిన్ని మంచి పనులు చేయడానికి ప్రేరేపించింది.

పై విజయాన్ని చూసాక , ఊర్లో యువత కూడా నాతో జత కలిపింది. ముఖ్యంగా సూరి , రాంబాబు, గిరి మంచి స్నేహితులయ్యారు. వీళ్ళు ముగ్గురు మురళి తో కలిసి ఒకే స్కూల్లో చదువుకున్నారు. నాపై మురళి చెప్పిన అభిప్రాయంతో వారు అతి కొద్దికాలంలోనే మంచి స్నేహితులయ్యారు. ఆనందరావు గారు ఊరు, ఊరిలోని పెద్దలను పరిచయం చేస్తే, వీళ్ళు ఊర్లోని యువతని పరిచయం చేసారు. నాకు ఊరి చుట్టుపక్కల ప్రాంతాలు చూపించారు. చిన్నప్పుడు వారందరు తిరిగిన ప్రాంతాలు, ఆడుకున్న ఆటలు నాతో పంచుకొన్నారు. నేను కూడా వారితో చక్కటి స్నేహభావంతో ఉంటూ వారికి బాగా దగ్గర అయ్యాను. ఇప్పుడు ఏరా , ఒరేయి అని పిలుచుకునే చనువు వచ్చింది. వీళ్ళలో సూరి తండ్రి గ్రామ మునసబు. ఆయనకు సహాయంగా ఊర్లోనే ఉండి వారసత్వం పుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇంక రాంబాబు విషయానికొస్తే అతని తండ్రి స్కూల్ హెడ్ మాస్టర్. రాంబాబు కి కూడా ఉపాధ్యాయ వృత్తి ఇష్టం. ప్రస్తుతం అదే స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గిరి తండ్రిది ఎరువుల వ్యాపారం. గిరి ఆయనకు తోడుగా ఆ షాప్ లోనే ఉంటాడు. సూరి అందరి గొంతూ అనుకరిస్తూ సరదాగా మాట్లాడతాడు. అతనితో మాట్లాడుతుంటే సమయం తెలీదు. గిరి పల్లెటూరి యాస, చేసే అమాయకపు పనులు భలే నవ్వు తెప్పిస్తాయి. రాంబాబు ఉపన్యాసాలు ఇవ్వడంలో దిట్ట. ఊర్లో ఏ కార్యక్రమమైనా అతని ఉపన్యాసం తప్పనిసరి.

మేమంతా ఒక యువసేన లాగా మారి ఊర్లో ఇంకొన్ని అభివృద్ధి కార్యక్రమాలు మొదలు పెట్టాం. మా యువసేన కి జాగృతి అనే పేరు పెట్టాము. మేము తలపెట్టిన మొదటి పని ఉన్నత తరగతి పాఠశాల. ఊర్లో అప్పటిదాకా ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండేది. దాంతో ఐదవ తరగతి తరువాత చాల మంది చదువు ఆపేసేవారు, ఆర్థిక ఇబ్బందులు, రవాణా సదుపాయం లేక. నేను మా శ్రీరామ్ తో చర్చించి, జిల్లా విద్యాధికారులని కలసి ఒక ఉన్నత తరగతి పాఠశాల పెట్టడానికి అనుమతి సంపాదించాను. మాలో రాంబాబుకి పాఠశాల నిర్వహణ అనుభవం, ఆసక్తి ఉండడంతో అతనికున్న ఊరవతల జాగాలో పాఠశాల కడదామనుకున్నాము. వెంటనే ఊర్లో వాళ్ళకి విషయం చెప్పాము. వాళ్లు కూడా సంతోషించడమే కాకుండా కొందరు విరాళాలు కూడా ప్రకటించారు. నేను మళ్ళీ నా సివిల్ ఇంజనీరింగ్ బుర్రకి పని పెట్టి మంచి డిజైన్ తయారు చేశాను. అలాగే, మా శ్రీరామ్ పుణ్యమాని ప్రభుత్వనిధులు కూడా తొందరగానే వచ్చాయి. మేమంతా కలసి ఆడుతూ, పాడుతూ పాఠశాలని సంవత్సరంలోపు నిర్మించాము.

పాఠశాలలో అన్ని సదుపాయాలు కల్పించాము. చక్కటి తరగతి గదులు, ఆట స్థలం, మంచి నీళ్లు, చక్కటి మొక్కలు ఇలా ఎన్నో వసతులతో అందంగా ముస్తాబయ్యింది. పాఠశాల ప్రారంభోత్సవానికి ఈ సారి ఎంపీ గారితో పాటు , విద్యా శాఖ మంత్రి గారు కూడా వచ్చారు. ఆ సభలో వారు పిల్లలు కట్టే ఫీజుల్లో రాయితీలు ప్రకటించడమే కాక మధ్యాహ్న భోజన పథకం కూడా మంజూరు చేసారు. రాంబాబు ని పాఠశాల నిర్వాహకుడిగా ప్రకటించారు. ఊర్లో పెద్దలంతా ఆ సభలో నన్ను మరొక్కసారి పొగడ్తలతో ముంచెత్తారు. అలా మొదలైన పాఠశాల నిర్వహణ, అభివృద్ధికి మేమంతా రాంబాబుకి సహకారం అందచేస్తూండేవాళ్ళం.కేవలం మా ఊరి పిల్లలనే కాక , పక్క ఊరి పిల్లలని కూడా చేర్చుకొన్నాము. చుట్టూ ఉన్న మూడు ఊర్లలో ఉన్నత పాఠశాల లేకపోవడంతో అక్కడినుండి చాలామంది విద్యార్థులు వచ్చారు.

అలాగే, మా ఊరు, చుట్టు పక్కల బి.ఎడ్ చదువుకున్న నిరుద్యోగ యువతని ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేర్చుకొన్నాం. నాకు ఈ ఊరి ప్రగతిని చూస్తే చాల ఆనందముగా, ఇందులో నేను భాగమవ్వడం అదృష్టంగా అనిపించేది.

అలా సంతృప్తిగా గడిచిపోతున్న కాలంలో, ఒక రోజు అనుకోని సంఘటన జరిగింది. ఆ రోజు రాత్రి పడుకున్న గంట సేపటికి బాబాయ్ లేపి ఒంట్లో నలతగా , గుండె పట్టేసినట్టుగా ఉందన్నారు. వెంటనే కారు తీసుకుని తెనాలి హాస్పిటల్ కి తీసుకెళ్ళాను. డాక్టర్ పరీక్షించి గుండె నెప్పి వచ్చిందని, సమయానికి తీసుకురావడంతో ప్రాణం కాపాడ గలిగామన్నారు. ఆ తరువాత వారం రోజులు హాస్పిటల్లో ఉంచి, చికిత్స చేసి, పూర్తిగా తగ్గాక ఇంటికి పంపించారు. ఈ వార్త తెలిసిన మూడో రోజుకి మురళి వచ్చాడు. అతన్ని చూడడం అదే మొదటి సారి. తమ్ముడు, నాన్నని సరైన సమయంలో కాపాడి ఇంకో జన్మని ఇచ్చావు. సొంత తమ్ముడు ఉన్నా నాన్నని ఇంత బాగా చూసేవాడు కాదేమో అన్నాడు. ఆ తరువాత వారం రోజులు ఉండి తిరిగి అమెరికాకి వెళ్ళిపోయాడు. ఆ వారం అంతా ఇద్దరం కలిసే గడిపాము పిన్నీ వాళ్లతో, స్నేహితులతో. ఇద్దరి మధ్య ఒక చనువు, సాన్నిహిత్యం ఏర్పడింది.

అయితే, ఇది జరిగాక గిరి నాతో "బాబాయ్ ,నువ్వు దగ్గర ఉండడం వలన, కారు ఉండడం వలన సమయానికి వైద్యం అంది ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కానీ, ఊర్లో చాలామందికి కారు లేక, సమయానికి వైద్యం అందక ప్రాణాలు పోగొట్టుకున్న ఉదాహరణలు ఉన్నాయి." అన్నాడు. ఆ మాటలు నన్ను ఆలోచింపచేసాయి. అందరితో చర్చించి చివరకు ఒక నిర్ణయానికి వచ్చాను. ఊర్లో విరాళలు సేకరించి ప్రాథమిక వైద్యశాల కి ఒక అంబులెన్సు కొన్నాము. అందులో పనిచేసే కంపౌండరుకి డ్రైవింగ్ బాధ్యత అప్పచెప్పాము. అతనే కాకుండా,

నేను, గిరి అవసరమైతే ఎంత రాత్రి వేళైనా డ్రైవింగ్ చేసి తెనాలి హాస్పిటల్ కు తీసుకువెళ్తామని చెప్పాము.. ఇది ఊర్లో అందరి కోసం కొన్నది.

మొదట్లో, అంబులెన్సు ఎక్కువ వాడకపోయినా, మెల్ల మెల్లగా అవసరం వచ్చినప్పుడు వాడటం మొదలు పెట్టారు ఊరి ప్రజలు. ఈ మొత్తం నిర్వహణ గిరికి అప్పచెప్పాము.

ఇలా కొత్త కొత్త వసతులతో ఊరు అభివృద్ధి చెందుతూ వచ్చింది. అంతే కాదు, నేను ఈ ఊరు వచ్చి పది సంవత్సరాలు దాటి పోయాయి కూడా. చాల విచిత్రంగా అనిపిస్తుంది గత పదేళ్ల జీవితం వెనక్కు తిరిగి చూస్తే. ఎన్నో మార్పులు వచ్చాయి. ఉద్యోగం నుంచి వ్యవసాయంలోకి, మహానగరం నుంచి పల్లెటూరికి, కొత్త బంధాలలోకి మారుతూ వచ్చింది. అంతే , కాదు నాకు ఇప్పుడు నలభై ఏళ్ళు దాటాయి కూడా. పిన్ని, బాబాయ్ మధ్య , మధ్యలో నా పెళ్లి ప్రస్తావన తెచ్చేవారు. కానీ, నా గతం తెలియడంతో బలవంతం పెట్టేవారు కాదు. నాకు ఎందుకో పెళ్లి చేసుకుని బాధ్యతల చక్రంలో ఇరుక్కునే కంటే ఇలా బ్రహ్మచారిగా ఉండి ప్రజలకు సేవ చేస్తూ గడిపేయాలనిపించేది.

ఒకరోజు పొద్దున్న లేవగానే, ఇంటిముందు ఊరిలోని ప్రముఖులంతా వచ్చారు. నన్ను పూల మాలతో సన్మానించి ఆ రోజు దినపత్రికలో వచ్చిన వార్త చూపించారు. మా ఊరిని రాష్ట్రం లో ఈ సంవత్సరపు ఆదర్శగ్రామం గా ప్రకటించారు. అంతే కాదు, రాష్ట్ర ప్రభుత్వం నాకు ఉత్తమ గ్రామ సేవకుడు అవార్డు ఇచ్చారు. నాకు ముందుగా మా ఊరికి వచ్చిన ప్రశంస చూసి చాల సంతోషమనిపించింది. అలాగే, నాకొచ్చిన అవార్డు వలన నా జీవితానికి ఒక అర్ధం, సాఫల్యత లభించింది. నిజంగా, ఈ రోజు నా తల్లి తండ్రులు బ్రతికివుంటే ఇది చూసి ఎంత ఆనందపడేవారో అనిపించింది. ఆ రోజు ఊరంతా ఒక పండుగలా చేసుకొన్నాము. నన్ను అభినందిస్తూ రోజంతా ఫోన్లు వస్తూనే ఉన్నాయి.

నాకు ఆ అవార్డుని ప్రభుత్వం స్వాతంత్ర దినోత్సవం నాడు ప్రధానము చేసారు. అది అందుకోవడానికి హైదరాబాద్ వెళ్ళాను. నా ప్రాణ స్నేహితులు సూర్య, శ్రీరామ్, గిరీష్ అక్కడకి వచ్చారు.

అందరం కలిసి తిరగడం, పాత విషయాలు జ్ఞాపకం చేసుకోవడం, సరదా కబుర్లతో నాలుగు రోజులు ఎలా గడిచిపోయాయి తెలీలేదు. గవర్నర్ గారి దగ్గర నుండి అవార్డ్ తీసుకుని ఆ అవార్డుని మా ఊరి ప్రజలకి అంకితం ఇచ్చాను.

అక్కడున్న నాలుగు రోజులూ గిరీష్ వాళ్ళ పిన్ని కూతురు ఇంట్లో ఉన్నాము . గిరీష్ బావగారు కిరణ్ పెద్ద వ్యాపారస్తుడు హైదరాబాద్ లో. పెద్ద బంగ్లా లాంటి ఇల్లు, ఇంటి చుట్టూ మొక్కలు, ఇంటి నిండా పనివాళ్ళు ఉంటారు. ఇలాంటివారికి ఏమి కష్టాలు ఉంటాయి అన్నాడు సూర్య గిరీష్ తో. దానికి గిరీష్ "భగవంతుడు అందరికీ అన్నీ ఇవ్వడు. ఇన్ని సౌకర్యాలున్న ఇంట్లో దీపం పెట్టే ఇల్లాలే లేదు. అవును, నా పిన్ని కూతురు సంవత్సరం క్రితం చనిపోయింది ఇద్దరు పిల్లలని ఆయనకి వదిలేసి. మా బావగారు కిరణ్ ఆ విషాదం నుంచి ఈ రోజు వరకూ తేరుకోలేదు. మా అక్క లేని ఇంట్లో ఉండలేక వ్యాపారంలో ఇంకా ఇంకా మునిగిపోయి కేవలం పడుకోడానికి ఇంటికి వస్తున్నారు. అప్పటి నుండి ఇంటి వ్యవహారాలన్నీ ఆయన తల్లి అనసూయమ్మ గారు చూసుకుంటున్నారు. ఆవిడ చాల మంచి మనిషి. నన్ను చాల బాగా చూసుకుంటారు. అందుకే మా అక్క లేకపోయినా ఈ ఇంటికి వచ్చి ఉండగలుగుతున్నాను. అయితే , పిల్లలు ఇద్దరూ మాత్రం దాదాపు అనాథలు అయిపోయారు. లేక తల్లి ప్రేమకు, ఉండి తండ్రి ప్రేమకు దూరం అవుతున్నారు. వాళ్ళ బామ్మ ఎంత దగ్గరకు తీసినా దూరం వెళ్లిపోతున్నారు. వాళ్ళ ప్రవర్తన, చదువు విషయంలో కూడా మార్పు వస్తోంది. వాళ్ళ ఇల్లు సరిదిద్ది పిల్లలను దారిలో పెట్టే వారు ఎవరైన రావాలి . ఆ దేవుడే దారి చూపాలి. " అన్నాడు. మేమంతా ఇది విని చాల బాధ పడ్డాము. ఇంత మంచి వారికి ఇన్ని కష్టాలా ? దేవుడు కరుణించి తొందర్లో వీరి కష్టాలు తొలగించాలని ప్రార్థించాము.

ఆ తరువాత ఊరికి వెనక్కి వచ్చాక నాకు వచ్చిన అవార్డు పారితోషంకి నా డబ్బు మరికొంత కలిపి గ్రంధాలయం కడుదామనుకొన్నాను. దానికి బాబాయ్ ముందు ఉన్న రెండు గదులు నిరుపయోగంగా ఉన్నాయని వాటిని గ్రంధాలయంకి వాడుకోమని చెప్పారు.

నేను చాల సంతోషించి ఊర్లో మిగతావారితో కూడా సంప్రదించి బాబాయ్ ఇచ్చిన రెండు గదులలో కొన్ని మార్పులు చేశాను. అలాగే గ్రంధాలయానికి కావలిసిన సామాను (కుర్చీలు, టేబుళ్లు, అలమారాలు లాంటివి) కొని అందంగా తీర్చిదిద్దాను . ఇంక పుస్తకాల విషయానికొస్తే ఊర్లో చాల మంది పుస్తకాలు విరాళాలుగా ఇచ్చారు. మేము కొన్ని కొత్త పుస్తకాలు కూడా కలిపాము. ఈ గ్రంధాలయానికి ముఖ్య దాత అయిన బాబాయ్ పేరున 'ఆనంద గ్రంధాలయం" అనే పేరుపెట్టాము. దాన్ని బాబాయ్ చేతనే ఆయన పుట్టినరోజు నాడు ప్రారంభించాము . ఆ రోజు ఆయన సంతోషానికి అవధులు లేవు.

ఇలా చక్కగా సాగిపోతున్న సమయంలో ఒక పెద్ద దుర్ఘటన జరిగింది. బాబాయికి మళ్ళీ గుండెనెప్పి వచ్చింది. వెంటనే ఆసుప్రతికి తీసుకెళ్లినా ఈ సారి మాత్రం ఫలితం దక్కలేదు. ఆసుపత్రిలో చేర్పించిన మూడు గంటలలో కన్ను మూశారు. నా క్రింద నుంచి భూమి కదిలిపోయినట్టుగా, నేను కుప్ప కూలిపోతున్నట్టుగా అనిపించింది.

కాసేపు నోటి నుంచి మాట రాలేదు, దుఃఖం తప్ప. నా సొంత తండ్రి చనిపోయినప్పుడు కూడా ఇంత బాధ అనిపించలేదు. ఎలాగో తేరుకుని, పక్కన దుఃఖ సముద్రంలో మునిగిన పిన్ని కోసం నా బాధను దిగమింగుకొని ఓదార్చడం మొదలుపెట్టాను. మెల్లగా, మురళికి , ఆ తరువాత ఊర్లో వారికీ ఈ వార్త తెలియచేశాను. ఆ రోజు ఊరంతా కదిలి వచ్చింది బాబాయ్ ఇంటికి. ఇంక అక్కడనుంచి ఊర్లో వాళ్ళే అంతా చూసుకున్నారు. మురళి అతని కుటుంబంతో రెండో రోజు ఉదయానికి వచ్చాడు. అతన్ని చూడగానే అప్పటి వరకూ బలవంతాన ఆపుకున్న దుఃఖం బయటకు తన్నుకొచ్చింది. అన్నయ్యా అని బావురుమన్నాను. అతను నన్ను, పిన్నిని ఓదార్చాడు. ఆ రోజే బాబాయ్ అంత్యక్రియలు జరిగాయి. ఆ తరువాత జరగాల్సిన కార్యక్రమాలన్నీ మురళి ఏ లోటు లేకుండా శాస్త్రీయంగా జరిపించాడు.

అన్ని కార్యక్రమాలు అయిపోయాక , ఒక రోజు సాయంత్రం నన్ను, పిన్నిని కూర్చోబెట్టి మురళి "ఇలా జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు. నాన్న లేని జీవితం ఊహించుకోలేము.

అంత దూరంలో ఉన్నా ఆయన అభయ హస్తంతో చక్కగా బ్రతికాను. ఇప్పుడు ఆ హస్తం జరిగి పోయింది. నా జీవితమే మారిపోయింది. నిజానికి, ఆయనకు గత పదేళ్లుగా ఎటువంటి సేవ చేయకుండా, ఆయనతో గడపకుండా దూరంగా బ్రతికి ఎంతో కోల్పోయాను. నన్ను మరిపించేట్టుగా , నాకంటే కూడా బాగా నాన్నగారి ని గౌతమ్ చూసుకోగలిగాడు.. అది గౌతమ్ అదృష్టం. కానీ, ఈ తప్పు అమ్మ విషయం లో ఇక చెయ్యను. అమ్మని ఇంక నుంచి నా తోనే అమెరికాలో ఉంచుకుని చక్కగా చూసుకుంటాను. దాని వలన, కొంతైన నా బాధ తగ్గుతుంది. గౌతమ్, నువ్వు నిజంగా నా తమ్ముడువి. నిన్ను ఒంటరిగా ఇక్కడ ఉండనివ్వను. నువ్వు కూడా మాతో వచ్చేసేయి. అందరం కలసి అక్కడే హాయిగా బ్రతుకుదాం" అన్నాడు.

దానికి నేను ఏమీ అనకుండా ఉండిపోయాను. పిన్ని మాత్రం "నాకు ఈ ఊరు, ఇల్లు వదిలి పెట్టి రావాలని లేదు. అలాగని, నీ కోరికను కాదనలేను. ఎందుకంటే, నీవు చెప్పినది కూడా సమంజసంగా ఉంది. కానీ ఒక షరతు. గౌతమ్ రాకుండా నేను మాత్రం నీ దగ్గరికి రాను. ఎందుకంటే, నాకు ఉన్నదే ఇద్దరు కొడుకులు. ఏ ఒక్క కొడుకుని కూడా విడిచి ఉండలేను." అంది. ఆ మాట విన్నాక నా కళ్ళు చెమర్చాయి. నేను ఏమీ చెప్పలేక "సరే, అమ్మకి వీసా సిద్ధంగా ఉంది కాబట్టి, నీ వెంట ఇప్పుడు తీసుకెళ్ళు. నేను పాస్ పోర్ట్, వీసా వచ్చాక, ఇక్కడ పనులన్నీ ఒక దరికి తెచ్చి వస్తాను" అన్నాను. నా సమాధానము వాళ్లకి పూర్తిగా నచ్చకపోయినా, వేరే దారి లేక సరే అన్నారు. పొలాలన్నీ కౌలుకి ఇచ్చి వాటిని చూసుకొనే బాధ్యత సూరికి, ఇంటిని పూర్తి స్థాయి గ్రంధాలయముగా మార్చి దాని బాధ్యతని రాంబాబుకి అప్పచెపుదామని అనుకొన్నాము. ఇలా అన్ని విషయాలు మాట్లాడుకొన్నాక పిన్నిని తీసుకొని మురళీ వాళ్ళు అమెరికా వెళ్లిపోయారు.

వాళ్ళు వెళ్లి పోయాక ఇల్లంతా బోసి పోయినట్టయింది. పగలు ఇంటి పనులు, ఊరు పనులతో సమయం గడిచిపోయినా రాత్రయ్యేసరికి ఒంటరితనం, దిగులుగా ఉండేది. రోజూ రాత్రి మురళీ వాళ్ళు మాట్లాడేవాళ్ళు. అయినా, ఏదో తెలీని వెలితి ఉండేది.

ఇంక ఈ ఊర్లో ఉండాలని అనిపించడము లేదు. అలాగని, అమెరికా వెళ్లాలని కూడా లేదు. ఇంకా ఆలోచిస్తే, నాకెందుకో ఇక్కడకు నేను వచ్చిన పని అయిపోయిందనిపించింది. ఈ ఆలోచననే సత్య మూర్తి మాస్టారుతో పంచుకొన్నాను.

ఆయన "నీ ఆలోచనలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే, అది నీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తోంది. నీవు, ఎప్పుడూ కొత్తదనం , కొత్త వాతావరణం కోరుకుంటావు. నీ చుట్టూ ఉన్న ప్రపంచానికి ఏదయినా మేలు చేయాలనుకొంటావు. ఇది నీ లోని గొప్ప గుణం. నీవు ఈ ఊర్లో ఉన్నా , అమెరికాలో ఉన్నా నీలోని ఆ తపన తీరదు. ఒక్కసారి గతం లోకి చూసి, నీవు కొత్త జీవితంలోకి అడుగుపెట్టే అవకాశాలు ఏమైనా ఉన్నాయేమో వెతుకు " అన్నారు.

రాత్రంతా ఆయన చెప్పిన అవకాశాల కోసం ఆలోచిస్తే గిరీష్ వాళ్ళ బావగారి కుటుంబం, వారి పిల్లలను మంచి దారిలో పెట్టే మనిషి అవసరం గుర్తుకొచ్చాయి. అక్కడకి వెళ్లి కొంత కాలం ఉండి ఆ పిల్లలను చూసుకోవడమే తన ముందు ఉన్న గొప్ప అవకాశం లాగా అనిపించింది. మర్నాడు ఉదయమే గిరీష్ కి ఫోన్ చేసి నా ఆలోచనను పంచుకొన్నాను. వాడు చాల సంతోషించి, వాళ్ళ బావ గారితో మాట్లాడి నాతో "నీ రాకను ఆయన మనసారా ఆహ్వానిస్తున్నారు. పిల్లలు తన ముందే చేయిజారిపోతున్నా ఏమీ చేయలేని స్థితిలో ఉన్న ఆయనకి నీవు ఒక ఆశా దీపంగా కనిపిస్తున్నావు. తొందర్లో వాళ్ళింటికి వెళదాము." అన్నాడు. దాంతో నా నిర్ణయం మరింత బల పడింది. ఇక మిగిలిన పనల్లా మురళిని, పిన్నిని దీనికి ఒప్పించడం. ముందు వారు గట్టిగా నా ఆలోచనను తిరస్కరించినా, నా గట్టి ప్రయత్నం వలన రెండు రోజుల తరువాత ఒప్పుకున్నారు. ఆశ్చర్యంగా పిన్నే ముందు ఒప్పుకుంది "ఒక తల్లిగా నీ సంతోషాన్ని కోరుకొంటాను. నీ మనసు, వ్యక్తిత్వం తెలుసు కాబట్టి దీనికి నేను అంగీకరిస్తున్నాను. నీకు ఎక్కడ ఉంటే బాగుంటుందో అక్కడే ఉండు. కానీ ఈ తల్లిని మర్చిపోకుండా రోజూ మాట్లాడుతుండు." అంది. మురళి కూడా అయిష్టంగానే అంగీకరిస్తూ "నీవు ఎప్పుడూ సంతోషంగా, పది మందికి మేలు చేస్తూ గొప్పగా బ్రతకాలి.

మా తమ్ముడి ప్రగతిని చూసి మేము గర్వపడాలి. కానీ, నీకు ఎప్పుడు ఎటువంటి అవసరం ఉన్నా ఈ అన్నయ్య ఉన్నాడని మరిచిపోవద్దు." అన్నాడు. వారి అంగీకారంతో నాకు కొండంత బలం వచ్చింది. ఇంక ఊర్లో వారిని

ఒప్పించడం పెద్ద కష్టం కాలేదు. అందరూ ముందు బాధ పడినా , నా ఆలోచనను అభినందించారు. కానీ, ఈ ఊరికి మాత్రం నెలకొకసారైనా రావాలని మాట తీసుకొన్నారు. ఇంక చక చకా మిగతా పనులు పూర్తి చేయడం మొదలు పెట్టాను. ముందుగా అనుకున్నట్టుగా, పొలం, ఇంటి బాధ్యతలని సూరి, రాంబాబులకి అప్పచెప్పాను. అన్నిపనులూ పూర్తి చేసుకొని రెండు వారాల తరువాత హైదరాబాద్ కి బయలు దేరాను. నేను వచ్చే రోజు ముందు ఒక పెద్ద సభ పెట్టి నాకు ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. నాకు ఖరీదయిన చేతి వాచీ బహుమతిగా, వాళ్ళ గుర్తుగా యిచ్చారు. అది వాళ్ళ ముందరే పెట్టుకొన్నాను సంతోషంగా. అలా పన్నెండు సంవత్సరాల తరువాత గ్రామవాసం, వ్యవసాయ పర్వం ముగించుకొని పట్టణ జీవితం వైపు నా తదుపరి ప్రయాణం మొదలయ్యింది .

రైల్వే స్టేషన్ కి గిరీష్, వాళ్ళ బావ కారు తీసుకుని వచ్చాడు. వాడు నిన్న పొద్దున్నే ఇక్కడకి వచ్చాడట. ఇల్లు చేరిన నాకు సాదరమైన ఆహ్వానం లభించింది. గిరీష్ ఉండే రూంలోనే నా సామాను పెట్టించారు. నేను తయారయి వచ్చేటప్పటికి పిల్లలు స్కూల్ కి వెళ్లిపోయారు. వాళ్ళ బావ కిరణ్ , అత్తయ్యతో కలసి మాట్లాడుతూ టిఫిన్ చేశాను. మొదట్లో వాళ్ళని ఎలా సంబోధించాలా అని ఆలోచిస్తుండగా కిరణ్ "మాకు గిరీష్ ఎంతో నువ్వు అంతే . మమ్మల్ని వాడు పిలిచినట్టే బావ, అత్తయ్య అని పిలువు." అన్నారు. ఆ తరువాత ఆఫీస్ కి వెళ్తూ కిరణ్ నాతో "గిరీష్ నీకు అన్నీ చెప్పాడు కదా. నా పిల్లలు అజయ్, అఖిల లను నీ చేతిలో పెడుతున్నాను. వాళ్ళని మంచి మనుషులుగా, ప్రయోజకులుగా చూడాలనేదే చనిపోయిన నా భార్య కల. నా భార్య లేకుండా ఈ కలను నేను ఒక్కడినే సాకారం చేయగలననే నమ్మకం పూర్తిగా పోయింది. వాళ్ళకి కావాల్సినవన్నీ అమర్చగలను కానీ, నా వ్యాపారం, మానసిక స్థితి వలన వారికి కావలిసినంత సమయం కేటాయించలేక పోతున్నాను.

గిరీష్ చెప్పిన దాని బట్టి, రెండు నెలల క్రితం నువ్వు మా ఇంటికి వచ్చినపుడు చూసిన దానిని బట్టి ఒక మాట ఖచ్చితంగా చెప్పగలను. నాకు నీ వలన వారు బాగుపడతారా అనే మీమాంస కంటే నీ వలనే వారు బాగుపడతారన్న నమ్మకం ఎక్కువ. నీ ప్రయత్నంలో నీవు వారితో ఎలా ప్రవర్తించినా నేను, కానీ, అమ్మ కానీ అడ్డుచెప్పము. " అన్నారు. అందుకు నేను "బావ, నా మీద మీరు పెట్టిన నమ్మకానికి చాల కృతజ్ఞతలు. మీ నమ్మకం నిలపెట్టడానికి నా శాయ శక్తులా ప్రయత్నిస్తాను. " అని అన్నాను.

ఆ తరువాత అనసూయమ్మ గారు కూడా చాల సేపు మాట్లాడారు గడిచిపోయిన గతం గురించి, జరుగుతున్న సంగతులు గురించి. నేను కూడా అవన్నీ ఆసక్తిగా వింటూ, మధ్య మధ్య కొన్ని ప్రశ్నలు వేసాను వివరాల కోసం. ఆవిడ చాల మంచి వారని, ఆవిడ దగ్గర నేర్చుకొనే విషయాలు ఎన్నో ఉన్నాయని పించింది. ఇంతలో పిల్లలు స్కూల్ నుంచి వచ్చారు. వారిని నేను, గిరీష్ సాయంత్రం సరదాగా బయటకి తిప్పి తీసుకొచ్చాము. చాల రోజులు

తరువాత బయటకు రావడం తో వాళ్ళు కూడా బాగా ఆనందించారు . వారిద్దరూ కూడా నన్ను గిరీష్ ని పిలిచినట్టుగా మామయ్య అని పిలుస్తుంటే చాల సంతోషంగా అనిపించింది. ఆ తరువాత రెండు రోజులు గిరీష్ ఉండి వెనక్కి వెళ్ళిపోయాడు. వాడు వచ్చిన ఉద్దేశ్యం నన్ను వాళ్ళకి పరిచయం చేసి దగ్గరకి చేయడమే. అది పూర్తిగా సాధించాడు. వెళ్లేముందర నాతో "ఇక్కడ నీకు ఎప్పుడు బాగా లేక పోయినా, ఉండాలని లేక పోయినా నాతో చెప్పు. అలాగే, ప్రస్తుత పరిస్థితుల వలన వీళ్ళు ఏదయినా నీకు ఇబ్బంది, బాధ కలిగించేట్టు ప్రవర్తించినా నాకు చెప్పు" అన్నాడు. అందుకు నేను 'ఎప్పుడైతే నన్ను వాళ్ళు మామయ్య అన్నారో, నేను వారిని బావ, అత్తయ్య అని పిలవడం మొదలుపెట్టానో అప్పుడే వారు నా వారు అయిపోయారు. వాళ్ళ సమస్యలే నా సమస్యలు. అన్నీ చక్కదిద్దుతాను. నీవు నిశ్చింతగా వెళ్ళు " అన్నాను. ఆ మాటలకు వాడు తృప్తిగా వెళ్ళిపోయాడు. అప్పటినుండి నా ప్రయత్నాలు, ఈ కుటుంబం తో అనుబంధం మొదలయ్యింది.

ముందుగా నేను చేసిన పని ఆ ఇంటి దినవారి కార్యక్రమం పరిశీలన. ఆ తరువాత , పిల్లల అలవాట్లు, ప్రవర్తనని గమనించాను రెండు, మూడు రోజుల పాటు. వీరందరూ చెప్పినంతగా పిల్లలు చెడిపోలేదు. కానీ, ఇదే అలవాట్లు కొనసాగిస్తే మాత్రం ఆ ప్రమాదం ఉంది. అజయ్ పదవ తరగతి, అఖిల ఎనిమిదవ తరగతికి వచ్చారు. స్కూల్ నుంచి రాగానే టీవీ ముందు కూర్చుంటారు. రాత్రి పడుకునే వరకూ అక్కడే చదువు, తిండి, కబుర్లు. దీని వలన వాళ్ళు టీవీకి బానిస అవడమే కాకుండా, చదువు మీద ధ్యాస తగ్గి పోతోంది. అందరూ పాపం, తల్లి లేని పిల్లలని ఏమీ అనరు. ఎప్పుడైనా వాళ్ళ బామ్మ ఏదయినా చెప్పాలని చూస్తే ఆవిడ మాట పట్టించుకోకపోవడం, ఎదురు విసుక్కోవడం లాంటివి చేస్తారు. తండ్రి భయం ఉన్నా ఆయన రోజూ బాగా రాత్రి అయ్యాక రావడం

, అప్పటికి వీళ్ళు నిద్ర పోవడంతో ఆ దారి కూడా మూసుకుపోయింది. బాగా ఆలోచించాకా వీళ్ళకి ముందు దగ్గర అవ్వాలి వారికి నచ్చే విధంగా అనుకొన్నాను. అందుకని, వాళ్లతో పాటు టీవీ చూడడం, చూసేటప్పుడు ఆ కార్యక్రమాల గురించి వారితో మాట్లాడడం, వారిని నవ్వించడం లాంటివి చేసేవాడిని.

అలా చెప్పేటప్పుడు వాళ్లకి స్ఫూర్తిదాయకమైన విషయాలు, మనుషులు గురించి చెప్పేవాడిని. వాటిని కథలుగా, ఆసక్తిగా చెప్పడంతో వారి మనసుకు హత్తు కోవడమే కాక వారిలో విద్య విషయంలో ఒక ఆశయం ఏర్పడింది. దానిని నిజం చేయడానికి ఏమి చదవాలి, ఎక్కడ చదవాలి, ఎలా చదవాలి లాంటి విషయాలు కూడా చెప్పేవాడిని. వారిలో అజయ్ కి పెద్ద ఇంజినీర్ అయ్యి వాళ్ళ నాన్న వ్యాపారంలో సహాయపడాలి అనుకునేవాడు. అఖిల కి డాక్టర్ చదువుకొని అందరికి సేవ చేయాలనీ కోరిక. ఇలాంటివన్నీ మాట్లాడుకోవడం వల్ల వాళ్ళిద్దరికీ చదువు మీద మరింత ఆసక్తి పెరిగింది.ఆ కార్యక్రమం అయ్యాక కూడా దాని గురించి నాకు

తెలిసిన మరిన్ని కబుర్లు వాళ్ళకి ఆసక్తి కలిగించేలా చెప్పేవాడిని. అలాంటప్పుడు, వాళ్ళు టీవీ మీద నుంచి ధ్యాస మళ్లించడం కానీ, ఒక్కోసారి టీవీ ఆపేయడం కానీ చేసేవారు.

అది అదనుగా తీసుకొన్న నేను చెప్తున్న దానికి కొత్త విషయాలు జోడించే వాడిని. వాటిల్లో పౌరాణికం, జానపదం, ప్రపంచ చరిత్ర, భూగోళ విశేషాలు ఉండేవి. వాళ్ళుకూడా శ్రద్దగా వినడమే కాకుండా , మధ్య మధ్యలో ప్రశ్నలు వేసేవారు. అలా కబుర్లు చెప్పుకుంటూ వాళ్లతో భోజనం చేసేవాడిని. అత్తయ్య ఈ మార్పుని గమనిస్తూ ఉండేవారు. అలా కొంతకాలనికి పిల్లలు బడి నుంచి రాగానే మామయ్య ఏడి అని అడిగేవారు.

ఒక రోజు వాళ్ళు బడి నుంచి వచ్చేటప్పటికి బాడ్మింటన్ కోర్ట్ సిద్ధం చేశాను. ముందు శ్రద్ధ చూపక పోయినా నేను "మీకు నేను ఈ ఆట నేర్పిస్తాను. కాసేపు ఆడిచూడండి. నచ్చకపోతే రేపట్నుండి మానేద్దాము" అనడంతో ఆట మొదలు పెట్టారు. కాసేపు ఆడేసరికి మంచి ఆసక్తి వచ్చింది ఇద్దరికీ. ఆ మర్నాడు వాళ్ళే "మామయ్య, బాడ్మింటన్ ఆడదామా" అన్నారు. అలా కాసేపు ఆట , తరువాత కబుర్లతో ఆ రోజు టీవీ దగ్గరికి అసలు వెళ్ళలేదు. నేను కూడా గుర్తు చేయలేదు. ఆ మర్నాడు, క్యారమ్ బోర్డు తెచ్చాను. అది చూడగానే, ఇద్దరు "ఎన్నాళ్ళయిందో క్యారమ్స్ ఆడి. అమ్మ, బామ్మా మేము ఆడేవాళ్ళము. ఇవాళ అమ్మ జాగాలో నువ్వు ఆడు మామయ్య" అన్నారు. అంతే కాదు అత్తయ్యను కూడా బలవంతంగా తీసుకొచ్చి ఆడించారు. చివరలో అమాయకంగా "మామయ్య నువ్వు ఎప్పటికి ఇక్కడే ఉంటావా, చక్కగా రోజు ఆడుకోవచ్చు మనం అంతా " అన్నారు. నాకు వాళ్ళ అమాయకత్వం, ఆప్యాయత చూసి చాల ముచ్చట వేసి "తప్పకుండ ఉంటాను, కాని నాదో షరతు. నాతో పాటు ఆటలు, కబుర్లే కాదు, చదువు కుంటామంటేనే " అన్నాను. దానికి, వాళ్లిద్దరూ వెంటనే ఒప్పుకొన్నారు. నాకెందుకో మొదటి విజయం సాధించాననిపించింది. ఆ మర్నాడు నుంచి ఒక టైం టేబుల్ తయారు చేసాము. అందులో కాసేపు, ఆటలు, కాసేపు కబుర్లు, కాసేపు చదువు ఉన్నాయి. అలా వాళ్ళ సాయంత్రపు సమయం చక్కగా గడపడం మొదలయ్యింది. వాళ్ళకి హోమ్ వర్కులో సహాయపడడం , నాకు తెలిసిన చిట్కాలు, సూచనలు చెప్పేవాడిని.

కేవలం స్కూల్ హోంవర్కు తో ఆగకుండా, మిగతా పాఠాలు కూడా చదివేవారు. వారిని ప్రతిదీ అర్థం చేసుకుంటూ చదివేటట్టుగా ప్రశ్నలు వేస్తూ అలవాటు చేశాను.

అలాగే, పొద్దునే లేచి చదవడం కూడా అలవాటు చేశాను. ఇదంతా సాధించడానికి దాదాపు ఆరు నెలలు పట్టింది. మొత్తము చదవడమే కాకుండా మా ఆటలు, కబుర్లు కూడా రోజు కొన సాగేవి. అలాగే, ఆదివారం వాళ్ళని బయటకి తీసుకువెళ్ళేవాడిని. ఒక వారం సర్కస్ కి, ఒక వారం మేజిక్ షోకి , ఒక వారం సినిమాకి ఇలా

ఎన్నో ప్రదేశాలకి వెళ్ళాము. పరీక్షలప్పుడు వాళ్లతో పాటు నేనూ మెలుకువగా ఉండి వాళ్ళకి కావలిసినవి చూసుకొనేవాడిని. ఆ సమయంలో వారిని స్కూలు లో దింపి, పరీక్ష అయ్యేదాకా ఉండి , ఇంటికి తిరిగి తీసుకొచ్చేవాడిని. ఇలా తెలీకుండానే మా మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. వాళ్ళు నా గదిలోనే పడుకొనే వారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే పెద్ద పరీక్షలు ఒక ఎత్తు. ఆ సమయంలో వారికి కావలిసినవన్నీ చూసుకుంటూ , సమయానికి భోజనం, నిద్ర పోయేట్టు చూసేవాడిని. వాళ్ళకి పరిక్ష ఒత్తిడి తెలీకుండా కబుర్లు చెప్తూ, నవ్విస్తూ ఉండేవాడిని. ఇవన్నీ దగ్గరగా చూస్తున్న అత్తయ్య, బావ చాలా ఆనందపడే వాళ్ళు. నా కిచ్చిన మాట ప్రకారం ఏ రోజు నేను చేసే పనులకి అడ్డు వచ్చేవాళ్ళు కాదు. పిల్లలలో వస్తున్న మార్పు వాళ్ళకి స్పష్టంగా కనిపించేది. పరిక్ష ఫలితాలు వచ్చిన రోజు మా అందరి ఆనందానికి అవధులు లేవు. ఎందుకంటే ఇద్దరూ మంచి మార్కులు తెచ్చుకొని మొదటి మూడు ర్యాంకుల్లో ఉన్నారు. ఆ రోజు నా కోరిక మీద బావ ఇంట్లోనే ఉన్నారు. అందరం కలసి గుడికి, అక్కడి నుండి హోటల్ కి వెళ్ళాము. సాయంత్రం ఇంటి కొచ్చాక మాతో పాటు బ్యాడ్మింటన్ ఆడారు. ఆయన అలా గడపడం పిల్లలకి చాల సంతోషాన్నిచ్చింది. అజయ్ ని మంచి కాలేజీలో చేర్పించాము. దాంతో పాటు ఇంజినీరింగ్ కోసం కోచింగ్ కూడా మొదలు పెట్టాము. ఇలా చూస్తుండగానే నేను ఇక్కడికి వచ్చి సంవత్సరం అయిపోయింది మధ్యలో గిరీష్ రెండు సార్లు వచ్చి వెళ్ళాడు. నేను వీళ్ళతో కలసిపోయిన తీరు చూసి చాల ఆనంద పడ్డాడు.

ఈ సంవత్సర కాలంలో నేను ఎక్కువగా పిల్లలతోనే గడపడంతో బావ, అత్తయ్యతో ఎక్కువ బంధం ఏర్పడలేదు. బావ పొద్దున్నే బయటకు వెళ్తే రాత్రి వరకూ ఇంటికి రాడు.

అత్తయ్య పని వాళ్లతో పని చేయిస్తూ, పూజలు, ధ్యానం తో ఎక్కువ సేపు గడిపేది. స్వతహాగా ఆవిడ మాట్లాడడం కూడా తక్కువే. కానీ, నాకు ఏ లోటు రాకుండా చాల బాగా చూసుకునేవారు. అయితే, ఈ మధ్య పిల్లలు స్కూలు, ట్యూషన్ల వలన ఎక్కువసేపు బయట ఉండడంతో నాకు అత్తయ్య తో మాట్లాడే సమయం కాస్త దొరికేది. సాధారణంగా మధ్యాహ్నం భోజనము చేసిన తరువాత దాదాపు గంట సేపు మాట్లాడుకొనేవాళ్ళం. ఆవిడ మాటలలో వేదాంత ధోరణి ఎక్కువగా ఉండేది. జీవితం యొక్క పరమార్ధం, పురాణాలలోని సారాంశం లాంటివి వివరంగా చక్కటి ఉదాహరణలతో చెప్పేవారు. నాకు ఇలాంటి విషయాలలో పరిజ్ఞానం లేకపోవడంతో శ్రద్ధగా వినడమే కాకుండా, ప్రశ్నలు వేస్తూ ఉండేవాడిని. ఆవిడా ఎంతో సహనంగా నేను అడిగిన ప్రశ్నలన్నిటికి జవాబు లిచ్చేవారు. కొన్ని ప్రశ్నలకి వెంటనే సమాధానం చెప్పకపోయినా పుస్తకం చూసి, ఆలోచించి మర్నాడు జవాబు చెప్పేవారు. ఇన్నాళ్లు నేను బ్రతికిన జీవితానికి అత్తయ్య చెప్పే జీవితం ఎంతో దూరం.

అలా నాకు తెలియకుండానే వేదాంతం వైపు దృష్టి మళ్లింది. నేను కూడా ఆవిడ దగ్గరున్న వేదాంత పుస్తకాలు చదవటం మొదలు పెట్టాను. చదవటమే కాకుండా, నేను వాటిలోంచి గ్రహించింది ఆవిడ తో చర్చించేవాడిని. అలా మా ఇద్దరి మధ్య బంధం పెరగడం మొదలయింది. రోజు మధ్యాహ్నం దాదాపు పిల్లలు వచ్చే వరకూ , పుస్తక పఠనం, వాటిలోని విశేషాల పైన చర్చలు సాగేవి.. ఇంతే కాక పొద్దున్న ఆవిడ పూజ అయ్యాక, కాసేపు ధ్యానం కూడా చేసే వాళ్ళము. ఇలా సంవత్సరాలు గడిచిపోయాయి. ఆవిడ ఒక స్వామీజీ బోధనలు వినడం, వారిని పూజించడం జరిగేది. ఆ స్వామీజీ ఆశ్రమం కి అత్తయ్య ప్రతి సంవత్సరం వేసవి కాలంలో వెళ్లేవారు. నన్ను తీసుకువెళదామని ప్రయత్నించారు కానీ, పిల్లల పరీక్షల వలన అది కుదరలేదు. నా కెందుకో ఆవిడలాగా బ్రతకాలి కొన్నాళ్ల తరువాత అనిపించేది.

ఈ మధ్యలో అజయ్ ఇంటర్మీడియట్ పూర్తి చేయడం, మంచి ఇంజినీరింగ్ కాలేజీలో సీట్ తెచ్చుకోవడం జరిగింది. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకి చాల కష్టపడి చదివాడు. అయినా నాతో ఒక గంటయినా గడిపేవాడు కబుర్లు, ఆటలతో.

నేను కూడా అతన్ని ఉత్సాహపరుస్తూ మాట్లాడేవాడిని. చివరకి అతని కష్టం ఫలించింది. ఆ విజయాన్ని అందరం ఒక వేడుకగా చేసుకొన్నాము. బావ ఇంట్లో పని వాళ్లందరికీ బట్టలు కొనుక్కోమని డబ్బులు ఇచ్చాడు. అత్తయ్య కూడా వాళ్ళందరికీ స్వీట్లు పంచింది. ఆ తరువాత అజయ్ చదివిన కాలేజీలోనే అఖిలకి కూడా సీట్ వచ్చింది. తాను కూడా అజయ్ చదివిన కోచింగ్ సెంటర్ లో ఎం.బి.బి.ఎస్ ప్రవేశ పరీక్ష కోసం చేరింది.

వీరిద్దరూ కాలేజీకి వచ్చేయడం , సొంతంగా చదువుకోవడం మొదలు అయ్యాక, నాకు మరింత తీరిక సమయం దొరికేది. ఒక రోజు బావ ఆఫీస్ కెళ్ళాక నాకు ఫోన్ చేసి ఇంటి దగ్గర నుంచి కొన్ని ముఖ్యమైన పేపర్లు తెచ్చుకోవడం మర్చిపోయానని, నన్ను వాటిని ఆఫీసుకి తీసుకురమ్మని అడిగారు. వాటిని తీసుకొని నేను ఆఫీస్ కి వెళ్ళాను. అదే మొదటి సారి అక్కడకు వెళ్లడం. చాలా అందంగా తీర్చి దిద్దారు.

నేను వెళ్లేసరికి బావ గదిలో ఇంకొక ఇద్దరు మనుషులు ఉన్నారు. పేపర్లు ఇచ్చి బయటకు రాబోతుంటే బావ నన్ను కూడా అక్కడే ఉండమన్నారు. వారి మాటలను బట్టి నాకు వచ్చిన వాళ్ళు భూగర్భ శాస్త్ర నిపుణులు , బావ కట్టబోయే కొత్త భవన సముదాయం గురించి వచ్చారని తెలిసింది. ఢిల్లీలో నేను చేసిన ఉద్యోగం ఇదే. దాంతో, వాళ్ళ మాటలలో నిమగ్నమవడమే కాక , తెలియకుండానే నేను వాడిన ఆధునిక పరికరాల గురించి మాట్లాడ్డం మొదలు పెట్టాను. వాళ్ళు "దాని గురించి మేము విన్నాము. కానీ వాటిని ఇప్పుడు తెప్పించడం ఎలా, వాడడం తెలిసిన వారు కూడా లేరు కదా" అన్నారు. అప్పుడు నేను వాటిపై చేసిన పరిశోధన, వాడిన

తీరు చెప్పాను. అంతే కాక ఇప్పుడు వాటిని అవసరమైతే తెప్పించి వాడగలనని చెప్పాను. వెంటనే వారు బావతో "మీ ఇంట్లోనే ఇంత అనుభవజ్ఞుడిని ఉంచుకొని ఊరంతా వెతుకుతున్నారు" అన్నారు. నాతో "అవి తెప్పించి వాడేటప్పుడు మమ్మల్ని పిలవండి. మేము నేర్చుకొంటాం" అన్నారు.

వాళ్ళు వెళ్లి పోయాక బావ నాతో "ఇంత కాలం , నువ్వు ఇంజనీరింగ్ చేసి ఏదో ఉద్యోగం కొంత కాలం చేసావనుకొన్నా కానీ, మేము ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న దానిలో నీవు ఇంత గొప్ప నిపుణుడివని అనుకోనేలేదు. కాస్త ఈ సహాయం చేస్తే చాల సంతోషిస్తాను" అన్నారు. నేను వెంటనే, ఢిల్లీ ఆఫీస్ కి ఫోన్ చేసి ఆ పరికరాలని తెప్పించాను. అవి వచ్చాక బావ వెంట తాను కొత్తగా కొనుగోలు చేయపోయే స్థలం కి వెళ్లి పరీక్షలు చేసి అక్కడ నీటి పరిస్థితి గురించి చెప్పాను. నిజానికి అక్కడ నీటి పరిస్థితి అంత బాగా లేదు. ఆ మాట విన్న బావ ఇంకో రెండు, మూడు స్థలాల దగ్గరికి కూడా తీసుకెళ్లారు. వాటిలో ఒక్క స్థలం మాత్రం నీటి విషయంలో బాగుంది. వెనక్కి వచ్చేటపుడు బావ "గౌతమ్, ఈ రోజు నా వ్యాపారానికి నీవు ఎంతో మేలు చేసావు. ఇలాంటి సలహా, సహాయం లేక నేను కొన్ని లక్షలు కోల్పోయాను ఇంతకు ముందు. నీవు, నా పిల్లలకే కాదు, నాకు కూడా మార్గదర్శకుడిగా ఉన్నావు ఈ విషయంలో. నీకు అభ్యంతరం లేకపోతే మా ఆఫీసుకి రోజు వస్తావా " అన్నారు.

అందుకు నేను "బావ, మీ వ్యాపారాభివృద్ధికి నేను ఉపయోగ పడతానంటే తప్పక వస్తాను. కానీ, ఒక చిన్న అభ్యర్ధన. కేవలం పొద్దున్న మాత్రమే ఇక్కడకు వస్తాను. ఎందుకంటే, మధ్యాహ్నం అత్తయ్యతో, సాయంత్రం పిల్లలతో గడపడం నాకు చాల సంతోషాన్నిస్తుంది. అది మాత్రం ఒదులుకోలేను" అన్నాను. దానికి ఆయన వెంటనే ఒప్పుకొని "నీవు మా కుటుంబ సభ్యుడివే. నీ ఇష్టాన్ని కాదనను. రేపటి నుండి నాతో ఆఫీస్ కి వద్దువుగాని" అన్నారు.

ఆ మర్నాడే అత్తయ్య ఆశీస్సులు తీసుకుని బావ ఆఫీసులో చేరాను. బావ భూగర్భ శాఖ అని ఒక విభాగాన్ని మొదలుపెట్టి దానికి నన్ను అధిపతిగా నియమించారు. నాకు ఈ అంశం పై ఆసక్తి ఉన్న ఇద్దరు ఇంజినీర్లని ఇచ్చారు. వారికి శిక్షణ ఇస్తూ బావ వ్యాపారానికి సంభందించిన నీటి వనరుల పనులన్నీ చూసుకోవడం మొదలు పెట్టాను. ఇది తెలిసి నగరంలోని మిగతా భవన నిర్మాణ సంస్థలు మమ్మల్ని వారికీ సేవ అందించమని అడిగాయి. సేవకు తగ్గ డబ్బు కూడా ఇవ్వడానికి సిద్ధం అయ్యాయి. ఎందుకంటే, మేము చేసే సహాయం వలన వారికి చాల ఖర్చు, సమయం కూడా ఆదా అవుతుంది.

ఇదంతా చూసి బావ, నా శాఖని ఇంకొక వ్యాపార సంస్థగా మార్చి , వాటి బాధ్యతని నాకు అప్పచెప్పారు. వీరందరికి సేవలు అందించడానికి నేను ఇంకొంత మంది ఇంజినీర్లని నియమించుకొని వారికీ శిక్షణ ఇచ్చాను. బావ వ్యాపారంలో మెళుకువలన్నీ నేర్పేవారు. మెల్లగా చుట్టుపక్కల ఊర్ల భవన నిర్మాణ సంస్థలు కూడా మా దగ్గరికి సలహా కోసం రావడం మొదలు పెట్టారు. అలా వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. వీటన్నిటివలన నాకు వ్యాపారంలో మంచి అనుభవం వచ్చింది

కానీ ఈ అభివృద్ధితో పాటు నేను పిల్లలతో , అత్తయ్య తో రోజు గడిపే సమయం తగ్గిపోయింది. అయితే, పిల్లలు పెద్దవుతున్న కొద్దీ వాళ్ళకి మిగతా వ్యాపకాలు పెరగడం, అత్తయ్య నన్ను అర్థం చేసుకోవడంతో అంత ఇబ్బందిగా ఉండేది కాదు. ఈ మధ్యలో కొన్ని మంచి సంఘటనలు కూడా జరిగాయి. అందులో మొదటిది అఖిల కి మెడిసిన్ లో సీట్ రావడం. చాల కష్టపడి తన కలని నిజం చేసుకొంది. ఆ రోజు అత్తయ్య, బావ సంతోషానికి అవధులు లేవు. నాతో "నీవు మా ఇంట్లో అడుగు పెట్టినప్పటినుండి ఎంతో మంచి జరిగింది.

పెడ దారిన పడుతున్న పిల్లలు మంచి దారిలోకి వచ్చి ఇంత ప్రయోజకులయ్యారు. మా వ్యాపారం అభివృద్ధి చెందుతోంది. ఇంటి ఇల్లాలు పోయిన బాధలోంచి మమ్మల్ని బయటకు తీసుకువచ్చావు. నీకు ఎలా కృతజ్ఞతలు తెలపాలో అర్థం కావట్లేదు" అన్నారు. నేను దానికి "ఎప్పుడైతే మీరు నన్ను మీ కుటుంబంలో చేర్చుకున్నారో, నాకు బావ, అత్తయ్య, మేనల్లుడు, మేనకోడలు లభించారో , అప్పటినుంచి నేనే మీకందరికి రుణ పడి ఉన్నాను. మీరు ఇప్పుడు కృతజ్ఞతలు చెప్పి నన్ను పరాయివాడుగా చూడద్దు." అన్నాను.

ఇంక రెండో విషయం ఏమిటంటే ఒక రోజు బావ ఆఫీసులో నేను ఉన్నపుడు బయట రిసెప్షన్ లో స్వాతి ని చూసాను. వెంటనే బయటకు వెళ్లి తనను పలకరించాను. తాను ఆశ్చర్యపోయింది ఇక్కడ నన్ను చూసి. వాళ్ళ ఆయన, పిల్లలు కూడా వచ్చారు. వారిని పరిచయం చేసింది.

వాళ్ళు మా బావ కట్టబోయే కొత్త అపార్టుమెంటు లో ఇల్లు కొనడానికి వచ్చారు. వాళ్ళని మా బావకి పరిచయం చేసి ఇంటి వివరాలన్నీ చెప్పాము. ఆ తరువాత రెండు, మూడు సార్లు వచ్చి చివరకు ఫ్లాట్ బుక్ చేసుకొన్నారు. మా బావ కూడా వాళ్ళకి మంచి ధరకి అమ్మాడు. అలా, స్వాతి వాళ్ళ ఆయనతో కూడా మంచి పరిచయం ఏర్పడింది. ఆయన బలవంతం వలన వాళ్ళింటికి కూడా ఒక రోజు వెళ్ళాను. స్వాతి వాళ్ళ తల్లి తండ్రులని కూడా అక్కడ కలుసుకొని చాలా సేపు గడిపాను. నాకు చాల తృప్తిగా అనిపించింది ఆ రోజు స్వాతి కుటుంబాన్ని చూసి.

ఇంకొక మంచి మార్పు ఏమిటంటే బావ మళ్ళీ ఒకప్పటి కిరణ్ లాగా మారడం. నేను రోజు ఆఫీస్ కి బావ తో వెళ్ళేటప్పుడు సరదా కబుర్లు చెప్పడం, నవ్వించడం చేసేవాడిని నా పరిధిలో నేనుంటునే. మెల్లగా నన్ను ఒక

మంచి స్నేహితుడిగా చూడడం మొదలు పెట్టాడు. సాయంత్రాలు బావ తొందరగా ఇంటికి వచ్చినప్పుడు పిల్లలు, మేము ఆయనతో కలసి ఏదయినా ఆటలు ఆడేవాళ్ళము. కబుర్లు చెప్పుకుంటూ కలిసి భోజనం చేసేవాళ్ళము. నేను పిల్లలని సాధ్యమైంతవరకు బావతో కలపడం, వారిని దగ్గరికి చేసే ప్రయత్నాలు చేసేవాడిని. భగవంతుని దయ వలన నా ప్రయత్నాలు ఫలించి బావ పిల్లలకి మళ్ళీ దగ్గర అయ్యాడు. దాదాపు రోజు తొందరగా ఇంటికి వచ్చి వాళ్లతో ఆప్యాయంగా ఉండేవాడు. వాళ్ళు కూడా ఆయనకి మునుపటి లాగా బాగా దగ్గరయ్యారు. అక్కని పూర్తిగా మర్చిపోలేకపోయినా, పిల్లల సాంగత్యంలో మళ్ళీ ఒకప్పటి కిరణ్ లాగా అయ్యాడు.

ఇంకో ఆనందకరమైన సంఘటన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వారు, మా సంస్థ సాధించిన ప్రగతికి, సమాజానికి ఉపయోగపడే జల వనరుల పెంపుకి గుర్తింపుగా ఉత్తమ వ్యాపార సంస్థ అవార్డు ఇచ్చారు. దానితో పాటు నాకు కూడా "ఉత్తమ వ్యాపార వేత్త" అవార్డు వచ్చింది.. ఆ అవార్డు వచ్చిన రోజు దిన పత్రికలలో నా ఫోటో, ఈ వార్త వచ్చాయి. అది చూసిన నా ఆప్త మిత్రులు గిరీష్, శ్రీరామ్, సూర్య, ఊర్లో మిత్రులు గిరి, రాంబాబు, సూరి , స్వాతి, మురళి, రాజారావు గారు, సత్యమూర్తి మాస్టారు ఫోన్ చేసి అభినందించారు.

సత్యమూర్తి మాస్టారు " గౌతమ్, నువ్వు ఉద్యోగం, వ్యవసాయం, వ్యాపారం ఇలా అనేక రంగాలలో పనిచేసి విజయం సాధించావు. ఒక మనిషి ఇన్ని రంగాలలో రాణించడం చాల గొప్ప. నువ్వు ఒకప్పుడు నా శిష్యుడివి అని చెప్పుకోవడం నాకు గర్వంగా ఉంటుంది." అన్నారు. నేను ఆయనతో "మీ అభినందనలు నాకు కొండంత బలాన్ని ఇచ్చాయి. కానీ నాకు ఇంతకంటే సంతోషమైనది ఎవరూ లేని నేను మంచి మిత్రులని, తండ్రి లాంటి గురువుని, పిన్ని, బాబాయ్, అన్నయ్య, బావ, అత్తయ్య, మేనల్లుడు, మేన కోడలు ని సంపాదించుకొన్నాను గత ముప్పయి ఏళ్ళలో . అలాగే సమాజానికి సేవ చేయగలిగాను. ఇంత కంటే ఇంకేం కావాలి నాకు" అన్నాను.

ఒక్కసారి గతం ఆలోచిస్తే, నేను ఈ ఇంటికి వచ్చి పదేళ్లు అవుతోంది. ఈ పదేళ్లలో పిల్లలు పెద్దవడం, మంచి చదువులు చదువు కోవడం , నేను వ్యాపారంలోకి ప్రవేశించడం, బావ, అత్తయ్యల ఆప్యాయతలను పొందడం లాంటివి ఎన్నో జరిగాయి.

ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న అజయ్ అతని కోరిక మేరకు తండ్రికి తోడుగా ఈ వ్యాపారంలోకి వచ్చాడు . అతనికి భూగర్భ శాస్త్రం పైన ఆసక్తి ఉండడంతో, గత రెండేళ్లుగా నేను దగ్గరుండి అతనికి అన్నీ నేర్పించాను. అతనూ తెలివైనవాడు , బాగా కష్టపడే వాడు కాబట్టి తొందరగానే అన్నీ నేర్చుకొన్నాడు.

అఖిల కూడా ఎం.బి.బి.ఎస్ పూర్తి చేసుకొని ఎం.డి చెయ్యడానికి ఢిల్లీకి వెళ్ళిపోయింది. అత్తయ్య కూడా ఎక్కువ రోజులు విశాఖపట్నంలో ఆశ్రమంలోనే ఉంటోంది ఆవిడకు నచ్చినట్టుగా ప్రశాంతంగా జీవిస్తున్నారు. ఇలా

అందరూ ఒక దరికి చేరి సుఖంగా జీవిస్తున్నారు. ఒక రోజు రాత్రి ఇదంతా ఆలోచిస్తుంటే, నా కెందుకో ఇక్కడకు నేను వచ్చిన పని పూర్తయినట్టు అనిపించింది. అజయ్ కి నేను చూసుకునే వ్యాపార బాధ్యత అప్పగించి ఇక్కడి నుంచి వెళ్ళిపోదామని నిర్ణయించుకొన్నాను. కానీ, ఎక్కడికి వెళ్ళాలి, ఏమి చెయ్యాలి అనేది తెలియట్లేదు.

ఎటూ తేల్చుకో లేక పోవడంతో ఆ మర్నాడు అందరికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పి ఏమి చేస్తే బాగుంటుందని వారి అభిప్రాయాన్ని అడిగాను. రాజారావు గారు డిల్లీకి వచ్చేయమని, రాంబాబు వాళ్ళు మళ్ళీ ఊర్లోకి వచ్చేయమని, మురళి అమెరికాకి వచ్చేయమని ఇలా అందరు వాళ్ళ దగ్గరకు వచ్చేయమని మనస్ఫూర్తిగా పిలిచారు. వాళ్ళ ఆప్యాయతకి చాల సంతోషమనిపించింది కానీ వాళ్లెవరి దగ్గరికి వెళ్లాలని లేదు. అత్తయ్య వాళ్ళ ఆశ్రమానికి వచ్చేయమంది. బావ కిరణ్, పిల్లలు మాత్రం అసలు ఇక్కడ నుండి వెళ్లనే వద్దు అంటున్నారు. చివరి ప్రయత్నంగా సత్యమూర్తి మాస్టర్ గారితో మాట్లాడాను. ఆయన "నువ్వు చదువు, ఉద్యోగం, వ్యవసాయం, వ్యాపారం, సమాజ సేవ ఇలా ఎన్నో కర్మలు చక్కగా నిర్వర్తించావు. అంతేకాదు, ఇన్నాళ్లు నువ్వు ఇతరుల కోసం బ్రతుకుతూ సగం జీవితం పూర్తి చేసావు. మిగతా సగం జీవితమైనా నీ కోసం నీవు బ్రతుకు. నీకు కావాల్సినట్టుగా జీవించు. నీకు నచ్చిన చోటు కి వెళ్లి ప్రశాంతంగా గడుపు" అన్నారు. ఈ ఆలోచన నాకు బాగా నచ్చింది.

దీని గురించి బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి అందరితో పంచుకొన్నాను. నా బాగు కోరే వాళ్ళు కాబట్టి ఎవ్వరు అడ్డు చెప్పలేదు. ముందుగా వ్యాపార బాధ్యతలన్నీ అజయ్ కి, బావకి అప్పగించాను. అలాగే, నాకు అనవసరమైన సామాను అంతా తీసేసాను. ఇప్పుడు కేవలం ఒక పెట్టె, బ్యాగ్ తో మిగిలాను నన్ను నేను తెలుసుకొనే ప్రయాణంకి సిద్ధంగా. నాకు అడవులు, కొండలు, సముద్ర ప్రదేశాలంటే చాల ఇష్టం. ఆ ప్రదేశాలకి వెళ్ళి ప్రశాంతంగా కొంత కాలం ఉండాలని చిన్నప్పటి నుంచి కోరిక. కానీ వాటి కంటే కూడా ముందుగా నా జీవిత మార్గదర్శి అయిన సత్యమూర్తి గారి దగ్గర కొన్నాళ్లు ఉండి గురుసేవ చేయాలని అనిపించింది. అదే విషయం ఆయనతో చెప్తే చాల సంతోషించి తప్పకుండా రమ్మన్నారు. ఆ పై వారమే కాకినాడకి బయలుదేరాను. వెళ్లే రోజు అందరూ రైల్వే స్టేషన్ కి వచ్చి వీడ్కోలు చెప్పారు. అలా, నా హైదరాబాద్ నివాసానికి, వ్యాపార పర్వానికి తెర పడింది.

కాకినాడ చేరిన నేను నేరుగా సత్యమూర్తి మాస్టర్ ఇంటికి వెళ్ళాను. ఆయన భార్య చనిపోయాక ఒక్కరే ఉంటున్నారు ఆ ఇంట్లో.

ఒక రోజు విశ్రాంతి తీసుకున్నాక మెల్లగా ఆయన పనులలో సహాయం చేయడం మొదలు పెట్టాను, ఇంటా బయట కూడా. వయసు వలన ఆయన కొంత బలహీనపడినా మానసికంగా చాల ఉత్సాహంగా ఉంటారు. ఆయన ఆశయాలకు తగ్గట్టుగా కాలేజ్ నుంచి బయటకు వచ్చేసాక ప్రజా శక్తి అనే దిన పత్రికని మొదలు పెట్టారు. దాని ద్వారా ప్రజా సమస్యలని అధికారుల దృష్టికి తీసుకు రావడం, ప్రజలని అనేక విషయాలపై చైతన్యవంతుల్ని చేసేవారు. ఈ పనిలోనే ఆయన రోజంతా గడచిపోయేది. ఆయన దినచర్యని గమనిస్తూ, ఆయనకు తోడుగా ఉంటూ ఒక వారం రోజులు గడిపేశాను. దిన పత్రిక నిర్వహించడము చాల కష్టమైన పని. వార్తా సేకరణ, నిర్ధారణ, రాయడం, ప్రచురించడం ఇలా ఎన్నో పనులు నిరంతరం జరుగుతూ ఉండాలి.

పత్రికలోని అంశాలు ప్రజలకు ఉపయోగపడేలా, సత్యమూర్తి గారి ఆశయాలు, విలువలకి తగ్గట్టుగా ఉండాలని ఆయనే స్వయంగా దగ్గరుండి చూసుకునేవారు. ఎంత కష్టమైనా ఆయన ఇష్టంతో చేసేవారు కాబట్టి మానసిక శ్రమ కనిపించేది కాదు. నాక్కూడా పత్రిక పనులు ఎంతో ఆసక్తి కరంగా ఉండేవి, కొత్త విషయాలు తెలిసేవి. సత్యమూర్తి గారు అన్నిటిని నాతొ చర్చించడం, నా అభిప్రాయాలని పరిగణనలోకి తీసుకోవడం నాకు సంతోషాన్నిచ్చేవి. ఆయన నాకు మెల్లగా పత్రికలోని కొన్ని శీర్షికలని నాకు అప్పగించారు. వాటికోసం నేను ప్రముఖులని ఇంటర్వ్యూ చేయడం, ప్రజలతో నేరుగా మాట్లాడడం జరిగేది. వాటి వలన నాకు ప్రముఖుల జీవనశైలి, ఆలోచనా విధానం తెలిసేవి. వాటివలన కొన్ని వివాదాల్లో కూడా ఇరుక్కునేవాడిని. ముఖ్యంగా రాజకీయ వ్యవహారాల విషయాల్లో. అలానే మా పత్రిక చేపట్టిన సర్వేలు కూడా ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేవి. దాని వలన రాజకీయ పార్టీల నుంచి కూడా తీవ్రమైన ఒత్తిడి ఉండేది. మెల్లగా సత్యమూర్తి గారు పత్రిక నుంచి రాజకీయాలను వేరుచేయడానికి ప్రజా శక్తి అనే రాజకీయ వేదికను స్థాపించి నన్ను దానికి కార్యదర్శిగా నియమించారు. సత్యమూర్తి గారి ఆశయాలకు తగ్గట్టుగా రాజకీయ వేదికను నడపడానికి శ్రమించేవాడిని. అందులో ప్రయత్నంగానే ఆ రాజకీయ వేదిక లక్ష్యాలు, కార్యకలాపాలు లాంటివాటిని ప్రవేశపెట్టాను.

ఇవన్నీ సాధించడానికి దాదాపు ఆర్నెల్లు పట్టింది. అయితే ఈ రాజకీయ వేదికను రాజకీయ పార్టీలు వాటి లబ్ధి కోసం వాడుకోవడానికి ప్రయత్నించేవి. వారిని నివారించడం పెద్ద సమస్యగా మారింది. ఇలా ఉండగా ఒక రోజు సూర్య ఫోన్ చేసాడు. ఆరు నెలలుగా నేను ఇక్కడ చేస్తున్న పని అతన్ని చాల ప్రభావితం చేసిందట. తన బాధ్యతలు తీరాయి కాబట్టి తనకి ఇష్టమైన పని అదే ప్రజసేవ చేద్దామని , అందుకు సొంత ఊరైన ఇక్కడకు వచ్చి మాతో చేరదామని , అందుకు మా అభిప్రాయాన్ని తెలుసుకొందామని ఫోన్ చేసాడు.

నేను, సత్యమూర్తి మాస్టారు సంతోషించి అతన్ని సాదరంగా ఆహ్వానించాము ప్రజా శక్తి రాజకీయ వేదిక లోకి. ఎందుకంటే, చిన్నప్పటి నుంచి అతని ఆలోచనలు, ఆశయాలు తెలుసు కాబట్టి. అలా , సూర్య కలవడంతో నా శక్తి, ఉత్సాహం రెట్టింపు అయ్యింది. సూర్యలో ఉన్న ప్రశ్నించే తత్త్వం, పోరాట ధోరణి మా పత్రిక, వేదిక పేరును మరింత పెంచాయి. పత్రిక, రాజకీయ వేదిక నిర్వహణ సమర్థత ని మరింత పెంచడం కోసం సత్యమూర్తి మాస్టరు గారి సూచన మేరకు మాలో మేము బాధ్యతలు పంచుకొన్నాము. నేను రాజకీయ పార్టీలతో సమన్వయం , కార్యాచరణ రూపొందించేవాడిని. సూర్య వాటిని అమలు చేస్తూ ప్రజల మధ్య ఉంటూ పోరాడేవాడు. దీని వలన మేము ఎప్పటినుండో పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలను పరిష్కరించాము. జన నివాసాల మధ్యలో ఉన్న మద్యపాన దుకాణాలు బయటకు తరలించాము. పారిశుధ్య కార్మికులకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించి వారికి న్యాయం జరిగేలా చూసాం. ఇలా ఎన్నో సమస్యల పై పోరాడి ప్రజాభిమానాన్ని పొందాము.

ఇంతలో ఎన్నికల వేడి మొదలయింది. ప్రజల్లో మా వేదికపై ఉన్న అభిమానాన్ని చూసిన రాజకీయ పార్టీలు మా వేదికని వాళ్ళ పార్టీలో కలిపేసుకోడానికి గట్టిగా ప్రయత్నించాయి. కానీ మాకెవ్వరికి ఆ రాజకీయపార్టీలు మా వేదిక ఆశయాలు నెరవేరుస్తాయనే నమ్మకం లేదు. అందుకే వాటిని తిరస్కరించాము. ఆ తరువాత ఈ అంశంపై జరిగిన సమగ్ర చర్చలో చాల మంది మనమే సొంత పార్టీ పెట్టి మన ఆశయాలను కొనసాగిద్దాము, లేకపోతె ఇంకో రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చి మన ఆశయాలకు అడ్డుతగలచ్చు అని అభిప్రాయపడ్డారు. సత్యమూర్తి మాస్టరు కూడా ఆ అభిప్రాయంతో ఏకీభవించారు. ఆ రకంగా మా ప్రజా శక్తి రాజకీయ వేదిక, ప్రజా శక్తి రాజకీయ పార్టీగా మారింది, సత్యమూర్తి గారు వ్యవస్థాపకుడిగా , నేను, సూర్యప్రధాన కార్యదర్శులుగా. ఈ ఎన్నికలలో కేవలం ఈ ఊరి వరకే పోటీ చేద్దామని నిర్ణయించుకొన్నాము. ఎన్నికలు ఆర్నెల్లలోనే ఉండడంతో అందరం పనులన్నీ వేగవంతం చేశాము. ఇంతలో ఇంకొక ముఖ్య నిర్ణయం తీసుకోవాల్సివచ్చింది.

అది పోటీ చేసే అభ్యర్థి ఎవరు అని. దాని గురించి నేను, సూర్య, సత్యమూర్తి మాస్టరు మాట్లాడుకున్నాం. మేమిద్దరం ఏకగ్రీవంగా మాస్టారు పేరు ప్రతిపాదించాము. దానికి ఆయన "నేను పోటీ చేయలేను. ఎందుకంటే, నాకు వయసు మళ్లింది. అంతేకాక, నాకు పత్రికా నిర్వహణ ఇష్టం, దానిని దీని కోసం వదులుకోలేను. అలాని రెండూ సమర్ధవంతంగా చేయలేను. అందుకని, మీ ఇద్దరిలో ఒకరు నిలబడితే బాగుంటుంది" అన్నారు. వెంటనే సూర్య "అలా అయితే గౌతమ్ పోటీ చేయడం సబబు. ఎందుకంటే, ఈ వేదికని స్థాపించినప్పటి నుండి , కృషి చేసింది గౌతమే. అంతేకాక, అతను ఏ పని నైనా సామరస్యంగా , విజయవంతంగా నిర్వహించగలడు" అన్నాడు.

చివరిగా నేను "నాకు మాత్రం సూర్యనే దీనికి సరైన వాడు అనిపిస్తోంది. ఎందుకంటే, చిన్నప్పటి నుండి న్యాయం కోసం పోరాడే స్వభావం , అక్రమాలని ప్రశ్నించే తత్త్వం కలవాడు. అతను గత ఆర్నెల్లుగా ప్రజల మధ్యలో ఉంటూ

వారి సమస్యలపై పోరాడుతూ మంచి పేరు సంపాదించుకున్నాడు. ఇలాంటి వాడు ఎన్నికలలో గెలిచి శాసన సభకి వెడితే ప్రజా వాణిని బాగా వినిపిస్తాడు. అంతేకాక, తనకున్న అధికారాలను సద్వినియోగం చేసుకొంటూ ప్రజలకు మేలు చేస్తాడు. ఇక నా విషయానికి వస్తే, నేను ఇక్కడకు వచ్చింది కేవలం గురుసేవకే. మాస్టారు ఆదేశంపై రాజకీయ వేదికని స్థాపించాను కానీ నా జీవితాశయం లాగా కాదు. అంతే కాదు, కొంత కాలం తరువాత నేను ముందు అనుకొన్నట్టుగా స్వేచ్చ గా దేశమంతా తిరుగుతూ కాలం గడుపుతాను. అందుకని, సూర్య అభ్యర్థిగా నిలబడితే చాల సంతోషిస్తాను" అన్నాను.

మాస్టారు కూడా నా ఆలోచనను సమర్థిస్తూ "గౌతమ్ ఇక్కడ ఎక్కువ కాలం ఉండడని నాకు ముందే తెలుసు. అతనికి ఇష్టమైనట్టుగా వదిలేయడం మన ధర్మం. అందుకని, సూర్య నీవే మన పార్టీ అభ్యర్థిగా నిలబడు" అన్నారు. చివరకి సూర్య నాతో "ఒక్క షరతు పైన నేను పోటీకి ఒప్పుకుంటాను. నువ్వు ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ, కనీసం ఎన్నికలయ్యే వరకూ ఇక్కడే ఉండి నాకు సహాయం చేయాలి.

అలాగే, మాస్టారు పార్టీకి ప్రెసిడెంటుగా కొన సాగుతూ మార్గదర్శిగా నన్ను నడిపించాలి" అన్నాడు. దానికి, మేము సంతోషంగా ఒప్పుకున్నాము. అక్కడినుండి, మేమంతా ఎన్నికల ప్రణాళిక, కార్యాచరణ సిద్ధం చేసుకొని వాటిని అమలు చేయడం మొదలు పెట్టాము. ముందుగా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాము. పత్రిక ద్వారా అంశాల వారీగా పార్టీ ఆశయాలను, అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాం. ఆ తరువాత ప్రచారం కూడా మొదలు పెట్టాము. ప్రజలకు పత్రిక, పార్టీ నిజాయితీ పై ఉన్న నమ్మకం, సూర్య మాటలు, చేతలు చూసి మెల్లగా మా పార్టీ వైపు మొగ్గారు. అది ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. సూర్య అద్భుతమైన ఆధిక్యంతో గెలిచాడు.

ఆ రోజు మా సంతోషానికి హద్దులు లేవు. అన్ని పత్రికలూ, టీవీ ఛానళ్ళు ఈ విజయాన్ని గురించి బాగా చెప్పారు. మేము కూడా ఈ విజయాన్ని పార్టీ దీర్ఘకాల ఆశయసాధనలో తొలి మెట్టుగా భావించాము. సూర్య ప్రమాణ స్వీకారానికి మా స్నేహితులంతా వచ్చారు. అన్నీ సద్దు మణిగాక నేను సూర్య, మాస్టారు గారితో నా తదుపరి ప్రయాణం గురించి చెప్పాను. అది వారికి ఇష్టం లేకపోయినా, ముందుగా అనుకున్న మాటకి గౌరవమిస్తూ నేను స్వేచ్ఛా జీవితంలోకి అడుగుపెట్టడానికి ఒప్పుకొన్నారు.

వెంటనే నేను అసంపూర్ణంగా ఉన్న పనులు పూర్తి చేసి, నా బాధ్యతలని వారికి అప్పగించాను. ముందుగా అనుకొన్నట్టుగా, అడవులలోకి వెళ్లి కొంతకాలం గడుపుదామనుకొన్నాను. అందుకు కర్ణాటకలోని బందీపూర్ అడవిని ఎంచుకున్నాను.

కిరణ్ బావకి తెలిసిన వాళ్ళ ద్వారా అక్కడ ఒక చిన్న ఊర్లో నా నివాసానికి ఏర్పాటు చేసారు. వెళ్లే ముందురోజు సత్యమూర్తి గారు పార్టీ మీటింగ్ పెట్టి నా నిర్ణయాన్ని, అందుకు కారణాన్ని వివరించారు ఎటువంటి అపోహలకు, వదంతులకు ఆస్కారమివ్వకుండా. దాంతో, ఆ సభ నా వీడ్కోలు సభలాగా మారింది. అందరూ నా గురించి గొప్పగా మాట్లాడారు. నేను కూడా పార్టీతో, వారందరితో ఏర్పడిన అనుబంధం గురించి మాట్లాడాను. నేను వెళ్లే రోజు రైల్వే స్టేషన్ కి సూర్య, సత్యమూర్తి మాస్టారుతో పాటు అనేకమంది కార్యకర్తలు కూడా వచ్చి వీడ్కోలు చెప్పారు.. అలా, నా కాకినాడ నివాసానికి, రాజకీయ పర్వానికి తెర పడింది ఎన్నో ఆలోచనలతో, ఆశలతో నా స్వేఛ్చా ప్రయాణం మొదలయ్యింది.

మైసూర్ లో రైల్ దిగి, అక్కడినుండి కారు మాట్లాడుకుని బందిపూర్ అడవిలోని నాకు నివాసం ఏర్పాటు చేసిన ఊరికి చేరేటప్పటికి మరునాడు సాయంత్రం అయింది. అక్కడ బావ చెప్పిన వ్యక్తి కలిసి నేను ఉండే ఇంటికి తీసుకెళ్లాడు. అది ఒక చిన్న ఇల్లు. రెండు గదులు , ఆనుకుని చిన్న వంటిల్లు, బాత్రూం ఉన్నాయి. నేను వస్తున్నానని తెలిసి ఇల్లంతా శుభ్రం చేసారు. ఇంట్లో ఒక మంచం, వంట ఇంటి సామాను, రెండు కుర్చీలు, ఒక టేబుల్ ఉన్నాయి. నాతో వచ్చిన వ్యక్తి పేరు రామప్ప. అతను నాతో "మీరు స్నానం చేసి విశ్రాంతి తీసుకోండి. నేను మీకు భోజనం తీసుకువస్తాను" అని వెళ్ళి పోయాడు. నేను తెచ్చుకొన్న సామాను సర్దుకుని స్నానం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొన్నాను.

కాసేపాగి మెల్లగా బయటకు వచ్చి పరిసరాలు గమనించడం మొదలు పెట్టాను. చిన్న ఊరు , ఇంటి వెనకాల అంతా దట్టమైన చెట్లు, రెండు వైపులా ఇలాంటి ఇళ్లు, ఎదురుగా బస్సు స్టాండ్ ఉన్నాయి. ఎటువంటి హోరు లేకుండా చాల హాయిగా, ప్రశాంతంగా ఉంది. అలా చూస్తుండగానే రామప్ప భోజనం తీసుకొని వచ్చాడు. నాతో "మా భోజనం మీకు నచ్చుతుందో లేదో తెలీదు. ఈ ఒక్క రోజుకి సర్దుకుపోండి. రేపు వంటకి కావాల్సిన సామాను అంతా తీసుకువస్తాను. మీకు కావలిసినట్టుగా వండుకోవచ్చు. గిన్నెలు ఏమీ తోమవద్దు. రేపటి నుండి నా చిన్న కూతురు అంజు వచ్చి ఇంటి పనులన్నీ చేస్తుంది.

రాత్రి నిద్ర పోయే ముందు అన్ని తలుపులు గట్టిగా వేసుకొని పడుకోండి. ఎందుకంటే, అప్పుడప్పుడు అడవి మృగాలు వస్తూఉంటాయి. ఇది అడవి ప్రాంతం కదా"అని చెప్పి వెళ్లి పోయాడు. అతను వెళ్ళాక కాసేపటికి భోజనం చేశాను. . నిజానికి భోజనం చాల బాగుంది. వాళ్ళ వంటలు, రుచులు నాకు బాగా నచ్చాయి. ఇక్కడి నుండి వెళ్లే లోపు కొన్ని వంటలైనా నేర్చుకోవాలి వీళ్ళ దగ్గర అనుకొన్నాను. బాగా అలసిపోవడంతో వెంటనే నిద్ర పట్టేసి పొద్దున్న వరకూ మెలుకువ రాలేదు. నిద్రలేచేప్పటికి పక్షుల కూతలు , పల్లెటూరి మనుషుల మాటల హడావుడి వినిపిస్తోంది.

తలుపు తీసేటప్పటికి బయట దాదాపు ఇరవై ఏళ్ల అమ్మాయి ముగ్గు పెడుతూ కనిపించింది. నన్ను చూసి నమస్కారం పెట్టి "నా పేరు అంజు. మా నాన్న రామప్ప పంపించాడు ఇక్కడ పనికి" అంది. నేను "ఇక్కడ నీకు ఎక్కువ పని ఉండదు. ఎందుకంటే, నాకు వంట చేసుకోవడం, ఇంటి పనులన్నీ వచ్చు. నువ్వురోజూ ఎనిమిది గంటలకి వస్తే చాలు. నేను పొద్దునే వాకింగ్ కి వెళ్లి అప్పటికి ఇంటికి వస్తాను అన్నాను. అంజు "సరే సార్, ఈ రెండు రోజులకి వంటకి కావాల్సిన సామాను తెచ్చాను." అని లోపలకి వెళ్లి తాను తెచ్చిన సామాన్లు అన్నీ సర్దేసింది. ఇల్లంతా ఊడ్చేసి, కాఫీ కలిపిచ్చి వెళ్లి పోయింది. తాను వెళ్ళిపోయాక స్నానం చేసి, వంట వండుకుంటుండగా రామప్ప వచ్చాడు. నన్ను ఊర్లోకి తీసుకెళ్లి షాపులు చూపించాడు. ఊరు మొత్తానికి మూడే దుకాణాలు. ఆ షాపుల లోనే నెల రోజులకి కావాల్సిన సామాను అంతా కొనుక్కొచ్చాను. ఊర్లో వాళ్ళని కూడా కొందరిని పరిచయం చేసాడు. ఊరు చాల చిన్నది, జనాభా కూడా చాల తక్కువ. అటవీ ప్రాంతం కావడంతో నాగరికతకు దూరంగా ఉన్నారు.

ఊరి చివర కర్ణాటక ప్రభుత్వ పర్యటన వసతి గృహం ఉంది. ముందు బావ నన్ను అక్కడే ఉండమన్నాడు. నాకెందుకో విడిగా ఉండాలనిపించి ఈ ఇల్లు అద్దెకి తీసుకొన్నాను. ఈ వసతి గృహం పేరు వన విహార్. అక్కడి సిబ్బందిని నారప్ప పరిచయం చేసాడు. వాళ్ళు చాల మర్యాదగా మాట్లాడారు.

ఎప్పుడైనా అక్కడికి వచ్చి తినచ్చని, అక్కడి వసతులు (స్విమ్మింగ్ పూల్, లైబ్రరి, ఆటలు లాంటివి) వాడుకోవచ్చని చెప్పారు. బావ వాళ్లతో అంతకుముందే మాట్లాడారట. అలాగే, మర్నాడు నన్ను అడవిలోకి తీసుకెళ్తామన్నారు వారి మిగతా అతిధులతో పాటు. దానికి నేను వెంటనే ఒప్పుకున్నాను. చివరకు, రామప్ప తన ఇల్లు కూడా చూపించి, ఏ అవసరమున్నా పిలవమని చెప్పి వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం భోజనము చేసి హాయిగా పడుకొని , సాయంత్రం అలా ప్రకృతిని ఆస్వాదిస్తూ గడిపేశాను. అలా మొదటి రోజు గడిచిపోయింది.

మర్నాడు పొద్దున్నే తయారయి వన విహార్ కి వెళ్ళాను. అక్కడి నుండి అడవిలోకి ఒక వాన్ లో తీసుకెళ్లారు. వాన్ లో సుమారు ఇరవై మంది వరకూ ఉన్నారు. వాన్ కదిలాక ఒకరి నొకరుపరిచయం చేసుకొన్నాము. ఇందులో ఎక్కువమంది విహార యాత్రగా వచ్చిన వాళ్ళే . కొందరు మాత్రం పరిశోధన నిమిత్తము, ఒకరిద్దరు నాలాగ కొంత కాలం గడుపుదామని వచ్చారు. ఇంక అక్కడనుండి మాట్లాడుకుంటూ అడవి అందాలు చూస్తూ సరదాగా రోజంతా గడిపాము. అడవిలో పొడవాటి చెట్లు, తొలకరి చినుకులు , పక్షుల కూతలతో చాల అందంగా, ప్రశాంతంగా ఉంది. అక్కడక్కడ ఏనుగులు, జింకలు కూడా కనిపించాయి. మాతో వచ్చిన గైడ్ క్రూరమృగాలు పగటి పూట సాధారణంగా కనిపించవని , అంతేకాక వాటిని చూడాలంటే అడవి లోపలి కంటా వెళ్లాలని, అది

అంత క్షేమం కూడా కాదని చెప్పాడు. అక్కడే పసందైన వన భోజనం చేసాము. అలా రోజంతా అడవిలోనే గడిపి చీకటి పడే వేళకి ఊర్లోకి వచ్చేసాము.

ఒక సారి రాత్రంతా ఒక్కడ్నే అడవిలో ఉండిపోయాను. అడవి మధ్యలో అందమైన చెట్టు పైన అటవీ శాఖ వారు ఒక చిన్న కుటీరం లాం టిది నిర్మించారు. దానిలోకి వెళ్లడానికి చెట్టుకు కట్టేసిన తాళ్ల నిచ్చెనను వాడేవారు. ఆ కుటీరంలోకి వెళ్ళాక నిచ్చెనను పైకి లాగేయాలి , తరువాత ఏ జంతువులు, అడవి దొంగలు పైకి రాకుండా. ఆ కుటీరంలో విద్యుత్ ఉండదు. ఫోన్లు పని చెయ్యవు. రాత్రంతా చీకట్లోనే గడపాలి.

నా కోరికని మన్నించి అందులో ఉండడానికి అటవీ శాఖ వారు ఒప్పుకొన్నారు. ఇంటి దగ్గరి నుండి ఆహారం, మంచి నీళ్లు, పక్క దుప్పటి తెచ్చుకొని వన విహార్ వ్యాన్ లో వచ్చాను. వాళ్ళు నన్ను అక్కడ దింపి, చెట్టు పైకెక్కడానికి సహాయపడి వెళ్ళి పోయారు. ఆ మర్నాడు ఉదయంపది గంటలకు వచ్చి నన్ను కిందకి దింపారు.

ఆ కుటీరంలో ఆ రోజు గడిపిన అనుభవం వర్ణించలేనిది. దట్టమైన అడవిలో సూర్యాస్తమయం, సూర్యోదయం, పక్షుల కిల కిలలు, చక్కటి గాలి నాకు బాగా నచ్చింది. ఆ తరువాత కూడా ఒకటి, రెండు సార్లు అలా అడవిలో ఉండిపోయి చక్కటి అనుభూతిని పొందాను.

ఆ తరువాత చాల సార్లు అడవిలోకి వెళ్ళాను. వన విహార్ కి దాదాపు రోజు పొద్దున్న, సాయంత్రం వెళ్ళేవాడిని. అక్కడ లైబ్రరీలో పుస్తకాలు చదువుకోవటం, అక్కడ పరిశోధనకి వచ్చిన వారితో మాట్లాడడం, అభిప్రాయాలు పంచుకోవడం, ఛెస్, క్యారమ్ బోర్డు ఆడడం లాంటివి చేసేవాడిని. మిగతా సమయంలో ఒంటరిగా గడపడం, యోగ, ధ్యానం లాంటివి చేస్తుండేవాడిని. ఇలా చాల తృప్తిగా, ప్రశాంతంగా దాదాపు సంవత్సరం గడిచిపోయింది. అన్ని ఋతువులని , ఆ సమయం లో అడవి అందాల్ని చూసాను. ఆ అందాల్ని నా కెమెరాలో బంధించాను. మొదటి సారిగా, నేను డైరీ రాయడం మొదలుపెట్టాను. ఎందుకంటే, ఇక్కడి అందమైన అనుభవాలని మర్చిపోకుండా ఎక్కడైనా పదిల పరచాలనిపించింది. ఆ డైరీ లో ఇక్కడ అందాలనే కాక , స్వాతి ముత్యపు లాంటి మనుషులు గురించి కూడా రాసేవాడిని . ఇలా కాలం సాగి పోతుండగా ఒక రోజు బావ ఫోన్ చేసి అఖిల పెళ్ళి కుదిరిందని, తోటి డాక్టరును ప్రేమించి పెళ్ళి చేసుకుంటోందని, నన్ను వెంటనే రమ్మని చెప్పారు. అలా నా అరణ్యవాసం ఒక్క సంవత్సరంలోనే ముగిసింది. అన్నీ సర్దుకొని, ఇల్లు ఖాళీ చేసి, అందరికీ వీడ్కోలు చెప్పి హైదరాబాద్ కి చేరాను. హైదరాబాద్ లో దాదాపు మూడు నెలలు ఉన్నాను పెళ్లి హడావుడి అంతా సర్దుకునే వరకు . అఖిలని నా సొంత మేన కోడలుగా భావించడంతో నేను పూర్తి బాధ్యత తీసుకుని పెళ్ళి పనులలో లీనమైపోయాను ఇంకేవీ పట్టించుకోకుండా. పెళ్ళికి నా ప్రాణ స్నేహితులు, స్వాతి వచ్చారు.

పెళ్ళి హడావిడి అంతా సద్దుమణిగాక శ్రీరామ్ నవ్వుతూ "మళ్ళీ అడవిలోకి వెళ్ళిపోతావా, కాని పక్షంలో నీ తదుపరి మజిలీ ఎక్కడ" అనడిగాడు. నేనూ నవ్వుతూ "వనవాసం ముగిసినట్టే, ఈ సారి కొండల పైనో, పర్వతాలలోనో జీవించాలని ఉంది కొంత కాలం" అన్నాను. వాడు వెంటనే డార్జిలింగ్ లో మా తమ్ముడి గెస్ట్ హౌస్ ఉంది. వాడికి చెప్తాను. అక్కడికి వెళ్ళి నీ ఇష్టమొచ్చినంత కాలం ఉండవచ్చు అన్నాడు. నేను దానికి వెంటనే ఒప్పుకొని వెళ్లడానికి విమానం టికెట్ తీసుకొన్నాను.

ఆ పై వారం బయలుదేరి డార్జిలింగ్ వెళ్ళి శ్రీరామ్ తమ్ముడూ వాళ్ళ గెస్ట్ హౌస్ కి చేరాను. గెస్ట్ హౌస్ చాలా బాగుంది. కొండ చివరికి ఉంది. దాదాపు ఏభై గదులు వరకూ ఉన్నాయి ఆ రెండంతస్తుల మేడ లో. నాకు రెండవ అంతస్తులో చివర గది ఇచ్చారు. అక్కడి కిటికీ లోంచి చూస్తే బయట దృశ్యం అద్భుతంగా ఉంది. చుట్టూ కొండలు, దట్టమైన చెట్లు, మధ్యలో సన్నని నదీ పాయలతో వర్ణనాతీతంగా ఉంది. ఆ కిటికీ దగ్గర కూర్చుని ప్రకృతిని చూస్తూ గంటలు గడిపేయవచ్చు. ఈ గెస్ట్ హౌసులో భోజన సదుపాయమే కాక స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్ కోర్టు, టీవీ రూమ్ లాంటి సౌకర్యాలు కూడా ఉన్నాయి. రోజులు గడుస్తున్నకొద్దీ గెస్ట్ హౌస్ ఉద్యోగులు బాగా పరిచయం అయ్యారు. వాళ్ళ ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల గురించి తెలుసుకొని అక్కడకు వెళ్ళి వచ్చేవాడిని. ఎక్కడికి వెళ్లినా కావలిసినవన్నీ చూసుకునేవారు ఆ ఉద్యోగులే. గెస్ట్ హౌస్ యజమాని తరపు మనిషిని అవడంతో దేనికీ లోటు రాకుండా చూసుకునేవారు. రూమ్ అద్దె కూడా తీసుకొనేవారు కాదు.

డార్జిలింగ్ చుట్టు పక్కల తేయాకు తోటలు, చిన్న ఊర్లతో చాలా అందంగా ఉండేది. ఒక ఊరికి వెళ్ళి నప్పుడు రోజంతా అక్కడే గడిపేవాడిని. ఆ ఊరి ప్రజలని, వారి ఆహారనియమాలని , జీవన శైలిని గమనిస్తూ ఉండేవాడిని. నాకు తెలీని విషయాలు అక్కడ ప్రజలతో మాట్లాడుతూ తెల్సుకొనేవాడిని. అక్కడ ప్రజలంతా పనులపై చాల దూరం నడుచుకుంటూ వెళ్ళి పోతారు. చిన్న పిల్లలు స్కూల్ కి వెళ్లడానికి ఉంటున్న కొండ దిగి ఇంకో కొండ ఎక్కేస్తూ ఉంటారు. చూడడానికి నాకు ఇదంతా చాల విచిత్రంగా ఉండేది.

రోడ్డు పక్కనే ఇళ్ళు , ఇంటి ముందు గదిలోనే షాపు ఉంటుంది. ఆ గదిని పగలు పూట దుకాణంలాగా వాడి, రాత్రి పూట ఇంట్లో ఒక గది లాగా వాడుకొనేవారు. ఇల్లు కొండ అంచులో కట్టడం వలన చిన్నవిగా, రెండు మూడు అంతస్తులుగా ఉండేవి. అలాగే, వాతావరణం చాల చల్లగా ఉండి పగలు సమయం తక్కువ, రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది. ఎండ చాల తక్కువ సేపు ఉంటుంది.

మెల్లగా ఇక్కడ వాతావరణంకి, ఆహారంకి , ప్రజలకి అలవాటు పడ్డాను. నాకు కూడా కొండ ప్రాంతాల్లో నడుస్తూ రాత్రిళ్ళు ఎక్కడైన బస చేస్తూ కొన్ని రోజులు తిరగాలనిపించింది. ఒక చిన్న బాగ్ లో ఒక జత బట్టలు, కొంత

సామాను సర్దుకొన్నాను. ఆ బ్యాగ్ భుజాన తగిలించుకుని ఒక రోజు పొద్దున్నే నడవడం మొదలు పెట్టాను. మిగతావారిలాగా కొండ ఎక్కి, దిగి మధ్య మధ్యలో ఆగుతూ, ఫోటోలు తీసుకుంటూ, ప్రకృతిని ఆస్వాదిస్తూ, డైరీ రాసుకుంటూ మెల్లగా ఇంకో ఊరుకి చేరుకునేవాడిని. అక్కడ బస చేసి, అక్కడ దొరికే ఆహారం తినేవాడిని. అక్కడి ప్రజలతో మాట్లాడుతూ వారి వ్యాపకాలు, దిన చర్యలు కనుక్కునేవాడిని. ఆ చిన్న ఊర్లో ప్రజలు చాల అమాయకులు. వారిలో చాల మంది జీవితంలో ఆ ఊరు దాటి వెళ్ళలేదు. వాళ్ళకి నగర జీవితం కానీ, ఆధునిక వస్తువులు, వసతులు కానీ తెలియవు. ఎక్కువ మంది పేదవారు. అయినా, వాళ్ళు ఉన్న దానితో తృప్తిగా బ్రతుకుతున్నారు. వారి సాధారణ జీవన శైలిని చూస్తే ఎంతో ముచ్చటవేస్తుంది. వారి దగ్గర నుంచి నేర్చుకోవడానికి ఎంతో ఉందనిపించేది.

ఇలా చుట్టు పక్కల ప్రదేశాలన్నీ చూసేటప్పటికి ఆరు నెలలు గడచిపోయాయి. నాకు నచ్చినట్టుగా, నచ్చిన ప్రదేశంలో బ్రతకడం చాల బాగుంది. మధ్యలో శ్రీరామ్ అతని కుటుంబంతో వచ్చి కొన్ని రోజులు ఉన్నాడు. నేను డైరీ రాయడం చూసి నాతో "నువ్వు చూసిన వింతలు, నీ అనుభూతులు రోజు డైరీలో రాసుకోవడం బాగుంది. కానీ, నాదొక సలహా. వీటితో పాటు చిన్నప్పటి నుండి నీ జీవితంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలు కూడా రాస్తే చాల బాగుంటుంది.

ఎందుకంటే, నీ జీవితంలో ఎన్నో మలుపులు, ఎత్తుపల్లాలు ఉన్నాయి. అవన్నీ జాగ్రత్తగా ఒక చోట పొందుపరిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. " అన్నాడు. నాకు ముందర ఆ సలహా నచ్చకపోయినా అతను వెళ్ళాక ఆలోచిస్తే రాయడం నాకు కూడా తృప్తి కలిగిస్తుందనిపించింది. ఆ రోజు నుంచి డైరీతో పాటు నా చిన్నప్పటి విశేషాలు కూడా రాసేవాడిని. రోజు మధ్యాహ్నం గంటా , రెండు గంటలు నా రచనా వ్యాసంగంలో గడిపేవాడిని.

పొద్దున్న, సాయంత్రం ప్రకృతిలో లీనమైపోయేవాడిని ధ్యానం ద్వారా కానీ, ఫోటోగ్రఫీ ద్వారా కానీ, వ్యాహ్యాళి ద్వారా కాని. ఇలా ఇంకొక ఆరు నెలలు, అంటే నేను ఇక్కడికి వచ్చి దాదాపు సంవత్సరం గడిచిపోయింది.

మెల్లగా తరువాత మజిలీ గురించి ఆలోచించాను. నాకు అడవులు, పర్వతాలు తో పాటు సముద్ర ప్రాంతం కూడా ఇష్టం. ఎప్పటికైనా సముద్రతీర ప్రాంతంలో స్థిరపడాలని ఉండేది. అందుకని, అక్కడకు వెళ్ళే ముందర భారతదేశంలోని మిగతా ప్రాంతాలు చుట్టబెట్టి చివరకు వైజాగ్ చేరదామనుకొన్నాను. నా ఆలోచన విన్న సూర్య నాతో పాటు వస్తానని అన్నాడు. చెప్పినట్టుగానే కొద్దీ రోజుల లోనే నా దగ్గరకు వచ్చాడు. ఇంక మేమిద్దరం కలిసి ముందుగా ఉత్తర భారత దేశం అంతా తిరిగాము. మా యాత్రలో ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మధ్య ప్రదేశ్, పంజాబ్, హిమాచల ప్రదేశ్ రాష్ట్రాలలోని ముఖ్య ప్రదేశాలని సందర్శించాము. ఎక్కడా రెండు, మూడు రోజులు

దాటి ఉండేవాళ్ళము కాదు. ఒక చోట హోటల్ లో, ఇంకో చోట గెస్ట్ హౌసులో ఎక్కడ వసతి దొరికితే అక్కడ ఉండేవాళ్ళము. చారిత్రాత్మక కట్టడాలు,, పుణ్యక్షేత్రాలు , పర్యాటక ప్రదేశాలు లాంటివన్నీ చూసే వాళ్ళము. సూర్యా ఆ డైరీలో విశేషాలని నా జీవిత కథ తో కలిపేయమని సలహా ఇచ్చాడు. నాకు ఆ సలహా నచ్చింది కానీ కథ పూర్తియిన తరువాత ఆ పని చేద్దామనుకొన్నాను. ఈ యాత్రముగిసేటప్పటికి అమెరికా నుంచి మురళి ఫోన్ వచ్చింది పిన్ని హఠాత్తుగా చనిపోయిందని, దహన సంస్కారాలు అక్కడ చేసి మిగతా కార్యక్రమాలు చేయడానికి తెనాలి వస్తున్నానని. వెంటనే తెనాలి చేరుకొని, ఊర్లో కావాల్సిన ఏర్పాట్లు చేశాను.

ఆ తరువాత మురళీ వాళ్ళు వచ్చాక అన్ని కార్యక్రమాలు జరిపించి వాళ్ళున్నంత కాలం ఊర్లోనే ఉన్నాను. మురళి నాతో తల్లి తండ్రులు లేని ఈ ఊరుకి ఇంక రాలేనని, అన్నీ అమ్మేసుకొని అమెరికాకి వెనక్కి వెళ్లిపోతానని అన్నాడు. అన్నట్టుగానే , పొలాలు అమ్మేశాడు ఊర్లో వాళ్లకి. ఇల్లు ఊరి పంచాయతీ ఆఫీస్ పేరున రాసేశాడు. ఆ రకంగా మురళికి ఈ ఊరుతో బంధం పూర్తిగా తెగి పోయింది.

అతను వెళ్ళిపోయాక నా తదుపరి యాత్ర మొదలయ్యింది. ఈ సారి గిరి నా వెంట వచ్చాడు. ఇద్దరం కలసి దక్షిణ భారత దేశ యాత్ర మొదలు పెట్టాము. కేరళ, తమిళనాడు, కర్ణాటక లోని చాల ప్రదేశాలు చూశాం. ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించాము. ప్రాచీన ప్రదేశాలు, గత కాలపు వైభవ చిహ్నాలు, అప్పటి సంస్కృతిని గుర్తుచేసే కట్టడాలు, ఇలా ఎన్నో అపురూపమైన ప్రదేశాల్ని దర్శించాము. దాదాపు నాలుగు నెలలు అలా తిరిగి వైజాగ్ చేరుకున్నాము. అక్కడికి వచ్చాక గిరి ఊరికి వెళ్లి పోయాడు. నాకు మాత్రం ఇక్కడే ఉండిపోయి ముందు అనుకున్నట్టుగా సముద్రతీరాన ప్రశాంతంగా జీవించాలనిపించింది.

కొన్ని రోజులు హోటల్ లో ఉండి ఇల్లు వెతుక్కున్నాను. భీమిలిలో బీచికి దగ్గరిలో ఒక చిన్న ఇల్లు అద్దెకి దొరికింది. ఆ ఇంటిలోకి వెంటనే మారిపోయాను.. ఇంటికి కావలసిన సామానంతా కొన్నాను. రోజు పొద్దునే బీచ్ దగ్గరకు వెళ్ళే వాడిని. బీచ్ నుంచి వెనక్కి వచ్చాక రేడియో వింటూ వంట చేసుకునే వాడిని. మధ్యాహ్నా భోజనము తరువాత నా జీవిత చరిత్ర రాసుకొనేవాడిని. సాయంత్రం మా వీధి చివర ఉన్న "సాహితీ నిలయం"కి వెళ్ళేవాడిని. ఇలా రోజంతా నాకు నచ్చినట్టుగా గడిపేవాడిని. సాహితీ నిలయం ఇంటి యజమాని సీతారామయ్య గారు ప్రముఖ సాహితీవేత్త. సాహిత్యం మీద అభిమానంతో డాబా పైన ఒక హాలు కట్టించారు. అక్కడికి సాహితీ ప్రియులు, సాహితీ వేత్తలు వచ్చేవారు. కొందరు వారు రాసిన రచనలు, కవితలు, హాస్య ఛలోక్తులు వినిపించేవారు. ఒక్కో సారి వర్తమాన కాల పరిస్థితుల పైనా , సామాజిక సమస్యల పైనా చర్చలు జరిగేవి.

మొదట్లో నేను కేవలం విని వచ్చేసేవాడిని. మెల్లగా నా అభిప్రాయాలు చెప్పడం మొదలు పెట్టాను. దానివలన అక్కడికి వచ్చేవారిలో కొందరు పరిచయము అయ్యారు.

వారిలో ముందుగా చెప్పాల్సిన వాడు సూరజ్. నాలాగే అన్ని సమావేశాలకి హాజరు అవ్వడమే కాక వక్తలని తాను అంగీకరించని అంశాలపై ప్రశ్నిస్తూ ఉండేవాడు కూడా. ఒక రోజు ఒక వక్త "పల్లె జీవితం " అనే అంశం పై మాట్లాడుతూ అవి చాల బాగుంటాయని, సమస్యలు లేని జీవితమని అన్నారు. దానికి సూరజ్ ఆవేశంగా "ఇది పూర్తిగా తప్పు. ఎందుకంటే నేను పల్లెటూరి నుంచి వచ్చిన వాడినే. మా గ్రామంలో, మా చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయి. రెండు రోజులు ఉండి వెళ్లడానికి పల్లెటూర్లు బాగానే ఉంటాయి. పూర్తిగా అక్కడే జీవిస్తే తెలుస్తుంది" అన్నాడు. వక్త, మిగతా పెద్దలు ఏదో చెప్పి సమాధానపరిచారు. అతను మాత్రం అసంతృప్తిగానే ఒప్పుకున్నాడు. సభ అయ్యాక అతనికి నేను పరిచయం చేసుకొని "మీ ఊరిలో సమస్యల గురించి తెలుసుకోవచ్చా" అన్నాను. అప్పుడు సూరజ్ "మా ఊర్లో ఇప్పటి దాకా నీటి కుళాయిలు లేవు. అందరు ఎంతో దూరం నడిచి వెళ్ళి మంచి నీళ్ళు మోసి తెచ్చుకోవాలి . అలాగే, మా ఊరిలో ప్రాధమిక చికిత్స కేంద్రం ఉంది కాని దానిలో సదుపాయాలు సరిగ్గా లేవు. సమయానికి వైద్యం అందక కొందరు ప్రాణాలు కూడా పోగుట్టుకున్నారు. ఇవి పెద్ద సమస్యలు . ఇంకా చిన్న సమస్యలు ఎన్నో ఉన్నాయి" అన్నాడు. నేను "నీ మాటలతో పూర్తిగా అంగీకరిస్తాను. ఒకప్పుడు మా ఊర్లో కూడా ఇవే సమస్యలు ఉండేవి. వాటిని ఊర్లో వాళ్ళంతా కలసి కట్టుగా ఉండి , ప్రభుత్వ సహాయము తో పరిష్కరించుకున్నారు." అని వివరాలన్నీ చెప్పడమే కాక "నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని" చెప్పాను. దానికి అతను "మీ మాటలు నాకొక మార్గాన్ని చూపాయి. నేను కూడా మీరు చెప్పిన పరిష్కారాలు మా ఊర్లో అమలు చేయడానికి ప్రయత్నిస్తాను." అన్నాడు.

సాహితీ నిలయంలో ప్రతి ఆదివారం రోజంతా కార్యక్రమాలు జరిగేవి. వాటికి ముఖ్య అతిథి ని పిలిచేవారు.

అలా వచ్చిన పెద్దలు ఒక మంచి విషయం పై దాదాపు రెండు, మూడు గంటలు ఆసక్తికరమైన ఉపన్యాసం చేసేవారు. అవి చాల స్ఫూర్తి దాయకంగా, మనసును హత్తుకునేలా ఉండేవి. అందువలన, ఆ సభలకు అందరు వచ్చేవారు. నేను కూడా క్రమం తప్పకుండా ఆ సభలన్నీటికీ హాజరు అయ్యేవాడిని.

అలాగే సాహితీ నిలయంలో జరిగే కార్యక్రమాల నిర్వహణలో సహాయపడే వాడిని. ఇలా తెలీకుండానే నేను వైజాగ్ వచ్చి దాదాపు సంవత్సరం అయిపోయింది. నాకు ఇష్టమైన విధంగా జీవిస్తూనే ఉన్నా కూడా, నాకెందుకో ఒక రకమైన వెలితి భావన మొదలయ్యింది . నిజానికి నాకు ఆరోగ్యపరంగా కానీ, ఆర్థికపరంగా కానీ ఎటువంటి

ఇబ్బంది లేదు.అన్నీ ఉన్నా ఎదో తెలీని వెలితి అనిపించేది. ఈ వెలితి ఏంటో , ఎలా తీర్చుకోవాలో తెలీదు. ఎవరితో చెప్పుకోవాలో, ఎలా చెప్పాలో కూడా తెలిసేది కాదు. కానీ, రోజు రోజుకీ ఈ భావన పెరిగిపోతూ ఉండేది.

ఇంతలో ఒక వారం ముఖ్య అతిథిగా శ్రీ వివేకానందం గారు వచ్చారు. ఆయన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, "శాంతి వనం" అనే ఆశ్రమానికి అధిపతి. ఆయన ఆ రోజు ‘‘తదుపరి మెట్టు" అనే అంశం పై ప్రసంగించారు. అది ఆద్యంతం చాల ఆసక్తిగా, ఆలోచించేట్టుగా, చక్కటి ఛలోక్తులతో సాగింది. ముందుగా సభలోని వారిని రాబోయే రోజుల్లో మీరేమి చేయదల్చుకొన్నారు అని అడిగారు. చాలామంది దైనందిక వ్యవహారాల గురించి చెప్పారు. ఉదాహరణకి, ఇల్లు కట్టుకోవాలనో, పిల్లల పెళ్లి చేయాలనో, కారు కొనాలనో లాంటి లక్ష్యాలు చెప్పారు. మరికొందరు వారి కలలనే తదుపరి మెట్ల గా చెప్పారు. ఇవి ఒక గొప్ప నటుడు అవ్వాలనో, పెద్ద వ్యాపారవేత్త కావాలనో లాంటివి. మరి కొందరు నా లాంటి వారు ఏమి మాట్లాడకుండా ఉండిపోయారు. ఈ మౌనానికి కారణం ఏమి చెయ్యాలో తెలియకపోవడం కానీ, వేటి మీద ఆసక్తి లేకపోవడం కానీ. వివేకానంద గారు ముందుగా మాట్లాడిన వారిని అభినందించి వారు అనుకున్న మెట్లు అధిరోహించడానికి కావాల్సిన ప్రోత్సాహం, చేయవలసిన పనులు వివరించారు.

ఆ తరువాత మాట్లాడని మా లాంటి వాళ్ళగురించి చాల బాగా చెప్పారు. ముందుగా ఏమి చెయ్యాలో తెలియకపోవడానికి, వేటి మీదా ఆసక్తి లేకపోవడానికి కారణాలు వివరించారు. నిజానికి మనిషికి బాధ్యతలు కాని, జీవితాశయం కాని తీరినప్పుడు ఇలాంటి స్థితికి వస్తాడు.

ఎందుకంటే, బాధ్యతలు మరియు జీవితాశయం తీరేంతవరకు మనిషి క్షణం తీరికలేకుండా ఉంటాడు. కొందరికి కుటుంబ, ఆర్థిక పరమైన బాధ్యతలు జీవితాంతం ఉంటాయి. మరికొందరికి బాధ్యతలు లేకపోయినా వారి ఆశయ సాధన జీవితాంతం కొనసాగిస్తారు. కళాకారులు , రాజకీయవేత్తలు లాంటి వారు ఈ కోవలోకి వస్తారు. ఇవేమి లేనివారు , అంటే బాధ్యతలు, జీవితాశయం లేని వారు నిరాసక్తిగా, ఏమీ చేయకుండా గడిపేస్తుంటారు. ఇలా వివరించిన తరువాత మనకు ఆసక్తి లేకపోవడానికి మూల కారణాన్ని కనుక్కొని, దానిని ఎదుర్కొనే మార్గం గురించి చక్కటి ఉదాహరణలతో చెప్పారు. అలాగే తరువాత ఏమి చెయ్యాలో తెలీని వాళ్లకి ఆశయాలను ఎలా తెలుసుకోవాలి , తరువాత ఎలా ముందుకు వెళ్ళాలి లాంటి వాటిని వివరంగా చెప్పారు. ఈ ప్రసంగం వింటున్న ఒకాయన తాను ప్రస్తుతం ఆసక్తి, ఆశయం లేని స్థితిలో ఉన్నానని, అందులోంచి ఎలా బయటపడాలని అడిగారు. దానికి ఆయన ఈ ప్రశ్నకి సమాధానం మనిషి, మనిషికి మారుతుందని, వారి గతం, ప్రస్తుత జీవితం అర్థం చేసుకుంటే కానీ సమాధానం ఇవ్వలేనని, ఆసక్తి కలవారు తనని తరువాత సంప్రదించమని చెప్పారు.

అవన్నీ వింటుంటే, ఆయన మాటలు నా ప్రస్తుత మానసిక స్థితిని ప్రతిబింబిస్తోందనిపించింది. ఎందుకంటే నాకు కూడా ఇక ముందు ఏమి చెయ్యాలో తెలియట్లేదు, చెయ్యాలనే ఆసక్తి కూడా కలగట్లేదు. ఎందుకో వివేకానందం గారిని విడిగా కలసి మాట్లాడనిపించింది. ఒక రకంగా నన్ను ఈ ప్రసంగం చాలా ప్రభావితం చేసింది. ఆ మర్నాడే ఆయనకి ఫోన్ చేసి ఆయన ఆశ్రమానికి రెండు రోజుల తరువాత ఆయన చెప్పిన సమయానికి వెళ్ళాను. ఆ ఆశ్రమం ఎంతో అందంగా, ప్రశాంతంగా ఉంది. చిన్న ఆశ్రమం అయినా ఎంతో శుభ్రంగా తీర్చి దిద్దారు. నన్ను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

కాసేపు మామూలు కబుర్లు చెప్పాక , నా గతాన్ని, ప్రస్తుత జీవితాన్ని గురించి చెప్పమన్నారు. నేను పుట్టినప్పటినుండి నేటి వరకూ జరిగిన ముఖ్య సంఘటనలన్నీ వివరంగా దాదాపు రెండు గంటల సేపు చెప్పాను.

ఆయన ఎటువంటి ప్రశ్నలు వేయకుండా ఎంతో శ్రద్దగా విన్నారు. కాసేపు మౌనంగా ఉండి ఆయన నాతో "నీ జీవితం చాల ఆసక్తిగా, చక్కగా సాగింది. నీవు ఎన్నో బాధ్యతలు నిర్వర్తించావు, ఎన్నో ఆశయాలను సాధించావు. ఒక ఉద్యోగస్తుడిగా, వ్యవసాయదారుడిగా, వ్యాపారస్తుడిగా రాణించావు. నీ చుట్టూ ఉన్న సమాజానికి ఎంతో సేవ చేసావు. నీకు నచ్చినట్టుగా బ్రతికావు. నీ లాంటి వాళ్లు ఈ స్థితిలోకి రావడం సహజం. నీకు సరైన సలహా ఇవ్వడానికి నేను జాగ్రత్తగా ఆలోచించాలి. అందుకు నాకు కాస్త వ్యవధి కావాలి. వచ్చే సోమవారం మళ్ళీ ఇదే సమయానికి ఇక్కడకు రాగలుగుతావా" అన్నారు. నేను వెంటనే తప్పకుండా అని చెప్పి ఆయన దగ్గర సెలవు తీసుకుని వచ్చేసాను.

ఆ తరువాత సోమవారం వివేకానందం గారు చెప్పిన సమయానికి ఆశ్రమానికి వెళ్ళాను. ఆయన ముందుగా నాకు ఆశ్రమం పెట్టడానికి కారణాలు, ఆశయం గురించి వివరించారు. ఆయన కూడా నా లాంటి స్థితిలో కొన్ని సంవత్సరాల క్రితం ఉండేవారట. పిల్లలు పెద్ద అయ్యి విదేశాల్లో స్థిర పడ్డారట. ఈయన కూడా ఒక పెద్ద కంపెనీలో మానవ వనరుల శాఖకి అధిపతిగా పని చేసి స్వచ్ఛంద విరమణ తీసుకున్నారట. పదవిలో ఉన్నప్పుడు కంపెనీ తరపున సామాజిక సేవ కార్యక్రమాలు చాల నిర్వర్తించారట. అలాగే, ఎంతో మంది వ్యక్తిత్వ వికాసానికి దోహద పడ్డారట. అది ఆయనకు చాల నచ్చిన పని, ఎంతో నైపుణ్యం కూడా ఉన్న పని. పదవీ విరమణ తీసుకోవడానికి కారణం బాధ్యతలు తీరడమే కాకుండా, ఆయనకు నచ్చిన పనిని, సామాజిక సేవని మరింతగా చేయడానికి కూడా.

పదవీ విరమణ చేసాక కొంత సమయం తీసుకుని, ఆలోచించి తీసుకున్న నిర్ణయమే ఈ "శాంతి వనం" ఆశ్రమ స్థాపన.

ఆయన సొంత స్థలంలో , ఆయనకు నచ్చిన విధంగా, ఎంతో శ్రద్ధ తీసుకుని ఈ ఆశ్రమాన్ని కట్టి అయిదు సంవత్సరాల నుంచి నిర్వర్తిస్తున్నారు. ఆశ్రమం తరపు నుంచి అనేక సామాజిక సేవ, అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారు.

ఉదాహరణకి పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకి స్ఫూర్తి నింపే ప్రసంగాలు, కాలుష్య నివారణ లాంటివి. ఇవి కాకుండా ఆశ్రమంలో వ్యక్తిత్వ వికాసం, ధ్యాన సాధన లాంటి అంశాలపై బోధన , ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తారు. ఇవి కాకుండా అయన బయటకి కూడా వెళ్లి ప్రసంగాలు చేస్తారు, సాహితీ నిలయంకి వచ్చినట్టు. మెల్లగా ఆయన లాంటి ఆలోచన, ఆశయం ఉన్న కొందరు ఈ ఆశ్రమ నిర్వహణలో చేరారు. వారిలో కొందరు ఆశ్రమంలోనే ఉంటారట. కొందరు మాత్రం వారి ఇంటి దగ్గరే ఉంటూ ఆశ్రమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారట.

ఇదంతా వివరించాక నాకు ఆశ్రమం మొత్తం తిప్పి చూపించారు. ఆశ్రమంలో వివేకానాందం గారి కార్యాలయం కాక, ధ్యాన మందిరం, రెండు తరగతి గదులు, భోజనశాల, పది గదులు, చుట్టూరా చెట్లు, మధ్యలో చిన్న తోట ఉన్నాయి. ఇవన్నీ చాల నిరాడంబరంగా , అందంగా ఉన్నాయి. ఇవన్నీ చూస్తుంటే నాకు వీళ్ళతో చేరి నా వంతు సహాయం చెయ్యాలనిపించింది. అంతా చూసి వచ్చాక ఆయన కార్యాలయంలోకి తీసుకెళ్లారు. ఎంతో ఆత్రుతగా ఆయన ఏమి చెప్తారో అని ఎదురు చూస్తున్న నాతో ఆయన "గౌతమ్, నువ్వు చెప్పింది అంతా విని బాగా ఆలోచించాక నాకు కలిగిన అభిప్రాయం చెప్తాను. ప్రస్తుతం నీవున్న పరిస్థితిలో ఒంటరిగా ఉండేకంటే, పదిమందిలో ఉంటూనే నీకు కావాల్సినట్టుగా సమయాన్ని గడపడం ఉత్తమం. ఎందుకంటే, ఒంటరితనం మనిషిని క్రుంగతీస్తుంది. నిరాశకి గురి చేస్తుంది. అదే పదిమందిలో ఉంటే నీకు వెయ్యి రెట్లు బలం వస్తుంది. నీ తెలివితేటలను పదిమందికి పంచాల్సిన సమయంలో ఇలా వెనక్కు తగ్గడం బాగాలేదు. నా సలహా ఏమిటంటే నువ్వు వెంటనే ఆ ఇల్లు ఖాళీ చేసి మా ఆశ్రమంలో కాని, ఇంకెవరితో నైనా కానీ జీవించడం మొదలుపెట్టు. మా ఆశ్రమంలోకి సంతోషంగా ఆహ్వానిస్తున్నాము. ఇక్కడ నీకు నచ్చినట్టుగా జీవించవచ్చు.

మా ఆశ్రమ కార్యక్రమాల్లో పాల్గొనడమే కాక నీకు నచ్చిన కార్యక్రమాలు కూడా చేయవచ్చు. ఇప్పుడే నీ నిర్ణయం చెప్పనవసరం లేదు. బాగా ఆలోచించి చెప్పు" అన్నారు.

నేను "నాక్కూడా ఈ ఆశ్రమంలో చేరాలని ఉంది. ఒక రెండు, మూడు రోజుల్లో ఆలోచించుకొని చెప్తాను" అని వచ్చేసాను. ఇంటికి వచ్చిన తరువాత రెండు, మూడు రోజులు ఆయన చెప్పిన మాటలు తీవ్రంగా ఆలోచించాను. అంతే కాకుండా, నా స్నేహితులు, సత్య మూర్తి మాస్టారు , కిరణ్ బావ , మురళి అన్నతో చర్చించాను. అందరి అభిప్రాయం ఒకటే. నేను ఇలా ఒంటరిగా ఉండేకంటే వివేకానంద గారి ఆశ్రమంలో చేరడం మంచిదని. అలా కాదనుకుంటే వాళ్ళ దగ్గరికి వచ్చేయమన్నారు. నాకు వివేకానంద గారు చెప్పినట్టుగా నలుగురిలో ఉంటూనే నాకు నచ్చిన రీతిగా బ్రతకడం అనేది సరి అయిన నిర్ణయం అనిపించింది. నా నిర్ణయాన్ని వివేకానంద గారికి చెప్పి ఇక్కడ ఇల్లు ఖాళీ చేసి "శాంతి వనం" ఆశ్రమం కి వెళ్ళిపోయాను. అంతటితో నా దేశ పర్యటన పర్వం ముగిసింది.

ఆశ్రమంలో నేను ఉండడానికి గది , భోజన వసతి కల్పించారు. ఆ రోజు నుంచి ఆశ్రమ నియమాలు పాటిస్తూ, ప్రశాంతంగా జీవించడం మొదలు పెట్టాను. అక్కడి దినచర్య వ్యాయామం, ధ్యానం, తోట పని, వంట పని లాంటి వాటిల్లో పాల్గొనేవాడిని. వివేకానంద గారితో రోజు మాట్లాడే అవకాశం వచ్చేది. ఆయన ప్రసంగాలకి నన్ను కూడా వెంట తీసుకెళ్లేవారు. అవన్నీ శ్రద్ధగా విని నా సందేహాలు, అభిప్రాయాలూ చెప్పేవాడిని. ఆయన వాటన్నిటికీ ఓర్పుతో సమాధానాలు చెప్పేవారు. ఒక్కొక్క సారి అవి మంచి చర్చకు దారి తీసేవి. ఆయనలో గొప్పదనం ఏమిటంటే, అవతల వారు చెప్పేదానిలో విషయం ఉంటే దాన్ని ఒప్పుకోవడమే కాకుండా తరువాత ప్రసంగాలలో అవి ప్రస్తావించేవారు. ఆయనలో కోపం, అసహ్యం, అసహనం, అహం లాంటివి మచ్చుకైనా కనిపించేవి కావు. ఉన్న దానితో తృప్తిగా ఉండడం, అన్నిటినీ ఒకే రకంగా స్వీకరించడం చేసేవారు. అందుకే ఆయన గొప్ప ఆధ్యాత్మిక వేత్త అయ్యారు. ఆయన దగ్గరి నుంచి నేర్చుకోవడానికి ఎంతో ఉంది. నా కెందుకో ఎప్పటికీ ఇక్కడే ఉండాలని, ఇదే నా ఆఖరి మజిలీ అవ్వాలని అనిపించేది .

వివేకానంద గారు కూడా నా ప్రవర్తనను గమనిస్తూ మెల్లగా మరి కొన్ని కార్యక్రమాలలో నన్ను కలుపుకునే వారు. అందులో ఆశ్రమంలో నిర్వర్తించే వ్యక్తిత్వ వికాసం బోధనలో కొన్ని అంశాలపై నన్ను మాట్లాడమనే వారు. ఆలోచనా విధానాన్ని ఎలా పెంచుకోవాలి అనే దానిపైన జీవితంలో నేను చూసిన ఉదాహరహణలను ప్రస్తావిస్తూ మాట్లాడేవాడిని. ఆయన కూడా క్లాస్ రూమ్ లో కూర్చుని విని తరువాత ఆయన అభిప్రాయం చెప్పేవారు. అలానే సామాజిక సేవా కార్యక్రమాలన్నిటిలో చురుకుగా పాల్గొనేవాడిని. నా మీద నమ్మకం కలగడంతో కొన్ని చిన్న కార్యక్రమాలకు నన్ను ఒక్కడినే పంపించేవారు. వాటిని విజయవంతం చేసి వచ్చేవాడిని. అందులో ఒకదాని గురించి ముఖ్యంగా చెప్పాలి. ఒక ప్రభుత్వ పాఠశాలకి వ్యక్తిత్వ వికాసం బోధించడానికి కొన్ని నెలలు వెళ్ళాను.

అక్కడ అందరూ పేద విద్యార్థులే ఉండేవారు. అక్కడ ప్రధానోపాధ్యాయులు చాల మంచివారు. ఆ పేద విద్యార్థులకి చాల రకాలుగా సహాయం చేసేవారు. నాకు తెలిసిన ఇంకో విషయం ఏమిటంటే, అందులో ఒక ఐదు మంది అనాథలు కూడా ఉన్నారు. వారు పాఠశాలలోనే నివసిస్తున్నారు. వాళ్ళ పరిస్థితి చాల దయనీయంగా ఉండేది. ఆ విషయం పై చాల ఆలోచించి, వారిని ఆశ్రమానికి తీసుకొద్దామనుకొన్నాను. వీళ్ళు నా గదిలోనే ఆశ్రమంలో ఉంటూ, అక్కడే తింటూ పాఠశాలకి వెళ్లిరావచ్చు కదా అనిపించింది. ఈ విషయం వివేకానంద గారితో చెప్పినప్పుడు, ఆయన సంతోషంగా ఒప్పుకొన్నారు. అంత మంచి ఆలోచన వచ్చినందుకు నన్ను అభినందించారు.

వెంటనే నా ఆలోచనను అమలు చేసి పాఠశాల ప్రధానోపాధ్యులు గారి కి చెప్పి వారిని ఆశ్రమానికి తీసుకొచ్చేశాను. వారికి కావలిసినవన్నీ దగ్గరుండి చూసుకుంటూ, వారితో కబుర్లు చెప్తూ ఈ మంచి వాతావరణానికి అలవాటు చేశాను. ఆ చిన్నారులు నన్ను తాతయ్య అని పిలుస్తుంటే ఎంతో ముచ్చటగా ఉండేది. వాళ్లలో సీత, లక్ష్మి అనే ఇద్దరు అమ్మాయిలు భరత్ , వివేక్, వినోద్ అనే ముగ్గురు అబ్బాయిలు. అందరూ కూడా ఎనిమిది, తొమ్మిదేళ్ళ వయసు వాళ్ళు. వారు మెల్లగా ఆశ్రమంలోని మిగతావారితో కూడా అలవాటుపడ్డారు.

ఆశ్రమ కార్యక్రమాల్లో వారి ఆట, పాటలతో అందరినీ ఆకట్టుకొనేవారు. నాకు వారితో మాట్లాడుతుంటే సమయం తెలిసేది కాదు. ఒక ఐదు మంది చిన్నారులని అనాథ జీవితానికి దూరం చేశానని తృప్తిగా ఉండేది.

అలా చూస్తుండగా ఒక సంవత్సరం గడచిపోవడం, నాకు ఆశ్రమంతో, ముఖ్యంగా వివేకానంద గారితో మంచి అనుబంధం కలిగింది. ఈ సంవత్సర కాలంలో, నా జీవిత కథ రాయడం కూడా పూర్తయింది, అమ్మ ఒడి నుంచి ఆశ్రమ జీవితం వరకూ . ఈ పుస్తకాన్ని వివేకానంద గారికి చదివి అభిప్రాయం చెప్పమని ఇచ్చాను. ఆయన దాన్ని పూర్తిగా చదివి, కొన్ని మార్పులు, చేర్పులు చెప్పారు. అవి పూర్తయ్యాక మళ్ళీ ఇంకోసారి చదివి నాతో "ఇంత మంచి పుస్తకం ఇలా చేతి రాత తో మిగిలి పోకూడదు. ఇందులో ఎన్నో మంచి విషయాలు ఉన్నాయి. ఇది అందరికీ స్ఫూర్తి నిచ్చే పుస్తకం. దీన్ని అందరూ చదవాలి. ఈ పుస్తకాన్ని నేనే ప్రచురిస్తాను. దీనికి నిండు జీవితం అనే పేరు బాగుంటుంది" అన్నారు. అంత పెద్దాయన చెబుతుంటే నేను కాదనలేకపోయాను. ఆయన్ని ఈ పుస్తకానికి ముందు మాట రాయమని అడిగాను. దానికి ఆయన వెంటనే ఒప్పుకొని ప్రచురణ మొదలు పెట్టారు. ఆ పుస్తక ప్రచురణ పూర్తయ్యేసరికి నాకు అరవై ఏళ్ళు పూర్తయ్యాయి. అది తెలుసుకొన్న ఆయన, నా పుట్టినరోజు నాడే పుస్తక విడుదల కార్యక్రమం చేపట్టారు. ఆ రోజు పొద్దున్నే నిద్ర లేచిన నాకు అన్నీ ఆశ్చర్యపోయే సంఘటనలే జరిగాయి.

ముందుగా నా స్నేహితులు గిరీష్, శ్రీరామ్ వచ్చారు. కాసేపటికి సూర్య, సత్యమూర్తి మాస్టారు కలసి వచ్చారు.. తరువాత కాసేపటికి రాంబాబు, గిరి, సూరి వచ్చారు. మధ్యాహ్నానికి కిరణ్ బావ, అజయ్, అఖిల, రాజారావు గారు, స్వాతి కుటుంబం వచ్చారు హైదరాబాద్ నుంచి. వివేకానంద గారు, నాకు తెలియకుండా వీరందరినీ రప్పించారు. సాయంత్రం సభా సమయానికి ఊర్లో పెద్దలు, ఆశ్రమ వాసులు, సాహితీ నివాస్ సభ్యులు, విలేఖరులు వచ్చారు.

వివేకానంద గారు సభ ప్రారంభిస్తూ "మిత్రులారా, మా ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడకు వచ్చిన మీ అందరికి కృతజ్ఞతలు. ఈ రోజు నాకు ముఖ్యమైన రోజు. ఎందుకంటే నా ఆప్త మిత్రుడు, మీలో ఎందరికో ఆప్తుడు అయిన గౌతమ్ షష్ఠిపూర్తి రోజు. అందుకే ఈ రోజు వేడుకని షష్ఠి పూర్తి వేడుకగా కూడా జరుపుకుందాం. అందరూ షష్ఠి పూర్తి చేసుకున్న వారికి బహుమతి ఇస్తే, మనకు గౌతమ్ తన జీవిత చరిత్రను "నిండు జీవితం" అనే పేరుతో తానే స్వయంగా రాసి మనకు బహుమతిగా ఇస్తున్నాడు. ఈ పుస్తకం గురించి చెప్పేముందు గౌతమ్ గురించి కొన్ని మాటలు చెప్పాలని ఉంది. నా దృష్టిలో గౌతమ్ ఒక గొప్ప వ్యక్తి. విద్య, ఉద్యోగం, వ్యవసాయం, వ్యాపారం, రాజకీయం ఇలా అన్ని రంగాలలో ప్రావీణ్యం సంపాదించడమే కాకుండా వాటి ద్వారా సమాజ సేవ కూడా చేశాడు. ఇది చాలా కొద్ది మందికి మాత్రమే సాధ్యం.

తన సొంత తల్లి తండ్రులని చిన్న వయసులోనే పోగొట్టుకున్నా , ఎంతో మంది ఆత్మ బంధువులని సంపాదించుకున్నాడు. ఒక ఇంట్లో కొడుకు పాత్రలో పిన్ని, బాబాయి వరస కలిపి వారికి ఎంతో సేవ చేశాడు. అలాగే, ఇంకొక ఇంట్లో మేనమామ పాత్రలో ఇద్దరు పిల్లలని తీర్చి దిద్దడమే కాకుండా వారి తండ్రి, బామ్మకు ఎంతో దగ్గరయ్యాడు. వారి వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాడు. ఈ మధ్యనే ఐదు మంది అనాధ బాలురిని చేరదీసి వారికి తాతయ్య కూడా అయ్యాడు. ఇలా , జీవితంలో అన్ని వరుసలూ అనుభవించాడు .ఇంక మిత్రులతో బంధం గురించి చెప్పనక్కరలేదు. కేవలం వారితో సరదాగా గడపడమే కాక వారు జీవితంలో స్థిర పడడానికి చాలా దోహద పడ్డాడు. అలానే, తన సేవా కార్యక్రమాలతో ఒక ఊరి రూపురేఖలు మార్చేశాడు. దాని ఫలితమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్రామ సేవకుడు బిరుదు. అలాగే ఉద్యోగంలో సొంతంగా కనిపెట్టిన జల వనరుల పరిశోధన సాధనాలు చాలా మందికి ఉపయోగపడ్డాయి. ఇప్పటికీ వాటిని ఎంతో మంది వాడుతున్నారు. ఇవన్నీ చూసిన మనం గౌతమ్ బహుముఖ ప్రజ్ఞాశాలుడు అని చెప్పడంలో ఎటువంటి సందేహం అక్కరలేదు.

సొంత బంధువులకు దూరమైనా ఎంతో మందితో బంధుత్వం కలుపుకొని వారి బాధ్యతలని తీసుకుని సమర్ధవంతంగా పూర్తి చేశాడు.

ఎప్పుడైతే తాను వచ్చిన పని పూర్తవుతుందో అక్కడినుండి ఇంకొక చోటికి పయనం అయ్యేవాడు. ఇలా కొన్నేళ్లు గడిపాక తనకు నచ్చిన ప్రదేశాలకి వెళ్లి అక్కడ తనకు నచ్చిన విధంగా జీవించేవాడు.

అలా తిరిగి తిరిగి, ఇక్కడకు రావడం జరిగింది. ఒక రకమైన ఒంటరితనం, నిరాశక్తితనంతో ఉన్న అతన్ని నేను కలవడం జరిగింది. గౌతమ్ తో మాట్లాడిన వాళ్లెవరూ అతని సాంగత్యాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు. నేనూ వాళ్లలో ఒకడిని. అందుకే అతన్ని ఈ ఆశ్రమంలోకి ఆహ్వానించాను. అతను ఆశ్రమం లో చేరి గడిపిన సంవత్సర కాలంలోనే ఆశ్రమ ప్రగతికి ఎంతగానో తోడ్పడ్డాడు. ఇన్ని రకాలుగా సేవ చేస్తూ, జీవితంలో కష్టసుఖాలని, జీవిత దశలని, బంధాలని దాటి వచ్చిన గౌతమ్ జీవితం "నిండు జీవితం" అని చెప్పుకోవడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అందుకే ఈ పుస్తకానికి ఆ పేరు పెట్టి ప్రచురించాను. ఈ రోజు మీ అందరి ముందు విడుదల చేస్తున్నందుకు చాలా సంతోషంగా, తృప్తిగా ఉంది" అన్నారు.

చక్కటి ప్రసంగాన్ని ఆయన చక్కటి గొంతు లో విన్న ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేశారు. నాకెందుకో, నా జీవిత సారాంశాన్ని పది నిముషాల్లో చక్కగా చెప్పారనిపించింది. ఆ తరువాత ఆయన సూచన ప్రకారం నా ఆప్త మిత్రులు, స్వాతి, కిరణ్, మరి కొందరు మాట్లాడారు. నాతో వారికున్న అనుబంధం, నాపై వారి అభిప్రాయాన్ని పంచుకొన్నారు. అవన్నీ వింటున్న నాకు సంతోషం, బాధ రెండూ కలిగాయి. మనసంతా అదోలా అయిపోయింది. ఆ తరువాత పుస్తక విడుదల కార్యక్రమం జరిగింది. మొదటి పుస్తకం వివేకానంద గారికి ఇచ్చాను, ఎందుకంటే ఆయనే దీనికి మూల కారణం. ఆ తరువాత నా మిత్రులందరికీ ఇచ్చాను. చివరిగా వివేకానంద గారు నన్ను మాట్లాడమన్నారు.

ఒక రకమైన భావోద్వేగానికి గురైన నేను కాసేపు మాట్లాడ లేకపోయాను. తరువాత మెల్లగా మాట్లాడడం ఇలా మొదలు పెట్టాను. ముందుగా అందరికీ అభినందనలు. దూరం నుంచి సమయం చేసుకొని ఇక్కడకు వచ్చిన మీ అందరికీ కృతజ్ఞతలు.

ఈ రోజు నా జీవితంలో మర్చిపోలేని రోజు. ఎందుకంటే నా ఆప్తులందరిని ఒక చోట చూడగలిగాను. ఈ తృప్తి చాలు ఈ జీవితానికి. ఈ సమావేశం జరగడానికి, నా ఈ పట్టలేని ఆనందానికి ముఖ్య కారకులైన వివేకానంద గారికి ఎంతో ఋణ పడి ఉంటాను.

మీ అందరూ మన అనుబంధం గురించి చెప్తుంటే గతమంతా గుర్తుకొచ్చి మనసంతా ఒక రకమైన ఉద్వేగంతో నిండిపోయింది. వివేకానంద గారి ఉపన్యాసంలో ఈ పుస్తకాన్ని, నా జీవిత కథని క్లుప్తంగా పది నిముషాలలో చక్కగా వివరించారు.

నిజానికి నా జీవితంలో సాధించిన విజయంలో మీ పాత్ర ఎంతో ఉంది. మీరంతా నాకు కష్టసుఖాల్లో తోడున్నారు. నాకు సలహాలిస్తూ, సాయం చేస్తూ ముందుకు నడిపించారు. నిజానికి మీరు లేనిదే నేను లేను. దీనికి కృతజ్ఞత చెప్పడానికి మాటలు రావడం లేదు. సంవత్సరం క్రితం ఒక దశా, దిశా లేకుండా జీవిత ప్రవాహంలో కొట్టుకుపోతున్న నన్ను వివేకానంద గారు ఈ శాంతి నివాసం అనే ఒడ్డు కి చేర్చారు. నా మిగిలిన జీవితానికి నిర్దిష్టమైన ఉపదేశం చేశారు. నేను అదే అనుసరిస్తూ ముందుకు వెళ్తాను. " అంటూ ముగించాను. ఆ తరువాత మేమంతా కలసి ఫోటోలు తీసుకొన్నాము. ఆ మర్నాడు పొద్దున్నే బయట నుంచి వచ్చిన వాళ్లంతా వెళ్లి పోయారు. నేను తిరిగి నా దిన చర్యలో నిమగ్నమైపోయాను,

అప్పటి నుండి గౌతమ్ బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా ఆశ్రమంలోనే తనకు నచ్చినట్లుగా ఆశ్రమ కార్యక్రమాల్లో, ధ్యానంలో, పిల్లల సాంగత్యంలో పాల్గొంటూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిండు జీవితాన్ని ప్రశాంతంగా గడిపాడు.

|| సర్వేజనాః సుఖినోభవంతు ||